


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 15 గురువారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 240
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

# భారత్‌పై భారీ కుట్ర!

- ఐఎస్ఐ అడ్డాగా ఢిల్లీలోని పాక్ హైకమిషన్ ఉద్యోగి కుట్ర
- భారత్‌లో విధ్వంసం సృష్టించడానికి వ్యూహాలు పన్నినట్లు వెల్లడి
- ఉన్నతస్థాయి అధికార హోదాలో కొనసాగు తూనే చట్టవిరుద్ధ,
- కుట్రపూరక చర్యలకు పాల్పడినట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు
- దేశ భద్రతకు సంబంధించిన కొంత విలువైన సమాచారాని
- పాకిస్థాన్‌కు చేరవేసినట్లూ నిర్ధారణ..చర్యలకై సన్నద్ధం

2




న్యూఢిల్లీ–నవభూమిబ్యూరో
జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో చోటుచేసుకున్న ఉగ్రవాదుల దాడి అనంతరం భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం పతాక స్థాయికి చేరుకుంది. రెండు దేశాలు దాడులు ప్రతిదాడులకు దిగాయి. డ్రోన్లు, మిస్సైళ్లను సంధించుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకోవడంతో కాల్పుల విరమణకు అంగీకరించాయి. పహల్గామ్‌లో చోటు చేసుకున్న మారణహోమానికి పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులే కారణం కావడం వాటిపై భారీగా దాడులు చేపట్టింది. 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులపై వైమానిక దాడులు సాగించింది భారత్. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ భూభాగంపై పాతుకుపోయిన ఉగ్రవాద సంస్థలను పెకిలించివేసింది.
అంతకుముందు– పాకిస్తాన్‌పై పలు ఆంక్షలను విధించింది. అట్టారీ– వాఘా బోర్డర్‌ను మూసివేసింది. చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్లతో భారత్‌కు వచ్చిన, ఇక్కడ నివసిస్తోన్న పాకిస్తానీయులు కూడా తమ స్వదేశానికి వెళ్లిపోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. దాదాపుగా పాకిస్తానీయులందరూ స్వదేశానికి తిరుగు ముఖం పట్టారు. అత్యవసర వైద్య చికిత్స, వ్యాపార కార్యకలాపాలు, ఇక్కడ నివసిస్తోన్న తమ బంధువులను కలుసుకోవడం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి కారణాలతో తరచూ పలువురు పాకిస్తానీయులు విదేశాంగ, రక్షణ మంత్రిత్వ శాఖలు జారీ చేసే అధికారిక డాక్యుమెంట్లతో భారత్‌కు వచ్చిన వాళ్లందరూ అట్టారీ బోర్డర్ మీదుగా సరిహద్దుల ను దాటారు. ఈ పరిణామాల మధ్య ఇప్పుడు తాజాగా మరో భారీ కుట్ర వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగి ఒకరు భారత్‌లో విధ్వంసం సృష్టించడానికి వ్యూహాలు పన్నినట్లు తేలింది. హైకమిషన్ కార్యాలయంలో

# శాంతి చర్చలు జరపండి

- ఆపరేషన్ కగార్‌పై మావోయిస్టులు లేఖ..
- మావోయిస్ట్ పార్టీ. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరిట లేఖ
- శాంతియుత సంభాషణల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి మావోయిస్టు పార్టీ సిద్ధమే
- ఛత్తీస్‌ఘడ్ డీజీపీ ప్రెస్ మీట్‌లో వెల్లడి



బీజాపూర్–నవభూమిబ్యూరో
చర్చల ద్వారా శాంతిని నెలకొల్పాలని కోరుతూ మరో లేఖ విడుదల చేసింది మావోయిస్ట్ పార్టీ. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో ఈ లేఖ రిలీజ్ చేశారు. శాంతియుత సంభాషణల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి మా పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని.. గౌరవనీయులైన మోదీ ప్రభుత్వం దీనికి అనుకూలంగా ఉందో లేదో స్పష్టం చేయాలని ఆ లేఖలో కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి, ఆపరేషన్ కగార్‌ను ఆపడానికి ముందుకు రండని సదరు లేఖలో కోరారు. శాంతి చర్చలు జరపడానికి ప్రభుత్వాన్ని ఒప్పించడానికి ముందుకు రండి...అంటూ అటు పౌర హక్కుల ప్రజాస్వామ్యవాదులకు కూడా మావోయిస్ట్ పార్టీ ఈ సందర్భంగా పిలుపునిచ్చింది.
ఇలా ఉండగా, 'ఆపరేషన్ కగార్' పేరుతో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ముందుకు సాగుతోంది కేంద్రం. అయితే, భారత్–పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆపరేషన్ కగార్‌ను తాత్కాలికంగా వాయి దా వేసింది ప్రభుత్వం. ఇక, తాము శాంతి చర్చలకు సిద్ధ మని మావోయిస్టులు ఎప్పుటి నుంచో చెబుతూ వస్తున్నారు. మరోవైపు శాంతి చర్చలు జరపడానికి ప్రభుత్వాన్ని ఒప్పించడానికి అంటూ పౌర హక్కుల సంఘాలు కూడా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాంతి నెలకొల్పాలని కోరుతూ మరో లేఖ విడుదల చేసింది మావోయిస్టు పార్టీ.

## 52వ సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం

- ప్రమాణస్వీకారం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- ప్రధాని మోదీ,ఉపరాష్ట్రపతి,కేంద్ర మంత్రులు హాజరు

**న్యూఢిల్లీ–నవభూమిబ్యూరో:** భారత సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించగా.. ప్రధాని మోడీతో పాటు, కేంద్ర మంత్రులు, ఉప రాష్ట్రపతి, ఇతర అతిథుల పాల్గొన్నారు. మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబరు 24న గవాయ్ జన్మించారు. 1985 మార్చి 16న న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత 2003 నవంబరు



## బీజేపీలో చేరిన వైసీపీ ముస్లిం ఎమ్మెల్సీ..!

- శాసనమండలి డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా కూడా వ్యవహరించిన జకియా ఖానం
- వైసీపీ తరపున తొలిసారి ఎమ్మెల్సీ అయిన జకియా
- వైసీపీ ఓటమి తర్వాత టీడీపీలో చేరేందుకు యత్నాలు
- అనూహ్యంగా బీజేపీలో చేరడంతో నేతల విస్మయం

2



**అమరావతి–నవభూమిబ్యూరో:** ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఎంపికై ఆ తర్వాత శాసనమండలి డిప్యూటీ ఛైర్ పర్సన్ కూడా పనిచేసిన జకియా ఖానం అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఒకే రోజు ఆమె రెండు సంచలనాలు రేపారు. ఇందులో ఒకటి ఇన్నాళ్లూ తాను పనిచేసిన వైసీపీకి ఇప్పుడు అకారణంగా గుడ్ బై చెప్పడం అయితే టీడీపీలో చేరడానికి బదులు బీజేపీలో చేరిపోవడం

# కాళ్ల బేరానికి వచ్చిన పాక్

- కాల్పుల విరమణ తర్వాత సింధూ జలాలపై పాక్ లేఖ
- తాగునీరు లేక అల్లాడిపోతున్నామని కనికరించమని వేడుకోలు
- సింధూ జలాల ఒప్పందం రద్దుపై పునఃసమీక్షించాలని విన్నప
- భారత్ స్పందనకై వేచి ఉన్న పాకిస్థాన్ ప్రజలు

2



న్యూఢిల్లీ–నవభూమిబ్యూరో
పాకిస్థాన్ ప్రభుత్వం భారత్‌తో కాళ్ల బేరానికి వచ్చింది. ఉగ్రవాదుల దాడి ఎఫెక్ట్ తర్వాత భారత్ సింధు జలాలను పాక్‌కు వెళ్లకుండా నిలిపివేసింది. ఈ తర్వాత ఇరు దేశాలు కూడా చిన్నపాటి యుద్ధానికి దిగాయి. ఈ యుద్ధంలో పాకిస్థాన్ పాక్షికంగా దెబ్బతింది. మొత్తానికి ఇరు దేశాలు కాల్పుల విరమణకు రావడంతో ప్రస్తుతం సమస్య సద్దుమణిగింది. అయితే పాకిస్థాన్‌కు మాత్రం సింధు జలాలను భారత్ విడుదల చేయలేదు. తాజాగా దీనికి పాక్ భారత ప్రభుత్వానికి లేఖ రాసింది. తీవ్ర నీటి ఎద్దడితో అల్లాడుతున్నామంటూ ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేసింది. సింధూ జలాల ఒప్పందం రద్దుపై పునఃసమీక్షించాలని కోరింది. పాకిస్తాన్ ఎదుర్కొంటున్న నీటి సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంది. కరువు పరిస్థితులు నెలకొనడంతో వ్యవసాయం, తాగునీటి అవసరాలు తీర్చడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందంపై పాక్ పునరాలోచనలో పడింది. ఈ ఒప్పందం ప్రకారం భారత్ తన నదీ జలాలను పాక్‌కు పంచుకోవాల్సి ఉంది. అయితే, ఇటీవల కాలంలో భారత్ చేపడుతున్న ప్రాజెక్టుల వల్ల తమకు నీరు అందడం లేదని పాక్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.ఒప్పందం రద్దు ప్రతిపాదన ప్రాంతీయంగా కలకలం రేపుతోంది. ఒకవైపు నీటి కోసం తల్లడిల్లుతున్న పాక్‌కు ఇది తప్పనిసరి చర్యగా కనిపిస్తోంది. మరోవైపు, ఈ ఒప్పందం రద్దయితే ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత దిగజారే ప్రమాదం ఉంది. ఇప్పటికే సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ, జల వివాదం కొత్త చిచ్చు పెట్టే అవకాశం లేకపోలేదు. సింధూ జలాల ఒప్పందం ఆరు దశాబ్దాల క్రితం కుదిరింది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో జరిగిన ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య జల పంపకాలకు ఒక చట్టాన్ని ఏర్పాటు చేసింది.

# ఏపీకి కేంద్రం వరాలు

- ఏపీ తీర ప్రాంతాల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి
- నివేదికను సిద్ధం చేయాలంటూ అధికారులకు ఆదేశాలు
- ఏపీ తీర ప్రాంతాల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, రవాణా, మత్స్యకార గ్రామాల సమగ్రాభివృద్ధికి కేంద్రం కృషి
- శ్రీకాకుళం మొదలుకుని నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతాలన్నింటినీ అనుసంధానిస్తూ రోడ్ కనెక్టివిటీ కల్పించమే లక్ష్యం

2




**అమరావతి–నవభూమిబ్యూరో:** ఏపీ తీర ప్రాంతాల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అత్యంత సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉన్న రాష్ట్రానికి వరాలను ఇవ్వడానికి సన్నద్ధత వ్యక్తం చేసింది. దీనికి సంబంధించిన ఓ నివేదికను సిద్ధం చేయాలంటూ సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారులను ఆదేశించింది. ఏపీ తీర ప్రాంతాల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, రవాణా, మత్స్యకార గ్రామాల సమగ్రాభివృద్ధి, శ్రీకాకుళం మొదలుకుని నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతాలన్నింటినీ అనుసంధానిస్తూ రోడ్ కనెక్టివిటీని కల్పించడం.. వంటి అంశాలను ఈ నివేదికలో పొందుపర్చే అవకాశాలు ఉన్నాయి. %ూశ్రీంశీ ఏపీని దేశ సముద్రావృద్ధికి ముఖద్వారంగా మార్చడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుందని ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సొనొవాల్ వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. నేడు ఢిల్లీలో శర్బానంద సొనొవాల్ తో సమావేశం అయ్యారు. ఏపీ పరిశ్రమలు, మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. పలు అంశాలు ఈ సందర్భంగా వారి మధ్య చర్చకు వచ్చాయి. ప్రత్యేకించి– శ్రీకాకుళం జిల్లాలో పోర్టులు, దానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి, ఇప్పుడున్న కనెక్టివిటీని మరింత మెరుగుపర్చడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికపై మాట్లాడారు. పోర్టుల అభివృద్ధి ద్వారా ఏపీని లాజిస్టిక్స్ హబ్‌గా మార్చాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమని ఈ సందర్భంగా కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉప్పు భూములను గుర్తించడం, వాటిని వినియోగించుకోవడం, వ్యూహాత్మక– మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలకంగా మారుతుందని చెప్పారు. 974 కిలో మీటర్ల తీరప్రాంతం, 42 లక్షల మందికి పైగా ఉన్న మత్స్యకారులు ఏపీ ఆర్థిక వ్యవస్థ

# గ్రేటర్ పౌరసేవల్లో విప్లవాత్మక మార్పులు

2



- రీజియన్ పరిధిలో వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ సులభతరంగా ఉండాలి
- పూర్తి అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలి
- అధికారులను ఆదేశించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్–నవభూమిబ్యూరో
తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ సులభతరంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దీనికి సంబంధించి పూర్తి అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పౌర సేవలు, అనుమతులపై రాష్ట్ర సచివాలయంలో ఈ సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖాస్తులు చేసుకొని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని అన్నారు. ఏవైనా నిర్మాణాలు లేదా గృహాలు, వాణిజ్య సముదాయాలకు అవసరమైన సేవలకు ఒకే ప్లాట్‌ఫామ్ పైకి తీసుకుని వచ్చేలా దరఖాస్తు అందజేస్తే వారికి అవసరమైన సేవలన్నింటికి సింగిల్ విండోలో అనుమతి లభించేలా ఉండాలని సూచించారు. ఇందుకు రెవెన్యూ, పురపాలక, జల వనరులు, నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ తదితర విభాగాలు సంయుక్తంగా పని చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆయా శాఖల వసూలు చేసే బిల్లుల సైతం ఒకేసారి, ఒకే విండో ద్వారా చెల్లించే విధానం ఉండాలని చెప్పారు. వినియోగదారులు చెల్లించే మొత్తాన్ని

# పతనమైన బంగారం ధరలు

- కొనడానికి ఇదే సరైన సమయమంటున్న విశ్లేషకులు
- బంగారం ధర క్షీణతకు కారణం అంతర్జాతీయ ఒడిదుడుకులే
- భారత్-పాక్ కాల్పుల విరమణ కూడా మరో కారణం
- ఒక్కసారే గ్రాముకు 5 వేల రూపాయలకు తగ్గిన బంగారం



2

హైదరాబాద్–నవభూమిబ్యూరో
ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణుగుతుండటంతో బంగారం ధరలు ఒక్కసారిగా కుప్పకూలుతున్నాయి. ముఖ్యంగా అమెరికా పలు దేశాలతో వరుసగా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం, దశాబ్దాలుగా ఉన్న ఇండియా–పాకిస్తాన్ వివాదం కొలిక్కి రావడం వంటి పరిణామాలు అంతర్జాతీయంగా ఆందోళనలను తగ్గించాయి. ఈ నేపథ్యంలో, ఈ వారంలో రెండోసారి పసిడి ధరలు భారీగా క్షీణించాయి. బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది నిజంగా శుభవార్తే! అయితే, షాపింగ్‌కు వెళ్లే ముందు తాజా ధరలను ఒకసారి పరిశీలించడం మాత్రం తప్పనిసరి. 100 గ్రాముల 22 క్యారెట్లపై రూ.5 వేల తగ్గింపు! నిన్నటి ధరలతో పోలిస్తే, 22 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 100 గ్రాములకు ఏకంగా రూ.5 వేల భారీ తగ్గింపును నమోదు చేసింది. ఈ అనూహ్యమైన ధరల పతనం దేశవ్యాప్తంగా బంగారం కొనుగోలుదారులకు ఊరటనిస్తోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో :భారీగా తగ్గిన బంగారం ధరలు..హైదరాబాదులో పసిడి ధర ఇలా..!!" నేటి 22 క్యారెట్ల బంగారం రిటైల్ ధరలు ఇలా ఉన్నాయి: చెన్నై: 8,805 (గ్రాము) ముంబై: 8,805 (గ్రాము) ఢిల్లీ: 8,820 (గ్రాము)

# మున్సిపల్ ఛైర్మన్లపై వేటు

- కడప మేయర్ సీటు, మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పీఠాలు దక్కించుకున్న కూటమి
- సాంకేతికకారణాలు చూపుతూ ఇద్దరిని సస్పెండ్ చేసిన మున్సిపల్ శాఖ
- వీరిద్దరూ వైసీపీ పార్టీకి చెందిన వారే..
- అవినీతికి పాల్పడ్డారనే విజిలెన్స్ నివేదిక ఆధారంగా మేయర్ సురేశ్ బాబుపై వేటు
- అనుమతి లేకుండా కౌన్సిల్ భేటీలకు గైర్హాజరు అయ్యారనే సాకుతో కిశోర్‌పై వేటు

2



**న్యూఢిల్లీ–నవభూమిబ్యూరో:** ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీ మున్సిపల్ పీఠాల్ని దాదాపుగా దక్కించుకుంది. వీటిని వారి నుంచి లాక్కునేందుకు ఇప్పటికే తీవ్ర ప్రయత్నాలు చేసి విఫలమైన అధికార కూటమి సర్కార్ అసాధారణ చర్యలకు దిగింది. వైసీపీకి చెందిన ఓ మున్సిపల్ ఛైర్మన్, మరో కార్పోరేషన్ మేయర్‌పై సాంకేతిక కారణాలు చూపుతూ మున్సిపల్ శాఖ వేటు వేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ దక్కించుకున్న వాటిలో కడప మేయర్ సీటు, మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పీఠాలు ఉన్నాయి. కడప మేయర్‌గా సురేశ్ బాబు, మాచర్ల మున్సిపల్ ఛైర్మన్‌గా తురగా కిషోర్ అప్పట్లో ఎన్నికయ్యారు. అయితే వీరిని పదవుల నుంచి తప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వం.. అవన్నీ ఫలించకపోవడంతో ఇప్పుడు సాంకేతిక కారణాలు చూపుతూ వీరిపై వేటు వేసింది. కడప నగరంలో అభివృద్ధి పనుల్ని తన కుటుంబానికి చెందిన కాంట్రాక్ట్ సంస్థ ఎంఎస్ వర్ధిని కన్ స్ట్రక్షన్స్ కు అప్పగించారనే కారణంతో మేయర్ సురేశ్ బాబుపై మున్సిపల్ శాఖ ఇవాళ వేటు వేసింది. ఈ కాంట్రాక్టు సంస్థను మేయర్ సురేశ్ బాబు

## సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు : టీజీఎస్ ఆర్టీసీ

నవ వార్త

హైదరాబాద్-నవభూమి:సరస్వతి పుష్కరాలకు భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులను నడిపించాలని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, మేడ్చల్‌తో పాటు తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. 40 మంది కలిసి



పుష్కరాలకు వెళ్లాలని అనుకుంటే వారి కాలనీలకే ప్రత్యేక బస్సులను పంపేలా ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం http://tgsrtcbus.in వెబ్ సైట్‌ని సంప్రదించాలని అధికారులు సూచించారు. ప్రత్యేక బస్సుల కోసం 9676671533, 9959226154, 9959226160 నంబర్లను సంప్రదించొచ్చు.

పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేకంగా మహాలక్ష్మి బస్సులు : సరస్వతి పుష్కరాలకు తెలంగాణ ఆర్టీసీ కూడా సన్నద్ధమైంది. ఈ నెల 15 నుంచి 26 వరకు జరగనున్న ఈ పుష్కరాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా టీజీఎస్?ఆర్టీసీ కూడా ప్రత్యేకంగా బస్సులు నడపాలని నిర్ణయించినట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సామాజిక మాధ్యమం ఎక్స్?లో పోస్ట్ చేశారు.



## తెలంగాణలో కాంట్రాక్ట్ లెక్చరర్స్ తొలగింపు..?



హైదరాబాద్-నవభూమి:కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగిస్తారా లేదా తొలగిస్తారా అనే అంశం ఇప్పుడు విశ్వవిద్యాలయాల పరిధిలోకి వెళ్లిపోయింది. ఈ విషయంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ సూచించినట్లు సమాచారం. ఈసీ తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తుండటంతో.. ప్రభుత్వం ఈ అంశాన్ని విశ్వవిద్యాలయాలకు వదిలివేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించడం లేదా వారిని తొలగించి రెగ్యులర్ సిబ్బందిని నియమించడం అనేది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయానికి సంబంధించిన విషయం. అయితే విద్యాశాఖ ఈ విషయంలో విశ్వవిద్యాలయాల నిర్ణయానికి వదిలివేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లు చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా వారిని తొలగిస్తే ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు వచ్చే ప్రమాదం ఉంది.అందుకే ఈ విషయంపై విధానపరమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ విద్యాశాఖ మాత్రం కాంట్రాక్టు లెక్చరర్ల అంశంపై ఈసీలో చర్చించి ప్రతిపాదనలు పంపాలని విశ్వవిద్యాలయాలకు సూచించింది. దీనివల్ల ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే విశ్వవిద్యాలయాలు కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నా.. సమస్య పరిష్కారం కాదని, ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కాంట్రాక్టు లెక్చరర్లు చెబుతున్నారు.విద్యాశాఖలో అవగాహన లేని కొందరు అధికారుల కారణంగా అనవసర సమస్యలు వస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే ముందు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## మరో ఐదురోజులు వానలే.. హెచ్చరించిన ఐఎండీ హైదరాబాద్



హైదరాబాద్-నవభూమి: తెలంగాణలో ఐదురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిం చింది. వర్షాల నేపథ్యంలో రాగల మూడురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వడగండ్ల వానలు పడే అవకాశం ఉందని తెలిపింది. నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది.ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, యాదాద్రి భువనగిరి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో ఈదురుగాలులతో వానలు పడుతాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది.

మంచిర్యాల, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. 16న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని హెచ్చరించింది. అలాగే, శని, ఆదివారాల్లోనూ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

## దూరవిద్య ఎంసీఏ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలు విడుదల




హైదరాబాద్-నవభూమి: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ కోర్సు రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

**బీఎఫ్ఏ పరీక్షా ఫీజు స్వీకరణ**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ (అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్, ఫోటోగ్రఫీ) రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 27వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 500 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

## మృతదేహాలు కొంటాం.. మీ బంధువులదైనా.. పక్కింటివాళ్లదైనా..



హైదరాబాద్-నవభూమి:ప్రైవేటు వైద్య కళాశాలల్లో మృతదేహాల కొరత తీవ్రంగా ఏర్పడింది. వైద్య విద్యలో శరీర నిర్మాణం, అవయవాల పనితీరుపై అవగాహన కోసం విద్యార్థులకు మృతదేహాలు కీలకం. అయితే.. ప్రైవేటు కళాశాలలు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తుండటంతో మృతదేహాల కొరత ఏర్పడింది. దీంతో కొన్ని కళాశాలలు అనైతిక మార్గాల్లో మృతదేహాలను సేకరిస్తున్నా యనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల పేద కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దళారుల ద్వారా మృతదేహాలను కొనుగోలు చేస్తున్నాయని సమాచారం. మృతదేహానికి లక్ష రూపాయల వరకు చెల్లించడానికి కూడా సిద్ధపడుతున్నారని తెలుస్తోంది. అంత్యక్రియల ఖర్చు తప్పుతుందని, పైగా డబ్బు కూడా వస్తుందని దళారులు పేదలను నమ్మిస్తున్నారని ఆరోపణలున్నాయి.

%ప్రభుత్వ వైద్య కళాశాలలకు మృతదేహాలు రెండు రకాలుగా వస్తాయి. అనాథల మృతదేహాలు, రోడ్డు ప్రమాదాల్లో గుర్తుపట్టలేనంతగా దెబ్బతిన్న మృతదేహాలను కుటుంబ సభ్యులు గుర్తించకపోతే ఆసుపత్రులు స్వీకరిస్తాయి. ఇక కొందరు చనిపోయాక తమ శరీరాన్ని వైద్య కళాశాలలకు దానం చేయమని వీలునామా రాస్తుంటారు. ఇలాంటి మృతదేహాలకు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొరత ఉండదు. అయితే కొత్తగా ప్రైవేటు వైద్య కళాశాలలు పెరగడంతో వాటికి మృతదేహాల కొరత ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు వైద్య విద్య డైరెక్టరేట్‌కు లేఖలు రాశాయి.జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాల ప్రకారం.. ప్రతి వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య ఆధారంగా అనాటమీ విభాగానికి మృతదేహాలు అవసరం. సాధారణంగా 250 సీట్లు ఉన్న వైద్య కళాశాలకు ఏడాదికి సగటున 10 మృతదేహాలు అవసరం. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరంలోనే అనాటమీ ఒక ముఖ్యమైన సబ్జెక్టుగా ఉంటుంది. వైద్య విద్యలో భాగంగా మృతదేహాలను కోసి శరీర నిర్మాణం గురించి విద్యార్థులకు వివరిస్తారు. తర్వాత ఆ మృతదేహాలను ప్రత్యేక రసాయనాలతో నింపిన ఫార్మాలిన్ ట్యాంకుల్లో భద్రపరుస్తారు. దీని ద్వారా వైద్య విద్యార్థులకు మానవ శరీరంపై అనుభవపూర్వక జ్ఞానం వస్తుంది.కొన్ని వైద్య కళాశాలలు మృతదేహాలకు బదులుగా రబ్బరు బొమ్మలను ఉపయోగిస్తున్నాయి. అయితే మానవ శరీరంపై ప్రత్యక్ష అనుభవం లేకపోవడం వల్ల విద్యార్థులకు పూర్తి అవగాహన రాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మార్చురీల్లోని అన్‌క్లెయిమ్డ్ మృతదేహాలను ప్రైవేటు కళాశాలలకు విక్రయించేందుకు అనుమతిస్తూ గతంలో ప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీ చేసింది. అయితే దీనిపై నైతికపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా ప్రవేట్ వైద్య కళాశాలలు ఇలా దళారుల ద్వారా శవాలను కొని.. పరిశోధనలకు ఉపయోగించడం ఆందోళన కలిగిస్తోంది.

## రైతులకు శుభవార్త.. 4 ఎకరాలపైబడిన వారికి 'రైతుభరోసా' నిధులు..



హైదరాబాద్-నవభూమి:తెలంగాణలోని రేవంత్ సర్కార్ రైతులకు శుభవార్త చెప్పింది. అన్నదాతలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తోన్న రైతు భరోసాకు సంబంధించి రేవంత్ సర్కార్ కీలక ప్రకటన చేసింది. నాలుగెకరాలు, ఆపై భూమి ఉన్న రైతులకు ఇంకా రైతు భరోసా అందలేదు. నిధులు ఎప్పుడు విడుదలవుతాయో తెలియక.. అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ వారికి శుభవార్త చెప్పింది. రబీ సీజన్‌కు సంబంధించి నాలుగు నుంచి 10 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు మే చివరి వారంలోగా రైతు భరోసా నిధులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందుకు అవసరమైన నిధులను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చేవారంలో రైతు భరోసాపై ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తుంది. అనంతరం రైతు భరోసా చెల్లింపుల ప్రక్రియపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఇక రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రబీ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కార్యక్రమాన్ని అమలు చేసింది. మొదటి దశలో భాగంగా రైతుల అకౌంట్లలోకి నిధులను జమ చేశారు. రెండో దశలో ఫిబ్రవరి 5న, మూడో దశలో ఫిబ్రవరి 11న రైతు భరోసా నిధులు విడుదల చేశారు. మొదటి మూడు దశల్లో.. నాలుగు ఎకరాల వరకు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నాలుగెకరాలు ఆపై ఉన్న వారికి రైతు భరోసా నిధులు ఇంకా అందలేదు.ఈ క్రమంలో వారందరికి రైతు భరోసా నిధులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అయితే, వీటిని కూడా దశలవారీగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం.ఇప్పటి వరకు నాలుగెకరాలలోపు రైతులందరికి రైతు భరోసా నిధులు జమయినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు ఎకరాలకిపైగా భూమి కలిగిన రైతులు దాదాపు 35లక్షల మంది ఉన్నారు. రబీ సీజన్‌కు సంబంధించిన వారంతా రైతు భరోసా నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. మే చివరి నాటికి వారి ఖాతాల్లో ఈ నిధులు జమ చేయనున్నట్లు తెలుస్తోంది.ఇక ఈ ఏడాదికి సంబంధించి.. ఖరీఫ్ సీజన్ జూన్లో ప్రారంభంకానుంది. ఈ క్రమంలో ప్రభుత్వం.. జూన్ నెల వరకు రబీ సీజన్‌కు సంబంధించిన చెల్లింపులు పూర్తి చేయాలని భావిస్తోంది. ఆ తరువాత జూలై నుంచి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధుల చెల్లింపు ప్రక్రియను ప్రారంభించాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై నిర్ణయం తీసుకునేందుకు త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమావేశం కానున్నారు. ఆ తర్వాత దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## గ్రేటర్ పౌరసేవల్లో విప్లవాత్మక మార్పులు

(1వపేజీ తరువాయి)ఆయా విభాగాల ఖాతాల్లో జమ అయ్యే విధానాన్ని రూపొందించాలని, ఈ క్రమంలో ఆస్తులు, వనరుల గుర్తింపునకు లైడార్ సర్వే చేయాలని రేవంత్ రెడ్డి చెప్పారు. దీన్ని మరింత సులభతరం చేయడానికి అవసరమైన అధ్యయనానికి నిపుణుల సలహాలు తీసుకోవాలని సీఎం సూచించారు. పౌర సేవలు మెరుగ్గా అందడానికి వివిధ శాఖల విభజనలో ఏకరూపత ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. అనుమతుల ప్రక్రియలో అనవసరమైన జాప్యం చేయకూడదని, ఏ కారణం లేకుండా అనుమతులను నిరాకరించడానికి వీల్లేదని ఆయన తేల్చి చెప్పారు. ఒకవేళ అనుమతులకు ఆలస్యమైతే అందుకు కారణాలు ఏమిటో దరఖాస్తుదారులకు తెలియజేయాలని అన్నారు. అలాగే- ఆ జాప్యాన్ని నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది కూడా అధికారులే దరఖాస్తుదారులకు సూచించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్ పాల్గొన్నారు. హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ ఆర్ వి కర్ణన్, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ రీజియన్ లో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాలాలు పరిరక్షణ విషయంలో ఎటువంటి రాజీపడాల్సిన అవసరం లేదని రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగానికి ఆదేశించాను. వీటి పరిరక్షణ కోసం అవసరమైతే లైడార్ సర్వే నిర్వహించాలని చెప్పారు. మ్యాపింగ్ సైతం చేయాలని ఆదేశించారు.

## పతనమైన బంగారం ధరలు

(1వపేజీ తరువాయి)కోల్‌కతా: 8,805 (గ్రాము) బెంగళూరు: 8,805 (గ్రాము) కేరళ: 8,805 (గ్రాము) పూణే: ?8,805 (గ్రాము) వడోదర: 8,810 (గ్రాము) జైపూర్: 8,820 (గ్రాము) లక్నో: 8,820 (గ్రాము) మంగళూరు: 8,805 (గ్రాము) నాశిక్: 8,808 (గ్రాము) అయోధ్య: 8,820 (గ్రాము) మైసూరు: 8,805 (గ్రాము) గురుగ్రామ్: 8,820 (గ్రాము) నోయిడా: 8,820 (గ్రాము) 24 క్యారెట్ల బంగారం ధరల్లోనూ భారీ కుదుపు! 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర కూడా 100 గ్రాములకు నిన్నటితో పోల్చితే నేడు రూ.5 వేల 400 మేర తగ్గింది. స్వచ్ఛమైన బంగారం కొనాలనుకునే వారికి ఇది మరింత ఆకర్షణీయమైన ధర. వివిధ నగరాల్లో నేటి 24 క్యారెట్ల బంగారం రిటైల్ ధరలు: చెన్నై: 9,606 (గ్రాము) ముంబై: 9,606 (గ్రాము) ఢిల్లీ: 9,621 (గ్రాము) కోల్‌కతా: 9,606 (గ్రాము) బెంగళూరు: 9,606 (గ్రాము) కేరళ: 9,606 (గ్రాము) పూణే: 9,606 (గ్రాము) వడోదర: 9,611 (గ్రాము) జైపూర్: 9,621 (గ్రాము) లక్నో: 9,621 (గ్రాము) మంగళూరు: 9,606 (గ్రాము) నాశిక్: ? 9,609 (గ్రాము) అయోధ్య: 9,621 (గ్రాము) మైసూరు: ? 9,606 (గ్రాము) గురుగ్రామ్: ? 9,621 (గ్రాము) నోయిడా: 9,621 (గ్రాము) తెలుగు రాష్ట్రాల్లోనూ తగ్గిన ధరలు: కొనుగోలుదారులకు పండుగే! రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, విజయవాడ, నెల్లూరు, తిరుపతి, కాకినాడల్లోనూ బంగారం ధరలు భారీగా తగ్గాయి. నేడు 22 క్యారెట్ల బంగారం గ్రాము ధర ? 8,805 వద్ద కొనసాగుతుండగా, 24 క్యారెట్ల బంగారం రిటైల్ ధర 9,606 వద్ద విక్రయించబడుతోంది. వెండి ధర స్థిరం: కొనుగోలుదారులకు ఊరట బంగారం ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ, వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కిలో వెండి ధర 1,09,000 వద్ద నిలకడగా ఉంది. కొనుగోలుకు ఇది సరైన సమయమా? నిపుణుల అభిప్రాయం! ప్రపంచ పరిస్థితులు మెరుగుపడుతున్న నేపథ్యంలో బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ ముగియడంతో డిమాండ్ కూడా కాస్త తగ్గవచ్చు. కాబట్టి, బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా పరిగణించవచ్చు. అయితే, పెట్టుబడి కోణంలో చూసేవారు ఒకసారి నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం.

## భారత్‌పై భారీ కుట్ర!

(1వపేజీ తరువాయి)ఉన్నత స్థాయి అధికార హోదాలో కొనసాగుతూనే చట్టవిరుద్ధ, కుట్రపూరక చర్యలకు పాల్పడినట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. దీన్ని సకాలంలో గుర్తించింది కేంద్ర ప్రభుత్వం. ఇంటెలిజెన్స్ ద్వారా అందిన ఈ సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అన్ని కోణాల్లోనూ విశ్లేషించింది. పక్కా సమాచారాన్ని రాబట్టుకుంది. ఉగ్రవాద సంస్థలతో ఆ అధికారి కి పరోక్ష సంబంధాలు ఉన్నాయని, దేశ భద్రత కు సంబంధించిన కొంత విలువైన సమాచారాన్ని వాళ్లకు చేరవేసినట్లూ నిర్ధారించుకుంది. దీనితో విదేశాంగ మంత్రిత్వ శాఖ అప్రమత్త మైంది. ఆ అధికారిని దేశ బహిష్కరణ చేసింది. 24 గంటల్లో దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఆదేశించింది. అలా వెళ్లకపోతే చట్టపరంగా చర్యలను తీసుకోవాల్సి ఉంటుందనీ హెచ్చరించింది. ఆ అధికారిని ఎహసాన్-ఉర్-రహీమ్ అలియాస్ డానిష్‌గా గుర్తించింది. ఐఎస్ఐ ఆపరేటివ్‌గా నిర్ధారించింది. రాయబార కార్యాలయ ఉన్నత ఉద్యోగిగా చలామణి అవుతున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ ధృవీకరించుకుంది. దేశ రక్షణ వ్యవస్థకు సంబంధించిన సమాచారాన్ని పాకిస్తానీయులకు చేరవేస్తోన్నాడనే కారణంతో పంజాబ్ పోలీసులు ఈ నెల 11వ తేదీన ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతన్ని విచారించగా.. ఎహసాన్-ఉర్-రహీమ్ పేరు వెలుగులోకి వచ్చింది.

## కాళ్ల బేరానికి వచ్చిన పాక్

(1వపేజీ తరువాయి)అయితే, కాలక్రమంలో వచ్చిన మార్పులు, పెరుగుతున్న నీటి అవసరాల దృష్ట్యా ఈ ఒప్పందంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు పాకిస్తాన్ లేఖతో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. భారత్ ఈ లేఖకు ఎలా స్పందిస్తుందో చూడాలి. ఒకవేళ పునఃసమీక్షకు అంగీకరిస్తే, ఇరు దేశాల మధ్య చర్చలు జరగాల్సి ఉంటుంది. ఈ చర్చలు ఎంతవరకు సఫలమవుతాయో వేచి చూడాలి. అయితే, ఈ పరిణామం మాత్రం జలవనరుల పంపకాల విషయంలో ప్రాంతీయంగా ఒక కొత్త సవాలును విసురుతోంది అనడంలో సందేహం లేదు. నీటి కోసం పోరాటం భౌగోళిక రాజకీయాలను ఎలా మారుస్తుందో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది.

## మున్సిపల్ చైర్మన్లపై వేటు

(1వపేజీ తరువాయి)కుమారుడు అమరేష్, భార్య జయశ్రీ నడుపుతున్నారని గుర్తించారు. ఈ సంస్థ ద్వారా 36 లక్షల అవినీతికి పాల్పడ్డారనే విజిలెన్స్ నివేదిక ఆధారంగా మేయర్ సురేశ్ బాబుపై వేటు వేశారు. అలాగే మాచర్లలో మున్సిపల్ చైర్మన్ తురగా కిషోర్ అనుమతి లేకుండా కౌన్సిల్ భేటీలకు గైర్హాజరు అయ్యారనే కారణం చూపి ఆయనపై వేటు వేశారు. మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 16(1) ప్రకారం ఇలా అనుమతి లేకుండా 15 సార్లు కౌన్సిల్ భేటీలకు గైర్హాజరు కావడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపిస్తూ తురగా కిషోర్ పై వేటు వేశారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ గా కిషోర్ ను తొలగిస్తూ మున్సిపల్ శాఖ ఆదేశాలు ఇచ్చింది.

## ఏపీకి కేంద్రం వరాలు

(1వపేజీ తరువాయి)పురోగతిలో ప్రముఖ పాత్ర పోషిస్తోన్నారని అన్నారు. అత్యంత సుదీర్ఘ తీర ప్రాంతం ఏపీని ప్రత్యేకంగా నిలిపిందని చెప్పారు.

## 52వ సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం

(1వపేజీ తరువాయి)14న బాంబే హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005 నవంబరు 12న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొంది పలు ధర్మాసనాల్లో సేవలందించారు. గత ఆరేళ్లలో జస్టిస్ గవాయ్ సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వాములయ్యారు. ఇక 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. రెండో దళిత వ్యక్తిగా గవాయ్.. జస్టిస్ బీఆర్ గవాయ్ పేరును మాజీ సీజేఐ సంజీవ్ ఖన్నా ఏప్రిల్ 16వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. గవాయ్ సీజేఐగా ఆరు నెలలు కొనసాగి నవంబరు 23న పదవీ విరమణ చేయనున్నారు. సీజేఐ పీఠాన్ని అధిరోహించిన రెండో దళిత వ్యక్తిగా గవాయ్ పేరు పొందారు. అంతకు ముందు జస్టిస్ కేజీ బాలకృష్ణన్ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన మొదటి దళిత న్యాయమూర్తిగా ఖ్యాతి గడించారు.

## వీరయ్య చౌదరి హత్య కేసు ఛేదించిన పోలీసులు.. పలువురి అరెస్ట్

ఒంగోలు-నవభూమి: టీడీపీ నేత వీరయ్య చౌదరి దారుణ హత్య కేసును ప్రకాశం జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ హత్య కేసులో 11 మంది నిందితులను గుర్తించామని జిల్లా ఎస్పీ దామోదర్ వెల్లడించారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ.. 9 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. మృతుడు వీరయ్య స్వగ్రామం అమ్మనబ్రోలుకి చెందిన ఆళ్ల సాంబయ్య ఈ హత్య కేసులో ప్రధాన కుట్రదారుడిగా తమ దర్యాప్తులో గుర్తించామన్నారు.

ఈ నిందితుల్లో ముప్పా సురేష్, దేవేంద్రనాథ్ చౌదరిలు వీరయ్య స్వగ్రామానికి చెందిన వారని తెలిపారు. ఇసుక వ్యాపారి వినోద్ అనే వ్యక్తితో పాటు నెల్లూరుకి చెందిన నలుగురు కిరాయి ముఠాతో వీరయ్య హత్యకు పథక రచన చేసి అమలు చేశారన్నారు. రాజకీయ, వ్యాపారాల్లో విభేదాలు నేపథ్యంలో వీరయ్య చౌదరిని కిరాయి హంతకులతో హత్య చేయించారని పేర్కొన్నారు.

ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం ఒంగోలులోని వీరయ్య చౌదరిని ఆయన కార్యాలయంలో దుండగులు విచక్షణా రహితంగా కత్తులతో పొడిచి హత్య చేసిన సంగతి తెలిసిందే.

ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం.. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన వీరయ్య చౌదరి.. ఒంగోలులోని ఆయన కార్యాలయంలో దారుణ హత్యకు గురయ్యారు. నలుగురు నిందితుల్లో ఇద్దరు కత్తులతో ఆయన్ను 53 సార్లు విచక్షణారహితంగా పొడిచి హతమార్చారు. ఆపై స్కూటీ, ద్విచక్ర వాహనంపై వారు పరారయ్యారు.

## బీజేపీలో చేరిన వైసీపీ ముస్లిం ఎమ్మెల్సీ..!

(1వపేజీ తరువాయి)మరొకటి. దీంతో ఏపీ రాజకీయాల్లో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. వైసీపీ తరపున తొలిసారి ఎమ్మెల్సీ అయిన కడప జిల్లా నేత జకియా ఖానంకు ఆ పార్టీ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ కూడా చేసింది. జగన్ సోషల్ ఇంజనీరింగ్‌లో భాగంగా ఆమెకు ఈ పదవి దక్కింది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే ఆమె వైసీపీకి దూరం కావడం ప్రారంభించారు. అదే సమయంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ను కలిశారు. వారితో సన్నిహితంగా మెలగడం మొదలుపెట్టారు. దీంతో ఆమె టీడీపీలో చేరడం ఖాయమని అంతా భావించారు. కానీ అక్కడే ట్విస్ట్ ఎదురైంది. టీడీపీలో చేరతారని భావించిన మండలి డిప్యూటీ ఛైర్ పర్సన్ జకియా ఖానం అనూహ్యంగా బీజేపీలో చేరిపోయారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో ఆమె కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. దేశంలో ముస్లిం వర్గాలు బీజేపీకి క్రమంగా దూరమవుతున్న వేళ జకియా ఖానం ఇలా అనూహ్యంగా కాషాయ పార్టీలో చేరడం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ.. బీజేపీ నినాదం సబ్ కే సాత్.. సబ్ కా వికాస్ అన్నా రు. తమ పార్టీలో కుల మతాలకు తావు లేదని తెలిపా రు. ఇది బీజేపీ మూల సిద్ధాంతం అన్నారు. శాసన మండలి వైస్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసి జకియా ఖానమ్ బీజేపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. మైనార్టీలకు బీజేపీపై ఉన్న ప్రేమ, విశ్వా సం జకియా ఖానమ్ చేరికతో మరోసారి రుజువైంద న్నారు. మరోవైపు జకియా ఖానం ఇలా టీడీపీని కాదని బీజేపీలో చేరడం వెనుక కూటమి వ్యూహాలు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కడప జిల్లాకు చెందిన ఈ ముస్లిం ఎమ్మెల్సీని తమవైపుకు తిప్పుకోవడం ద్వారా బీజేపీ ముస్లింలకు వ్యతిరేకం కాదన్న సంకేతా లు పంపడం ఉద్దేశంగా కనిపిస్తోంది. మండలి డిప్యూటీ ఛైర్మన్ పదవీకాలం ముగుస్తున్న తరుణంలో బీజేపీకి ఆ పదవి ఇచ్చేందుకు వీలుగా పార్టీలో చేర్చుకున్నట్లు కనిపిస్తోంది.

## మహిళా న్యాయవాదిపై సీనియర్ న్యాయవాది దాడి

**తిరువనంతపురం-నవభూమి:** కేరళ రాజధాని తిరువనంతపురంలోని ఒక సీనియర్ న్యాయవాది బాగోతం బయటపడింది. ఒక కేసు విషయమై మాటామాటా వచ్చి జూనియర్ మహిళా న్యాయవాదైన శ్యామిలిని తీవ్రంగా కొట్టి, శారీరకంగా హింసించాడు సీనియర్ న్యాయవాది బెయ్లిన్ దాస్. అందుబాటులో ఉన్న మాప్ స్టిక్‌తో తన కోపాన్ని తీర్చుకున్నాడు. దీంతో ఈ మేరకు మహిళా న్యాయవాదైన బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటకొచ్చింది. దీంతో సదరు సీనియర్ న్యాయవాది మీద భౌతికంగా దాడిచేసిన వ్యవహారంలో కేసు నమోదైంది.



నిన్న మే 13న మరో జూనియర్ న్యాయవాదితో జరిగిన గొడవ జరిగిన తర్వాత దాస్ తనపై దాడి చేశాడని మహిళా న్యాయవాది ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తిరువనంతపురంలోని ప్రముఖ న్యాయవాదైన సదరు బెయ్లిన్ దాస్ తరచూ జూనియర్ లాయర్ల పట్ల ఇలాగే ప్రవర్తిస్తుంటాడని, దాస్ తరచూ చిన్న సమస్యలపై కూడా జూనియర్ సహోద్యోగులపై విరుచుకుపడతాడని, ఇది వర్క్ చేసే చోట తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని శ్యామిలి తన ఫిర్యాదులో పేర్కొంది. తీవ్రగాయాలపాలైన శ్యామిలి తాను చికిత్స పొందుతున్న మెడికల్ కాలేజీ ఆసుపత్రి వెలుపల మాట్లాడుతూ..బెయిన్ దాస్ తనపై దాడి చేయడం ఇదే మొదటిసారి కాదని పేర్కొంది.

## ఉద్రిక్తతలు తగ్గేందుకు భారత్-పాక్ దేశాలు డిన్నర్ చేసుకోవాలి : డొనాల్డ్ ట్రంప్



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య కాల్పుల విరమణకు తానే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి రెండు దేశాలు కలిసి మంచి డిన్నర్ ఏర్పాటు చేసుకోవాలని సలహా కూడా ఇచ్చారు. అణు క్షిపణుల తో యుద్ధాలు వద్దని చెప్పారు. సౌదీ అరేబియాలో యూఎస్-సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లో ట్రంప్ మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రంప్ తనను తాను శాంతికర్తగా అభివర్ణించుకున్నారు. అణ్వాయుధ దేశాలైన భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితరులు హాజరయ్యారు. భారత్-పాకిస్తాన్ మధ్య అణుయుద్ధాన్ని నివారించడానికి తన మధ్యవర్తిత్వం సాయపడిందని ట్రంప్ తెలిపారు. అది లక్షలాది ప్రాణాలను కాపాడిందని అన్నారు. ఉద్రిక్తతలు మరింత తగ్గేందుకు భారత్, పాకిస్తాన్ దేశాలు మంచి డిన్నర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 'ఇరుదేశాల మధ్య శాంతి ప్రక్రియలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోలు పాలుపంచుకున్నారు. ఇరు దేశాల పరిస్థితి బాగుందని అనుకుంటున్నాను. వాళ్లని మనం ఒకచోట చేర్చవచ్చు. మార్కో రూబియో, వాళ్లు కలిసి బయటకు వెళ్లి మంచి విందు చేసుకోవచ్చు. ఇది బాగుంటుంది కదా?' అని ట్రంప్ ఫోరమ్‌లో వ్యాఖ్యానించారు. 'కొన్ని రోజుల క్రితమే భారత్-పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడానికి చరిత్రక కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలుచేయడంలో మా యంత్రాంగం విజయవంతమైంది. ఈ విషయంలో నేను వాణిజ్య అంశాలను ఎక్కువగా ఉపయోగించాను. సహచరులారా రండి. ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందాం. వ్యాపారం చేద్దాం. అణు క్షిపణుల వాణిజ్యం చేయొద్దు. అందరికీ ఆనందం కలిగేలా చేద్దాం. భారత్-పాక్ పాలకులు శక్తిమంతమైన, ఉత్తమ, తెలివైన నేతలు. యుద్ధం నిలిపివేసింది. ఇది అలాగే కొనసాగాలని ఆశిద్దాం' అని ట్రంప్ అన్నారు. ఈ సందర్భంగా ఆహూతులంతా చప్పట్లతో ట్రంప్‌ను అభినందించారు. అయితే కాల్పుల విరమణ విషయంలో మూడోపక్షం మధ్యవర్తిత్వాన్ని భారత్ తిరస్కరిస్తోంది. భారత్, పాకిస్తాన్‌లకు చెందిన డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవోలు) తమంతట తాము అవగాహనకు వచ్చారని, ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం లేదని భారత ప్రభుత్వ వర్గాలు స్పష్టంచేశాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ మళ్లీమళ్లీ చెప్పుకుంటుండటం గమనార్హం.

## మసూద్ అజార్‌కు రూ. 14 కోట్లు చెల్లించనున్న పాక్



**న్యూఢిల్లీ-నవభూమి:** పాలు తాగుతూ.. తనను ఎవరూ చూడలేదన్నట్లుగా పిల్లి వ్యవహరిస్తుందంటారు. అదే రీతిలో పాకిస్తాన్ తీరు ఉందనే ఒక చర్చ అయితే జరుగుతోంది. ఉగ్రవాదానికి పాకిస్తాన్ ఊతం ఇస్తుందన్న సంగతి అందరికి తెలిసిందే. కానీ ఉగ్రవాదం గురించి తమకు ఏం తెలియదంటూ పాకిస్తాన్ ఇప్పటికే సకల వినయాన్ని ప్రదర్శించింది. ప్రదర్శిస్తోంది కూడా. ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడితో తమకు ఏం ప్రమేయం లేదంటూ ఆ దేశం వెల్లడించింది. ఆ కొద్ది రోజులకే పహల్గాం పాపం తమదేనంటూ పాకిస్తాన్‌లోని అత్యున్నత సైనికాధికారి ప్రకటించారు. దీంతో పహల్గాం దాడి వెనుక పాక్ హస్తం ఉందని రుజువు అయింది. ఉగ్రవాదానికి పాక్ ఊతం ఇస్తుందనడానికి తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్.. ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో జైషే మహమ్మద్ సంస్థ చీఫ్ మసూద్ అజార్ కుటుంబ సభ్యులతోపాటు అతడి సన్నిహితులు మొత్తం 14 మంది మరణించారు. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మృతులు ఒక్కొక్కరికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో జైషే మహమ్మద్ సంస్థ చీఫ్ మసూద్ అజార్‌కు రూ. 14 కోట్లు ఎక్స్‌గ్రేషియాగా ప్రభుత్వం తరఫున అందనుంది. మే 7వ తేదీ తెల్లవారుజామున పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడి చేసింది. ఈ దాడిలో దాదాపు 100 మందికిపైగా మరణించినట్లు భారత్ వెల్లడించింది. అయితే ఈ దాడిలో మసూద్ అజార్ సోదరుడు అబ్దుల్ రవుఫ్ అజార్‌తోపాటు ఇద్దరు బావలు మరణించారు. అయితే ఈ అబ్దుల్ రవుఫ్ అజార్.. మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా భారత్ గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం హైజాక్ పథక రచనలో ఇతడు కీలక సూత్రదారిగా ఉన్నాడు. అలాగే 2001లో పార్లమెంట్‌పై దాడితోపాటు పఠాన్‌కోట్ ఎయిర్ బేస్‌పై దాడి కేసులో సైతం అబ్దుల్ రవుఫ్ అజార్ కీలకంగా వ్యవహరించినట్లు భారత్ నిఘా వర్గాల వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయన్న సంగతి అందరికి తెలిసిందే.

## సీఎం స్టాలిన్ ధీమా.. ఆ కూటమితో మాకేం నష్టం లేదు..

**చెన్నై- నవభూమి:** అసెంబీ ఎన్నికలకు యేడాది ముందే అవినీతి, అక్రమార్జన కేసులలో ఈడీ, ఐటీ దాడులనుంచి తప్పుకునేందుకు, ఆదరాబాదరగా బీజేపీతో పొత్తుపెట్టుకున్న అన్నాడీఎంకే కూటమి వల్ల డీఎంకే కూటమికి లేశమాత్రం నష్టం వాటిల్లదని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ప్రముఖ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదంటూ తొమ్మిది నెలల పాటు పాల్గొనే ప్రతిసభలోనూ ప్రకటించిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఉన్నట్టుండి అప్పటివరకు తిట్ల వర్షం కురిపించిన బీజేపీ నాయకులతో చెట్టాపట్టాలేసుకు తిరగటాన్ని రాష్ట్ర ప్రజలంతా ఏవగించుకుంటున్నార న్నారు. వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లకు పైగా గెలుచుకుంటుందని చెప్పటానికి ప్రజలంతా ద్రావిడ తరహా పాలనకు గట్టి మద్దతు ఇస్తుండటమే కారణమన్నారు. మహిళాభ్యుద యానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శవంతం గాఉంటున్నాయని, 'అందరికీ అన్ని సదుపాయాలు' అనే ఏకైక లక్ష్యంతోనే నాలుగేళ్లుగా తమ పాలన సమర్థవంతంగా కొనసాగిం దని చెప్పారు. డీఎంకే కూటమి ప్రస్తుతం పటిష్టంగానే ఉందని, మరిన్ని పార్టీలు కూటమిలో చేరుతాయో లేదో వేచి చూడాలని అన్నారు.

## స్త్రీలు యుద్ధ విమానాలే నడుపుతున్నారు.. ఆ పదవులు ఇవ్వడానికేం



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ (లీగల్) బ్రాంచీ పోస్టుల్లో మహిళా అధికారులు తక్కువగా ఉండడంపై సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వైమానిక దళంలో మహిళలు యుద్ధ విమానాన్నే నడుపుతున్నప్పుడు.. ఈ లీగల్ పోస్టులు ఎందుకు ఇవ్వడం లేదని అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. ఈ పోస్టులకు స్త్రీ, పురుష నిష్పత్తి వర్తించదని నిబంధన ఉన్నప్పటికీ.. కేంద్రం ఎందుకు వారిని తీసుకోలేదని న్యాయమూర్తులు దీపాంకర్ దత్తా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం అడిగింది. భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో అష్నూర్ కౌర, ఆస్థ త్యాగి అనే మహిళా అధికారులకు మంచి ర్యాంకులు వచ్చాయి. వరుసగా వీరిద్దరూ 4, 5 ర్యాంకులు సాధించారు. అయితే ఇంత మంచి ర్యాంకులు వచ్చినప్పటికీ అధికారులు వీరిని విధుల్లోకి తీసుకోలేదు. దీంతో వీరిద్దరూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థుల కంటే కూడా తమకు ఎక్కువగా మార్కులు వచ్చాయని.. అయినప్పటికీ మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా వీరి పిటిషన్‌పై భారత అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది.

ఈ సందర్భంగానే మాట్లాడుతూ.. షాకింగ్ కామెంట్లు చేసింది. ముఖ్యంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు దీపాంకర్ దత్తా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా పలు ప్రశ్నలు అడిగింది. భారత వైమానిక దళంలో మహిళలు రఫేల్ యుద్ధ విమానాలను నడిపేందుకు అనుమతి ఉన్నప్పుడు.. ఆర్మీలోని లీగల్ బ్రాంచీల్లో వారిని తీసుకోవడానికి సమస్య ఏంటని ప్రశ్నించింది. ముఖ్యంగా స్త్రీ, పురుష నిష్పత్తిపై ఎలాంటి నిబంధనలు లేనప్పటికీ.. పురుషుల కంటే ఎక్కువగా మహిళలను విధుల్లోకి తీసుకోవడంలో కష్టం ఏముందని అడిగింది.

**స్త్రీ పురుష సమానత్వమంటే సమాన హక్కులు, అవకాశాలు కల్పించడం కాదు..**

స్త్రీ పురుష బేధంతో సంబంధం లేకుండా అవి తటస్థ పోస్టులు అని కేంద్రం ప్రకటించనప్పుడు.. మహిళలకు ఎందుకు ఎక్కువ పోస్టులను కేటాయించడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. స్త్రీ పురుష సమానత్వం అంటే మహిళలు, పురుషులకు సమాన హక్కులు, అవకాశాలు మాత్రమే కల్పించడం కాదని చెప్పింది. అబ్బాయిలు అయినా అమ్మాయిలు అయినా అర్హత ఉంటే అవకాశం ఇవ్వడమేనని వ్యాఖ్యానించింది. దీనిపై తీర్పును రిజర్వ్ చేసింది.

## పాక్ డ్రోన్, మిసైళ్లను కూల్చేసిన ఆకాష్‌తీర్..
# ఏంటీ భారత ఏఐ ఐరన్ డోమ్ వ్యవస్థ



**జమ్ము కశ్మీర్:నవభూమి:** ఆపరేషన్ సిందూర్ తర్వాత.. భారత్ పైకి పాకిస్తాన్ డ్రోన్లు, మిసైళ్లతో విరుచుకుపడింది. అయితే పాక్ చేసిన వైమానిక దాడులను భారత్ ఎప్పటి కప్పుడు సమర్థవంతంగా తిప్పికొట్టింది. భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల సామర్థ్యం ముందు పాక్ మిసైళ్లు, డ్రోన్లు నిలవకపోవడంతో భారీ నష్టం తప్పింది. అయితే పాక్ దాడులను అడ్డుకునేందుకు భారత్‌కు ఒక రక్షణ కవచంగా ఆకాష్‌తీర్ నిలిచింది. స్వదేశీ పరిజ్ఞానంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ఈ ఆకాష్‌తీర్.. భారత్‌కు ఒక ఐరన్ డోమ్ లాగా పనిచేసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ ఆకాష్‌తీర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే ఒక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) సంస్థలు కలిసి సంయుక్తంగా ఈ ఆకాష్‌తీర్‌ను రూపొందించాయి. ఈ ఆకాష్‌తీర్.. పాక్ నుంచి వచ్చిన డ్రోన్లు, క్షిపణులు, చిన్న మానవరహిత వైమానిక వాహనాలను సమర్థవంతంగా తిప్పికొట్టింది. రియల్ టైమ్ టార్గెట్‌లను, డ్రోన్ల దాడికి అడ్డుకట్ట వేయడంలో ఈ ఆకాష్‌తీర్ చాలా ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా ఆకాష్‌తీర్ పూర్తిగా స్వదేశీ పరికరాలతో.. ఎలాంటి శాటిలైట్‌లపై ఆధారపడకుండా తయారు చేసిన మొట్టమొదటి ఆపరేషనల్ ఏఐ వార్ క్లౌడ్‌గా పేర్కొంటున్నారు. భారత క్షిపణులను గుర్తించడం, వాటిని అడ్డుకోవడంలో పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్ వ్యవస్థలు ఫెయిల్ అయిన వేళ.. ఆకాష్‌తీర్ లాంటి మన వ్యవస్థలు అత్యంత కచ్చితత్వంతో పనిచేసినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నారు. ఇస్రో ఉపగ్రహాలు, నావిక్ జీపీఎస్ సహా వివిధ మూలాల నుంచి డేటాను సేకరించి.. కంట్రోల్ రూమ్, రాడార్లు, ఎయిర్ డిఫెన్స్ తుపాకులకు సమగ్రమైన, రియల్ టైమ్ ఏరియల్ ఫోటోస్‌ను అందిస్తుంది. ఇది శత్రు విమానాలు, డ్రోన్లు, క్షిపణులను సొంతంగా గుర్తించి, ట్రాక్ చేసేందుకు ఉపయోగపడుతుంది. సాధారణ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఎక్కువగా భూ ఆధారిత రాడార్లు, మానవ పర్యవేక్షణ వ్యవస్థలపై ఆధారపడగా.. ఆకాష్‌తీర్ తక్కువ స్థాయి గగనతలాన్ని పర్యవేక్షించడానికి, భూ ఆధారిత వైమానిక రక్షణ ఆయుధ వ్యవస్థలను సమర్థవంతంగా నియంత్రించడానికి స్టెల్త్ డ్రోన్ ట్రాకింగ్, ఉపగ్రహ నిఘా, ఏఐ ఆధారిత నిర్ణయం తీసుకునే సాంకేతికతను ఉపయోగిస్తుంది. ఈ ఆకాష్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థతో భారత్ ఇప్పుడు అత్యాధునిక యుద్ధం చేసే పశ్చిమేతర దేశంగా అవతరించింది. ప్రపంచంలోని ఇతర వైమానిక రక్షణ వ్యవస్థల కంటే ఆకాష్‌తీర్ వేగంగా లక్ష్యాలను గుర్తించి, నిర్ణయం తీసుకుని, దాడి చేస్తుందని డీడీ న్యూస్ పేర్కొంది. ఈ ఆకాష్‌తీర్ సొంతంగా పనిచేస్తుంది. ఇందులోని డ్రోన్లు తమ ప్రయాణ మార్గాలను మార్చుకుని మరీ టార్గెట్లను గుర్తించి.. ఆపరేటర్ల జోక్యం లేకుండా దాడులు చేయగలవు. అంతేకాకుండా దీన్ని ఒక చోటు నుంచి మరో చోటుకు సులభంగా తరలించగలగడం వల్ల.. శత్రువులు ఉన్న ప్రాంతాల్లో దీన్ని ఉపయోగించడం తేలిక అవుతుంది. శత్రువుల లక్ష్యాలపై త్వరగా దాడి చేయడం మాత్రమే కాకుండా పోరాటం జరుగుతున్న గగనతలంలో తమ విమానాల భద్రతను కూడా సమన్వయం చేసుకుంటుందని డీడీ న్యూస్ వెల్లడించింది.

## క్లాస్ రూమ్‌లోనే దుకాణం పెట్టిన హెడ్ మాస్టర్లు..



**న్యూఢిల్లీ-నవభూమి:** భావి భారత పౌరులను తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల విధి. అలాంటి ఉపాధ్యాయులు..పైగా హెడ్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ.. తరగతి గదిలో మద్యం సేవించారు. అది కూడా విద్యార్థుల ముందు.. మరో హెడ్ మాస్టర్‌తో కలిసి మద్యం సేవించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గ్రామస్తులు సైతం పాఠశాలను పానశాలగా మార్చారంటూ హెడ్మాస్టర్ల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు హెడ్ మాస్టర్లపై జిల్లా ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్ అమ్రోహా జిల్లా హసన్‌పూర్ బ్లాక్‌లోని ఫయాజ్ నగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల చోటు చేసుకుంది. స్థానిక పాఠశాలహెడ్ మాస్టర్ అరవింద్ కుమార్.. సమీపంలోని సుతారి గ్రామంలోని పాఠశాల హెడ్ మాస్టర్ అన్‌పాల్ కలిసి క్లాస్ రూమ్‌లో విద్యార్థుల ముందు మద్యం సేవిస్తున్నారు. ప్రతి రోజు వారు ఇదే రీతిగా వ్యవహరిస్తున్నారు. మద్యం సేవిస్తున్న వీరిద్దరిని గ్రామస్తులు వీడియో తీసి.. సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్‌గా మారింది. అలాగే ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ నిధిగుప్తాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారంపై ప్రాథమిక దర్యాప్తునకు ఆదేశించారు. దీనిపై బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ దర్యాప్తు జరిపి.. ప్రాథమిక నివేదికు జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. దాంతో ఈ ఇద్దరు హెడ్ మాస్టర్లపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా వీరిద్దరిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఇక ఈ వీడియోపై నెటిజన్లు సైతం తమదైన శైలిలో స్పందించారు. హెడ్‌మాస్టర్ల తీరును ఈ సందర్భంగా వారు విమర్శించారు. క్లాస్ రూమ్‌లో.. విద్యార్థుల ముందు.. ఇలా హెడ్‌మాస్టర్లు మద్యం సేవించడం క్షమించరాని నేరమని వారు పేర్కొన్నారు. ఇలాంటి వారిపై ప్రభుత్వం తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పాకిస్థాన్‌కు మద్దతిస్తోన్న చైనా, టర్కీలకు మరో షాకిచ్చిన భారత్



**జమ్ము కశ్మీర్:నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలు, వారి ముఖ్య కేంద్రాలపై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌తో మెరుపు దాడులు చేసింది. అయితే, ఆపరేషన్ సిందూర్‌పై పాక్ తప్పుడు ప్రచారానికి వంతపడుతోన్న చైనా, టర్కీలకు భారత్ ఝలక్ ఇచ్చింది. తప్పుడు సమాచారం ప్రచురించిందని ఆరోపిస్తూ చైనాకు చెందిన ప్రభుత్వ మీడియా సంస్థలైన గ్లోబల్ టైమ్స్, జిన్హువా న్యూస్ ఏజెన్సీ అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలను భారత్‌తో నిషేధించింది. గ్లోబల్ టైమ్స్ చైనా కమ్యూనిస్టు పార్టీకి చెందిన పీపుల్స్ డైలీకి అనుబంధంగా పనిచేసే ఇంగ్లీష్ వార్తా పత్రిక కాగా.. జిన్హువా చైనా అధికారిక వార్తా సంస్థ. ఇటీవలే బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం గ్లోబల్ టైమ్స్ వార్తలపై తీవ్రంగా స్పందించిన తరవాత ఈ నిర్ణయం వెలువడింది. ఆపరేషన్ సిందూర్‌పై చైనా అధికారిక మీడియా గ్లోబల్ టైమ్స్ తప్పుడు సమాచారం ప్రచురించడంపై భారత్ తీవ్రంగా ఖండించింది. "గ్లోబల్ టైమ్స్ ఈ విధమైన తప్పుడు సమాచారం ప్రచురించే ముందు మీరు వాస్తవాలను నిర్ధారించుకోవాలి.. మీ మూలాలపై సవాల్ చేయాలని మేము సలహా ఇస్తున్నాం' అని బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియా (ట్విట్టర్)లో పేర్కొంది. అలాగే, టర్కీ అధికారిక మీడియా సోషల్ మీడియాపై కూడా నిషేధం విధించింది. టర్కిష్ బ్రాడ్‌కాస్టర్ ' వరల్డ్' ఎక్స్ ఖాతాను బ్యాన్ చేసింది. ఉద్రిక్తతల సమయంలో భారత్‌పై పాకిస్థాన్ టర్కీ నుంచి కొనుగోలు చేసిన డ్రోన్లతో దాడిచేసినట్టు సైన్యం నిర్ధారించింది. ఇప్పటికే అజర్‌బైజాన్, టర్కీ ప్రయాణాలపై అంతర్జాతీయ ట్రావెల్ బుకింగ్ సేవలు అందించే పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు బుకింగ్‌లు నిలిపివేస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.. పాకిస్తాన్‌కు మద్దతు తెలుపుతున్న టర్కీ, అజర్‌బైజాన్‌లకు.. ఒకవేళ భారతీయులు ఎవరైనా వెళ్లాల్సి వస్తే అక్కడి సున్నితమైన ప్రాంతాల పర్యటనల్లో చాలా అలర్ట్‌గా ఉండాలని సూచించాయి.

ఎట్ ఏ టైం ఎటాక్.. ఆపరేషన్ సిందూర్ జరిగిందిలా..అటు, పుణేలోని వ్యాపారులు టర్కీ నుంచి దిగుమతి చేసుకున్న యాపిల్స్‌ను బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు. టర్కీ, పాకిస్థాన్‌కు మద్దతు తెలుపుతోందని, ఉగ్రవాదానికి ప్రోత్సాహం అందిస్తోందని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఉగ్రవాదంపై మనం పోరాడుతుంటే, టర్కీ మాత్రం పాకిస్థాన్‌కు డ్రోన్‌లను సరఫరా చేసిందని, తద్వారా భారత వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ ఉగ్రవాద కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న 9 ప్రదేశాల్లో 24 ఖచ్చితమైన క్షిపణి దాడులు చేసింది. కానీ పాకిస్థాన్‌కు అనుంగు మిత్రుడైన చైనాకు చెందిన గ్లోబల్ టైమ్స్ మాత్రం పాత ఫోటోలతో భారత్ యుద్ధ విమానాలను పాకిస్థాన్ కూల్చేసిందని తప్పుడు కథనాలను ప్రచురించిందని భారత రాయబార కార్యాలయం వివరించింది.

## భారత్‌కు పాకిస్థానీ సపోర్ట్.. తప్పు తమ దేశానిదే అంటూ..



**పాకిస్థాన్-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్‌తో ప్రతీకారం తీర్చుకుంది భారత్. ఆ తర్వాత డ్రోన్లు, మిసైల్స్‌తో రెచ్చగొట్టిన పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పింది. శత్రుదేశ క్షిపణులు, డ్రోన్లను గాల్లోనే కూల్చేయడమే గాక మిలటరీ పోస్టులు, ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసింది. దీంతో కాళ్లబేరానికి వచ్చిన పాక్.. భారత్‌ను సీజ్‌ఫైర్‌కు ఒప్పుకోవాలని కోరింది. ఆ తర్వాత తామే గెలిచామంటూ బీరాలు పోయింది. తప్పంతా ఇండియాదేనని.. తమది శాంతిని కోరుకునే దేశమంటూ సోషల్ మీడియాలో గోబెల్స్ ప్రచారం మొదలుపెట్టింది. అయితే నిజం ఎంత దాచినా దాగదని అంటారు. ఓ పాక్ పౌరుడు తమ దేశం చేసిన పనిని సోషల్ మీడియాలో ఎండగట్టాడు. భారత్‌కు అతడు ఫుల్ సపోర్ట్ ఇచ్చాడు. తప్పంతా తమ దేశానిదేనని అన్నాడు. ప్రతీకారం మాత్రమే..పహల్గాంలో 26 మంది అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులపై దాడి చేసేందుకు భారత్‌కు పూర్తి హక్కు ఉందని అభయ్ అనే ఓ పాక్ పౌరుడు చెప్పాడు. తొలుత ఇండియాపై పాక్ దాడి చేసిందని, ఆ తర్వాత భారత్ అటాక్ చేయడంతో మాట మార్చిందన్నాడు. శాంతి, మానవ హక్కుల పేరుతో హడావుడి చేసిందన్నాడు. పహల్గాంలో అమాయక పర్యాటకుల్ని పాక్ పొట్టనబెట్టుకుందని మండిపడ్డాడు. ఇరు దేశాలు యుద్ధం కోరుకోవడం లేదన్నాడు. అయితే ఉగ్రవాదాన్ని పెంచి పోషించి తప్పించుకోవాలనుకోవడం కరెక్ట్ కాదన్నాడు అభయ్. బోధనలు చేయడం మానుకోవాలని హితవు పలికాడు ఆ పాకిస్థానీ. భారత్ ఎప్పుడూ యుద్ధం మొదలుపెట్టదని.. అవతలి వాళ్లు అది కోరుకుంటే మాత్రం మర్చిపోలేని రీతిలో జవాబు ఇస్తుందన్నాడు. అయినా ఇది వార్ కాదని.. పహల్గాం దాడులకు ప్రతీకారం తీర్చుకోవడమేనని వ్యాఖ్యానించాడు. ఇది చూసిన నెటిజన్స్.. సొంత పౌరుడే పాక్ పరువు తీశాడని కామెంట్స్ చేస్తున్నారు. వైభవ్‌కు ఉన్న పరిపక్వత పాక్ సైన్యం, నేతలకు లేదని మండిపడుతున్నారు.

## అరుణాచల్ అప్పటికీ ఎప్పటికీ మాదే.. చైనాకు స్పష్టం చేసిన భారత్




**అరుణాచల్ ప్రదేశ్-నవభూమి:** అరుణాచల్ ప్రదేశ్‌ను తమ భూభాగమని వాదిస్తోన్న చైనా.. తాజాగా కొన్ని ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టేందుకు చేసిన ప్రయత్నాలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ రాష్ట్రాన్ని 'జాంగ్‌నాన్' లేదా 'దక్షిణ టిబెట్'గా పేర్కొంటోన్న చైనా వాదనలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. "చైనా అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రదేశాలకు పేర్లు పెట్టేందుకు చైనా నిరంతర ప్రయత్నాలను కొనసాగిస్తోంది' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ బుధవారం పేర్కొన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో భారత నేతల పర్యటనలపై కూడా చైనా అభ్యంతరాలు తెలుపుతోంది. 'మన స్పష్టమైన విధానానికి అనుగుణంగా, ఇటువంటి ప్రయత్నాలను పూర్తిగా తిరస్కరిస్తున్నాం.. కుయుక్తులు, పేరు మార్పులు అరుణాచల్ ప్రదేశ్ వాస్తవాన్ని మార్చలేవు.. భారతదేశానికి విడదీయలేని భాగం.. అది గతంలోనూ భారత్ భూభాగమే.. అప్పటికీ.. ఇప్పటికీ.. ఎప్పటికీ భారతదేశంగానే ఉంటుంది' అని విదేశాంగ శాఖ ప్రకటించింది.

చైనా తరచుగా అరుణాచల్ ప్రదేశ్‌ను తన భూభాగంగా పేర్కొంటూ ఆ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు కొత్త పేర్లు ప్రకటిస్తూ వస్తోంది. 2024లో చైనా 30 ప్రదేశాలకు కొత్త పేర్లు సూచిస్తూ విడుదల చేసిన జాబితాను భారత్ ఖండించింది. అరుణాచల్ ప్రదేశ్‌పై ఉన్న సరిహద్దు వివాదం గత కొన్ని దశాబ్దాలుగా భారత్, చైనాల మధ్య ఉద్రిక్తతలకు మూలం. ఇది టిబెట్ స్వయంపాలిత ప్రాంతానికి సరిహద్దుల్లో ఉంది. దీంతో చైనా ఈ ప్రాంతాన్ని చారిత్రిక టిబెట్‌లో భాగంగా పేర్కొంటోంది. అయితే 1947 స్వాతంత్ర్యం తరువాత భారత్ ఈ ప్రాంతాన్ని తనంతట తానే పాలిస్తూ వస్తోంది. ఇటీవలి సంవత్సరాల్లో ఈ భూవివాదానికి తోడు నీటివనరుల వినియోగం గురించి కూడా ఆందోళనలు పెరిగాయి. ముఖ్యంగా యార్లుంగ్ జాంగ్‌పో నదిపై చైనా నిర్మించనున్న ప్రపంచంలో అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు ఈ దిశగా చర్చకు దారితీసింది. టిబెట్‌లోని మేడోగ్ కౌంటీలో నిర్మించనున్న ఈ డ్యామ్ భారతదేశంలో ప్రవేశించే సియాంగ్ నదికి పైవైపు ఉంటుంది. అదే నది అసోంలో బ్రహ్మపుత్రగా ప్రవహిస్తుంది. చైనా ప్రాజెక్ట్‌ను వాటర్ బాంబుగా అరుణాచల్ ప్రదేశ్ ఎంపీ అభివర్ణించారు. '60,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఈ డ్యామ్ మామూలు ప్రాజెక్టు కాదు. ఇది నీటి ద్వారా భారత్, ఇతర దిగువ ప్రవాహ దేశాలపై ప్రభావం చూపించేందుకు రూపొందించిన ఆయుధం' అని ఆయన చెప్పారు. జూన్ 2000 నాటి భారీ వరదలను ఆయన గుర్తు చేశారు. ఆ వరదలు చైనా దిగువకు నీటిని వదలడం వల్లే వచ్చాయని ఆయన ఆరోపించారు. ఆ సమయంలో అరుణాచల్‌లో అనేక వంతెనలు ధ్వంసమ య్యాయి. 'భవిష్యత్తులో చైనా అనూహ్యంగా నీటిని విడుదల చేస్తే, అరుణాచల ప్రదేశ్, అసోం, బంగ్లాదేశ్ వంటి దక్షిణాసియా దేశాలు తీవ్రమైన నష్టాలను ఎదుర్కొంటాయి' అని ఆయన హెచ్చరించారు. కానీ, ఈ ముప్పును దృష్టిలో పెట్టుకొని, చైనా డ్యామ్ నుంచి వచ్చే నీటి ప్రమాదాలను నియంత్రించేందుకు అరుణాచల్‌లోనే ప్రత్యామ్నాయ డ్యామ్ నిర్మాణానికి కూడా ఆయన మద్దతు తెలిపారు.

## పుష్ప ప్రదర్శనకు ఊటీ ముస్తాబు



**చెన్నై- నవభూమి:** రాష్ట్రంలో పర్వతశ్రేణులపై పచ్చదనం, చల్లటి వాతావరణ సంతరించుకున్న వేసవి విడిది ప్రాంతమైన ఊటీ పుష్ప ప్రదర్శనకు ముస్తాబయ్యింది. గురువారం బొటానికల్ గార్డెన్‌లో 127వ పుష్ప ప్రదర్శనను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఆ రోజు నీలగిరి జిల్లాలో కలెక్టర్ లక్ష్మీభవ్య స్థానిక సెలవు ప్రకటించారు. దీనికి బదులు ఈ నెల 31వ తేదీ ప్రభుత్వ కార్యాలయాలు పనిచేస్తాయని ఆమె తెలిపారు. ఇదిలా వుండగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యానవన శాఖ నిర్వహణలోని బొటానికల్ గార్డెన్‌లో వివిధ రకాలకు చెందిన 5 లక్షల పూలమొక్కలను పెంచారు. ఇన్కా మేరీగోల్డ్, ఫ్లగ్స్, బెటూనియా, ఫాన్సీ, డయాంతస్, బికోనియా, డేలియో, పాల్సం, రెనన్ ఫ్లస్, వయోలా, అజరేటం, కాలండులా, గ్లాడియోలస్, విలియం,సన్‌ఫ్లవర్ వంటి అరుదైన పుష్పాలు సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదర్శనలో ఉంచనున్నారు. ఇదిలా వుండగా వేసవి సీజన్‌ను పురస్కరించుకుని ఊటీ సరస్సులో పర్యాటకుల్లో ఉత్సాహం నింపేలా సోమవారం ప్రభుత్వ

# సింధు ఒప్పందంపై మీ వైఖరిని పునఃపరిశీలించండి.. భారత్‌కు పాకిస్థాన్ లేఖ



**ఇస్లామాబాద్-నవభూమి:** సింధు జలాల ఒప్పందంపై మీ వైఖరిని పునఃపరిశీలించాలని భారత్‌ను పాకిస్థాన్ కోరింది. భారత్ నిర్ణయం తమ దేశంలో సంక్షోభాన్ని సృష్టిస్తుందని వాపోయింది. పాకిస్థాన్ జల వనరుల మంత్రిత్వ శాఖ ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. పొరుగు దేశాల మధ్య కీలక జల భాగస్వామ్య ఒప్పందమైన సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని భారత్‌కు పాకిస్థాన్ విజ్ఞప్తి చేసింది. సంబంధిత వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించినట్లు ఇండియా టుడే టీవీ పేర్కొంది.కాగా, 1960 నాటి సింధు జలాల ఒప్పందం ప్రకారం తూర్పు నదులైన సట్లెజ్, బియాస్, రావి భారత్‌కు, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్‌ను పాకిస్థాన్‌కు ప్రపంచ బ్యాంకు కేటాయించింది. అయితే ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై పాకిస్థాన్ ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మందిని చంపారు. ఈ ఘటన నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ పలు ఆంక్షలు విధించింది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడాన్ని పాకిస్థాన్ మానుకునే వరకు ఈ ఒప్పందాన్ని నిలిపివేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది.



## విరమణకు అంత తొందరెందుకు?

పాకిస్థాన్ ప్రేరేపిత కశ్మీరీ జీహాదీలు పహల్గాంలో 26 మందిని ఊచకోత కోసిన రెండు వారాలకు భారత్ స్పందించింది. ఏప్రిల్ 22న కశ్మీర్ మారణకాండ జరిగితే, మే 7న భారత సైనిక దళాలు పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను దాడులతో ధ్వంసం చేశాయి. అనంతరం పాక్ భూ భాగంలోని లాహోర్ సహా అనేక ప్రాంతాలపై భారత సైన్యం దాడులు చేసి పాక్ ఆర్మీపై పైచేయి సాధించింది.
దాయాది దేశంతో యుద్ధం నెలల పాటు కొనసాగాలని ఏ ఒక్క పౌరుడూ కోరుకోడు. 1962, 1965, 1971 యుద్ధాలు భారతదేశాన్ని ఎంతగా దెబ్బతీశాయో ప్రజలకు తెలియనిది కాదు. మనది కాని భూభాగాన్ని తన నియంత్రణలో దీర్ఘకాలం ఉంచుకోవడం ఎంత కష్టమైన పనో ఇజ్రాయెల్‌లోని పాలస్తీనా ప్రాంతాలు నిరంతరం రుజువు చేస్తున్నాయి. అలాంటిది కొందరు భారతీయులు చెబుతున్నట్టు ఈ యుద్ధాన్ని ముందుకు సాగదీసి లాహోర్ సహా అనేక పాక్ ప్రాంతాలను శాశ్వతంగా భారత అధీనంలో ఉంచడం కుదిరే పని కాదు. యుద్ధం ఆపించాలంటూ అమెరికా శరణుజొచ్చిన పాక్ ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీలు, రాయితీలు పొందకుండా యుద్ధం ఎందుకు ఆపేశారు? అని ప్రజలు అడుగుతున్నారు.1999 కార్గిల్ పోరు తర్వాత ఇండియా-పాకిస్థాన్ మధ్య 26 ఏండ్లకు జరిగిన యుద్ధం నాలుగు రోజులకే మే 10న ముగిసిపోయింది. ఉభయ దేశాలూ కాల్పుల విరమణ పాటించనున్నట్టు మొదట అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం మధ్యాహ్నం ప్రకటించడంతో యుద్ధం ముగిసిందనే వార్త భారత ప్రజలకు చేరింది. రెండు దాయాది దేశాల మధ్య పోరు ఆగిందనే సమాచారం ప్రపంచ ఏకైక అగ్రరాజ్యం అధ్యక్షుడు ట్రంప్ ఎందుకు ప్రకటించాల్సి వచ్చిందనే విషయం తర్వాత చర్చించవచ్చుగాని, ఇంత హడావుడిగా ఉరుము ఉరిమినట్టు యుద్ధం నిలిపివేయడానికి భారత ప్రభుత్వం ఎందుకు అంగీకరించాల్సి వచ్చిందో ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర కేంద్ర మంత్రులు, విదేశాంగ కార్యదర్శి వంటి ఉన్నతాధికారులు ఇంతవరకు వెల్లడించలేదు.కిందటి బుధవారం భారత వైమానిక దళం పాకిస్థాన్ పంజాబ్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు జరిపి వాటికి ఎనలేని నష్టం కలిగించి ధ్వంసం చేశాక యుద్ధం తీవ్రమయ్యే దిశగా సాగింది. రెండు భారత ఉపఖండ దేశాల మధ్య యుద్ధం 1971 భారత-పాక్ యుద్ధం మాదిరిగా 13 రోజులకే ముగుస్తుందా? లేక నెల రోజులు సాగుతుందా? అనే ప్రశ్నలు దేశ ప్రజలను ఆలోచనల్లో పడవేశాయి.140 కోట్ల మందికి పైగా ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన పహల్గాం ఊచకోత తర్వాత భారత సర్కార్ పాకిస్థాన్‌పై ఎట్టకేలకు సైనిక చర్య తీసుకోవడం సబబేననే అభిప్రాయం మెజారిటీ జనానికి కలిగింది. అయితే, నాలుగు రోజుల యుద్ధంలో అన్నివిధాలా భారత్ తిరుగులేని ఆధిక్యం సాధించడం భారతీయులకు ఎంతగానో గర్వకారణమైంది. పాక్ గగనతలం నుంచి దూసుకువస్తున్న డ్రోన్లు, ఇతర విధ్వంసక క్షిపణులను భారత గగన రక్షణ వ్యవస్థ తిప్పికొట్టడం చూసి ఇండియా సైనిక దళాల ఆధునికీకరణ ఇంత బాగా జరిగిందా? అనే ఆలోచన భారత ప్రజలను ఆనందింపజేసింది.36 గంటల్లో భారత్ దాడి చేస్తుందని చెప్పిన పాక్‌లో లేని యుద్ధ సన్నద్ధత: పహల్గాం మారణకాండ జరిగిన వారానికి పాక్ మంత్రులు, ఉన్నతాధికారులు మరో 36 గంటల్లో ఇండియా తమ దేశంపై దాడి చేయబోతోందని భయాందోళనలు వ్యక్తం చేస్తూ ప్రకటనలు చేశారు. దేశ ఆవిర్భావం నుంచీ పెత్తనం చేస్తున్న పాకిస్థాన్ ఆర్మీ యుద్ధానికి సన్నద్ధం కాలేదు. ఒకవేళ భారత సేనలు తమపై దాడికి సాహసం చేసినా అవి సర్జికల్ స్ట్రయిక్స్ పేరుతో పిలిచే మెరుపు దాడులకు పరిమితమౌతాయనే భ్రమల్లో పాక్ అధికారులున్నారు. భారత సైనిక దళాల దాడులు పాక్ ఆక్రమిత కశ్మీర్ వరకే సాగుతాయనే ధీమా పాక్ ఆర్మీలో వ్యక్తమైంది. ఇండియా మాదిరిగానే పాకిస్థాన్ కూడా అణ్వాయుధాలున్న దేశం కాబట్టి తమపై భారీ స్థాయిలో దాడికి భారత రక్షణ దళాలు ముందుకురావనే మితిమీరిన నమ్మకం 'పాక్ కమాండర్ల'లో ఎప్పటి నుంచో ఉన్నది. ఆ నమ్మకమే పాకిస్థాన్ నేరుగా భారత్‌పై యుద్ధం చేయకుండా తన చెప్పుచేతుల్లో ఉండే జీహాదీల ద్వారా భారతీయులను గాయపరిచే పనులు చేస్తున్నది. పేరుకే ప్రజాస్వామ్యం ఉన్న ఈ ఇస్లామిక్ రిపబ్లిక్‌లో ఎన్నికైన నాయకులను కీలుబొమ్మలను చేసి పాక్ ఆర్మీ ఆడిస్తున్నది. పాక్‌లోఅనేక మంది ప్రధానులు, అధ్యక్షులు ఎన్నికల్లో ఓడిపోవడం ద్వారా గాక ఆర్మీ ఆదేశాలతో పదవీచ్యుతులవడం ఇటీవల చరిత్రే.1947 ఆగస్టు మధ్యలో ఇండియాతోపాటే స్వాతంత్ర్యం సంపాదించిన పాకిస్థాన్ రాజ్యాంగ రచన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థను వేళ్లూనుకునేలా చేయడంలో విఫలమైంది. 1953లో లాహోర్ వంటి నగరాల్లో ముస్లిం వర్గాల (అహ్మదీయులకు ఇతర ముస్లింలకు) మధ్య జరిగి హింసాత్మక ఘర్షణల్లో అనేక మంది మరణించారు. 1974లో నాటి జుల్ఫికర్ అలీ భుట్టో ప్రభుత్వం ముస్లింలుగా పరిగణించే అహ్మదీయులను ముస్లిమేతరులుగా పార్లమెంట్‌లో చట్టం ద్వారా ప్రకటించడంతో మరోసారి పాక్ నగరాల్లో అల్లర్లు జరిగాయి. ఇలాంటి ఘర్షణల సమయంలో పాక్ ఆర్మీ రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసి శాంతిని పునరుద్ధరించిన సందర్భాలున్నాయి.అందుకే పాకిస్థాన్‌లో సైనిక పాలన తరచూ విధించడానికి ప్రకటించే మార్షల్ లాను పాక్ జనం దేవుడే తమను సైనిక దళాల జోక్యం ద్వారా కాపాడాడ నమ్మకంతో 'మాషా అల్లా' (అల్లా కోరుకున్నదే జరిగింది) అని పిలిచేవారనే కథనాలెన్నో పాక్ మీడియాలో వచ్చాయి. అయితే, మూడు దశాబ్దాలకే దేశం లోపల మంచి పేరును పాక్ ఆర్మీ పోగొట్టుకున్నదని, జనంలో దానిపై పూర్వపు ఆదరాభిమానాలు లేవని 2023 మే ఘటనలు నిరూపించాయి. ప్రస్తుత పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ అధికారంలో ఉండగా అప్పుడు సైన్యం సాయంతో మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను అన్యాయంగా అరెస్టు చేశారని ఆగ్రహించిన పాక్ ప్రజలు పాక్ ఆర్మీ ప్రధాన కార్యాలయం (జీహెచ్‌క్యూ) సహా రావల్పిండి, లాహోర్‌లోని అనేక ఆర్మీ కీలక ఆఫీసులపై దాడులు చేయడం పాక్ సర్కారు సహా ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతపరిచింది. అంటే రాజకీయపక్షాలపై లేని ప్రజావిశ్వాసం కొన్ని దశాబ్దాలపాటు కలిగి ఉన్న పాక్ ఆర్మీ పూర్తిగా జనం నమ్మకం కోల్పోయింది.1990ల నుంచీ ఆధునికీకరణ లేని పాక్ ఆర్మీ: బ్రిటిష్ ఇండియా సైనిక దళాల్లో పనిచేసిన అనుభవంతో 1947లో పాక్ ఆర్మీలో చేరిన ఉన్నతాధికారులు, ఇతర సైనికులు ఆరంభంలో వృత్తి నైపుణ్యం ఉన్న 'ఆఫీసర్లు'గా చలామణి అయ్యారు. ప్రజా ప్రభుత్వాలు బలహీనంగా ఉండటం, ఇస్లామిక్ రిపబ్లిక్ పేరిట జనరల్ జియా ఉల్ హక్, జనరల్ పర్వేజ్ ముషారఫ్ వంటి సైనిక పాలకులు సైన్యంలో తాము రూపొందించిన 'ఇస్లామిక్ ధోరణులు' ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసీం మునీర్ వరకూ ఇస్లాంను సైనిక, ప్రజా వ్యవహారాల్లోకి చొప్పించి ఆర్మీ పునాదులను బలహీనం చేశారు. ఆర్మీ అనేక ముఠాలుగా చీలిపోవడానికి పూర్వపు 'వృత్తి నైపుణ్యం' పోవడానికి కారకులయ్యారు.

# భారత ఆర్థిక ప్రయాణానికి దిక్సూచి: కొనుగోలు నిర్వాహకుల సూచీ రహస్యం!






మన ఆర్థిక వ్యవస్థ ఎలా ముందుకు సాగుతోంది? మనం సరైన దారిలోనే ఉన్నామా? సామాన్యుడి జీవితంలో మార్పులు వస్తున్నాయా? ఇలాంటి ప్రశ్నలు మన మదిని తొలుస్తూనే ఉంటాయి. అయితే, ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ఒక ముఖ్యమైన 'ముందస్తు సంకేతం' ఉందంటే మీరు నమ్ముతారా? అదే 'కొనుగోలు నిర్వాహకుల సూచీ' (పిఎమ్‌ఐ)! ఇది కేవలం ఒక సంఖ్య కాదు, మన ఆర్థిక ఆరోగ్యాన్ని ముందుగానే చెప్పే ఒక రహస్యమైన గొంతు.
పిఎమ్‌ఐ అంటే ఏమిటి? దాని వెనుక ఉన్న మ్యాజిక్ ఏమిటి?ఈ సూచీని అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇది ఒక సర్వే లాంటిది. వ్యాపారాల్లో వస్తువులు కొనే ముఖ్యమైన వ్యక్తుల (కొనుగోలు నిర్వాహకులు) అభిప్రాయాలను సేకరించి లెక్కిస్తారు. ఒక స్కోరును ( సున్నా నుండి వంద వరకు ). ఈ స్కోరును బట్టి ఆయా రంగాల్లో వ్యాపారం ఎలా ఉందో తెలుసుకోవచ్చు. ఒకవేళ స్కోరు 50 ఉంటే, వ్యాపారం నిలకడగా ఉందని అర్థం. ఎలాంటి పెద్ద మార్పులు లేవని సూచన. స్కోరు 50 కంటే ఎక్కువ ఉంటే, అద్భుతం! వ్యాపారం పుంజుకుంటుందని, అంతా సానుకూలంగా ఉందని సంకేతం. ఆర్థిక చక్రం వేగంగా తిరుగుతోందని చెప్పవచ్చు. ఒకవేళ స్కోరు 50 కంటే తక్కువగా ఉంటే మాత్రం కాస్తంత ఆందోళన చెందాలి. వ్యాపారం మందగిస్తోందని, ఆర్థికంగా అంతంతమాత్రంగానే ఉందని అర్థం. ఈ కొలమానం ఒక రకంగా చెప్పాలంటే, మార్కెట్‌లోని వేడిని ముందుగానే పసిగట్టే ఒక 'థర్మామీటర్' లాంటిది. కొనుగోలు చేసే వ్యక్తులు మార్కెట్‌లోని మార్పులను తొందరగా గమనించగలరు కాబట్టి, వారి అభిప్రాయాలు ఆర్థికవేత్తలకు ఒక విలువైన సమాచారాన్ని అందిస్తాయి.

**ముందుచూపుతో నిర్ణయాలు:**
పిఎమ్‌ఐ ఎలా ఉపయోగపడుతుంది ! ఈ సూచీ ఎందుకంత ముఖ్యం అంటే, మన స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వంటి పెద్ద లెక్కలు బయటకు రాకముందే ఆర్థిక వ్యవస్థలో ఏం జరుగుతుందో ఇది చెబుతుంది. ఒక అడుగు ముందుగానే భవిష్యత్తును ఊహించే శక్తి దీనికి ఉంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా దీనికి అంత ప్రాధాన్యం. ఆర్థిక మార్పులను ముందుగానే గుర్తిస్తే ఏం లాభం అనుకుంటున్నారా? అప్పుడే అసలు విషయం ఉంది. ప్రభుత్వం ముందుగానే మేల్కొని, ఆర్థిక వ్యవస్థను కాపాడటానికి లేదా మరింతగా పెంచడానికి కావలసిన చర్యలు తీసుకోవచ్చు. వ్యాపారాలు తమ భవిష్యత్ ప్రణాళికలను మార్చుకోవచ్చు. సామాన్యుడి జీవితం కూడా ఈ మార్పుల వల్ల ప్రభావితమవుతుంది కదా! డబ్బులెక్కడ పెట్టాలి? వడ్డీ రేట్లు ఎలా ఉంటాయి? అనే ప్రశ్నలకు పిఎమ్‌ఐ చెబుతుంది. పెట్టుబడి పెట్టేవారికి, ఆర్థిక నిపుణులకు ఈ సూచీ ఒక దిక్సూచిలాంటిది. దేశ ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి, ఎక్కడ పెట్టుబడి పెట్టాలో ఒక స్పష్టమైన అవగాహనకు రావడానికి ఇది సహాయపడుతుంది. అంతేకాదు, బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచాలా లేక తగ్గించాలా అనే నిర్ణయాలు తీసుకోవడానికి కూడా ఈ సూచీ గణాంకాలను పరిశీలిస్తాయి. వ్యాపారాలు ఎంత ఉత్పత్తి చేయాలో, ధరలు ఎలా ఉండాలో కూడా దీని ఆధారంగానే నిర్ణయిస్తాయి.

**పిఎమ్‌ఐలో ఎన్ని రకాలు:**
పిఎమ్‌ఐ ముఖ్యంగా మూడు రకాలు ఉంటాయి. అవి
1) తయారీ రంగ పిఎమ్‌ఐ: ఫ్యాక్టరీల్లో వస్తువులు ఎలా తయారవుతున్నాయో ఇది చెబుతుంది. కొత్త ఆర్డర్లు వస్తున్నాయా, ఉత్పత్తి పెరుగుతోందా, ఎంతమందికి ఉద్యోగాలు ఇస్తున్నారు వంటి విషయాలను పరిశీలిస్తుంది
2) సేవల రంగ పిఎమ్‌ఐ: బ్యాంకులు, ఆసుపత్రులు, స్కూళ్లు వంటి సేవలు అందించే రంగాల పనితీరును ఇది అంచనా వేస్తుంది. ఇక్కడ వ్యాపారం ఎలా ఉంది, కొత్తగా ఎంతమంది వస్తున్నారు వంటి విషయాలు ముఖ్యం.
3) సంయుక్త పిఎమ్‌ఐ: ఈ రెండు రంగాల గణాంకాలను కలిపి, మన మొత్తం ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో ఒక అంచనాకు వస్తారు. ఏ రంగం ఎక్కువ ముఖ్యమో దానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.
దీని కోసం ప్రతి నెలా కొన్ని కంపెనీల నుంచి సమాచారం సేకరిస్తారు. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి, ఉద్యోగాలు, డెలివరీ సమయం, నిల్వలు వంటి విషయాలపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటారు. వచ్చిన సమాధానాలను బట్టి ఒక ప్రత్యేకమైన ఫార్ములా ఉపయోగించి ఈ సూచీని లెక్కిస్తారు.

**అన్ని లెక్కలూ కరెక్టేనా? పిఎమ్‌ఐకి ఏమైనా పరిమితులు ఉన్నాయా?**
పిఎమ్‌ఐ చాలా ఉపయోగకరమైనది. అయినప్పటికీ కొన్నిసార్లు ఇది తప్పుదారి పట్టించవచ్చు. ఎందుకంటే, ఇది కొద్దిమంది అభిప్రాయాలపై ఆధారపడి ఉంటుంది. అందరి అభిప్రాయాలు ఇందులో ఉండకపోవచ్చు. కొనుగోలు చేసేవారి వ్యక్తిగత ఆలోచనలు కూడా దీనిపై ప్రభావం చూపవచ్చు. వాతావరణంలో మార్పులు లేదా ఇతర తాత్కాలిక సమస్యల వల్ల కూడా గణాంకాలు మారవచ్చు. ఇది ఎక్కువగా తయారీ, సేవల రంగాల గురించి మాత్రమే చెబుతుంది. వ్యవసాయం వంటి ఇతర ముఖ్యమైన రంగాల గురించి అంతగా చెప్పదు. అందుకే పిఎమ్‌ఐ ఒక్కదాన్నే నమ్ముకుంటే సరిపోదు. మన ఆర్థిక వ్యవస్థ యొక్క పూర్తి చిత్రాన్ని చూడాలంటే జిడిపి వంటి ఇతర ముఖ్యమైన లెక్కలను కూడా పరిశీలించాలి.

**భారతదేశంలో పిఎమ్‌ఐ పరిస్థితి ఏమిటి?**
ప్రపంచవ్యాప్తంగా చాలా సంస్థలు ఈ సూచీలను తయారు చేస్తాయి. మన భారతదేశంలో అయితే హెచ్‌ఎస్బిసి ఇండియా అనే సంస్థ ఈ పని చేస్తుంది. వారు దాదాపు.400 తయారీ సంస్థలు, 400 సేవా ప్రదాత సంస్థలు, మొత్తం 800 కంపెనీల నుంచి ప్రతి నెలా సమాచారం సేకరిస్తారు. దీని ద్వారా మన దేశంలోని తయారీ, సేవల రంగాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుస్తుంది.

**ప్రభుత్వం దీనిని ఎలా చూస్తుంది?**
మన ప్రభుత్వం కూడా పిఎమ్‌ఐని చాలా ముఖ్యమైన సూచికగా భావిస్తుంది. ఆర్థిక వ్యవస్థ ఏ దిశగా వెళుతుందో తెలుసుకోవడానికి ఇది సహాయపడుతుంది. జిడిపి కంటే ముందే సమాచారం అందుతుంది కాబట్టి, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడానికి లేదా మంచి జరిగితే మరింత ప్రోత్సహించడానికి వీలు కలుగుతుంది.

**తాజా లెక్కలు ఏం చెబుతున్నాయి:**
ఈ లెక్కలు ఆనందించే విషయమేనా? ఏప్రిల్ 2025 నాటికి వచ్చిన తాజా పిఎమ్‌ఐ లెక్కలు చూస్తే కాస్తంత ఊపిరి పీల్చుకోవచ్చు. తయారీ రంగం పిఎమ్‌ఐ.58.2 గా నమోదైంది. గత 10 నెలల్లో ఇదే అత్యధికం. సేవల రంగం పిఎమ్‌ఐ కూడా 58.7 వద్ద ఉంది. మొత్తం కలిపిన పిఎమ్‌ఐ అయితే 59.7 కు చేరుకుంది. ఇది గత 8 నెలల్లో రికార్డు. ఈ లెక్కలు చూస్తుంటే మన దేశంలో తయారీ, సేవల రంగాలు బాగా అభివృద్ధి చెందుతున్నాయని అర్థమవుతోంది. దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ పెరుగుతోంది. వ్యాపారాలు కూడా మంచి నమ్మకంతో ఉన్నాయి. అయితే పైపైన చూస్తే అంతా బాగానే ఉన్నట్టు అనిపించినా, లోతుగా పరిశీలిస్తే కొన్ని సమస్యలు కూడా కనిపిస్తున్నాయి. కొన్ని రంగాల్లో వృద్ధి ఆశించినంతగా లేదు. ఎగుమతులు కూడా కొన్నిసార్లు దేశీయ డిమాండ్‌తో పోటీ పడలేకపోతున్నాయి. కాబట్టి, ప్రభుత్వం ఈ బలహీన రంగాలపై దృష్టి పెట్టి వాటిని మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

**ముందున్న దారి - సవాళ్లు, చేయాల్సిన పనులు:**
ప్రపంచంలోని పెద్ద సంస్థలు కూడా వచ్చే ఏడాది మన ఆర్థిక వ్యవస్థ బాగానే ఉంటుందని అంచనా వేస్తున్నాయి. ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని చర్యలు కూడా మంచి ఫలితాలను ఇవ్వవచ్చు. కానీ, నిజమైన అభివృద్ధి అంటే కేవలం లెక్కలు పెరగడం కాదు. సామాన్యుడి జీవితంలో మార్పు రావాలి. నిరుద్యోగం తగ్గాలి, అందరికీ మంచి జీతం వచ్చే ఉద్యోగాలు దొరకాలి, పేదరికం పోవాలి, ధరలు అందుబాటులో ఉండాలి. దీని కోసం మనం కొన్ని ముఖ్యమైన పనులు చేయాలి అనే విషయం చూస్తే, ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు ఎక్కువ ఉద్యోగాలు వచ్చే రంగాల్లో పెట్టుబడులు పెట్టాలి. యువతకు మంచి నైపుణ్యాలు నేర్పించాలి. రోడ్లు, రవాణా వంటి సౌకర్యాలను మెరుగుపరచాలి. చిన్న వ్యాపారాలకు సహాయం చేయాలి. ప్రభుత్వం, ప్రైవేటు కలిసి పనిచేయాలి. మన వస్తువులను ఇతర దేశాలకు ఎక్కువగా అమ్మాలి. ఇవన్నీ చేస్తేనే మన ఆర్థిక వ్యవస్థ నిజంగా బలపడుతుంది.

**ఒక కన్ను అటు, ఒక కన్ను ఇటు!**
చివరిగా చెప్పేది ఏంటంటే, కొనుగోలు నిర్వాహకుల సూచీ మన ఆర్థిక ప్రయాణంలో ఒక ముఖ్యమైన గైడ్ లాంటిది. ఇది మనకు విలువైన సమాచారం ఇస్తుంది. కానీ, కేవలం దీనినే నమ్ముకుంటే సరిపోదు. ఇతర ఆర్థిక లెక్కలను కూడా పరిశీలిస్తూ, అప్రమత్తంగా ఉంటేనే మనం మన ఆర్థిక లక్ష్యాలను చేరుకోగలం. ప్రస్తుతానికి ఈ సూచీ మంచి సంకేతాలే ఇస్తోంది. ఈ ఉత్సాహాన్ని నిలబెట్టుకుంటూ, ముందున్న సవాళ్లను అధిగమిస్తే మన భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుంది.

-జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

# అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం.. బంధాలను బలపరిచే రోజు





ప్రతీ సంవత్సరం మే 15న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ రోజు కుటుంబం యొక్క ప్రాముఖ్యతను, బంధాలలోని ప్రేమను, గౌరవాన్ని, బాధ్యతలను గుర్తుచేస్తుంది. ఐక్యరాజ్యసమితి 1993లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. 1994 నుండి ఇది అంతర్జాతీయంగా జరుపబడుతోంది. కుటుంబం ప్రతి వ్యక్తి జీవితంలో అద్భుతమైన, బలమైన ఆధారంగా నిలుస్తుంది. ఇది ప్రేమ, అనుబంధం, గౌరవం, బాధ్యత, నీతి వంటి విలువలను నేర్పే మొదటి పాఠశాలగా ఉంటుంది. తల్లి ప్రేమ, తండ్రి మార్గదర్శనం, అన్నదమ్ముల, బంధువుల అనుబంధం మన సంస్కృతిని పరిపూర్ణత, హుందాతనం, సౌమ్యతతో నింపి, సమాజంలో సహకారం, ప్రేమ, గౌరవం పెరిగేందుకు దారి చూపిస్తాయి.
. మన బంధాలలోని ప్రేమ, గౌరవం, సహనం మన శక్తిని పెంచుతాయి.
భారతదేశం యొక్క సంస్కృతిలో, కుటుంబానికి అమూల్యమైన స్థానం ఉంది. అది వ్యక్తి జీవితం, సాంస్కృతిక అభివృద్ధి, మానవ సంబంధాలపై గొప్ప ప్రభావాన్ని చూపిస్తుంది. పెద్దలను గౌరవించడం, చిన్నవారిని ప్రేమించడం, కలిసి జీవించడం, సంస్కారాలను నేర్పడం మన సంప్రదాయంలో ముఖ్యమైన భాగంగా ఉన్నాయి. మన కుటుంబాలు సాధారణంగా ఉమ్మడి కుటుంబాలుగా ఉంటాయి. తాతముత్తాతల నుండి మనవళ్ల వరకు అందరూ కలిసి జీవిస్తారు. ఈ విధానం బంధాలను బలపరుస్తుంది.
కానీ విదేశీ కుటుంబ సంస్కృతి మన సంస్కృతికి భిన్నంగా ఉంటుంది. విదేశాల్లో, ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో, చిన్న కుటుంబాలు (న్యూక్లియర్ ఫ్యామిలీ) ఎక్కువగా కనిపిస్తాయి. అక్కడ వ్యక్తిగత స్వేచ్ఛకు, స్వతంత్ర జీవనానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. పిల్లలు 18 ఏళ్లు దాటిన తర్వాత తమ సొంత జీవితాన్ని నడిపించడానికి ఇంటి నుండి వెళ్లిపోతారు. కానీ మన తెలుగు సంస్కృతిలో, కుటుంబం జీవితాంతం మద్దతుగా నిలుస్తుంది. పెద్దల సలహాలు, అనుభవాలు ఎల్లప్పుడూ విలువైనవిగా భావిస్తాం. విదేశీ సంస్కృతిలో వృద్ధులు తరచూ ఒంటరిగా లేదా వృద్ధాశ్రమాల్లో జీవిస్తారు, కానీ మన సంప్రదాయంలో వృద్ధులు కుటుంబంలో గౌరవస్థానంలో ఉంటారు.
అయితే, ఆధునిక కాలంలో మన కుటుంబ విలువలు కూడా మారుతున్నాయి. నగరీకరణ, సాంకేతికత, ఉద్యోగ ఒత్తిడి వల్ల మన బంధాలు బలహీనవడుతున్నాయి. తల్లిదండ్రులు పిల్లలతో నాణ్యమైన సమయం గడపడం తగ్గిపోతోంది. వృద్ధులు ఒంటరితనంలో ఉండే పరిస్థితికి లోనవుతున్నారు. కొంతమంది వృద్ధులు వృద్ధాశ్రమాల్లో దుఃఖదాయక జీవితాన్ని గడుపుతున్న వైనం కనిపిస్తోంది. యువతలో కుటుంబ విలువలపై అవగాహన తగ్గుతోంది. ఈ ప్రపంచంలో జరిగే దౌర్భాగ్యాలకు కారణం కుటుంబ సంబంధాలలో విరామం, అసంపూర్ణత అని చెప్పవచ్చు.
అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం ఈ సమస్యలపై అవగాహన కల్పిస్తుంది. ఇది కుటుంబ బంధాలను బలోపేతం చేయడానికి ఒక అవకాశాన్ని అందిస్తుంది. 2025 సంవత్సర థీమ్ కుటుంబాలు, సాంకేతిక పరివర్తనగా ఉంది. ఈ థీమ్ సాంకేతికత కుటుంబ జీవనంపై చూపే ప్రభావాన్ని చర్చిస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా కుటుంబ సభ్యులను దగ్గర చేస్తున్నాయా లేక దూరం చేస్తున్నాయా అని మనం ఆలోచించాలి. టెక్నాలజీ సంబంధాలను సులభతరం చేస్తున్నప్పటికీ, భావోద్వేగ దూరాన్ని పెంచుతోందా అనే ప్రశ్నకు సమాధానం వెతకాలి.
కుటుంబం మనకు స్ఫూర్తిని, శక్తిని, స్థిరత్వాన్ని ఇస్తుంది. కుటుంబంలో ప్రతి సభ్యుడి ప్రేమ, కృషి, గౌరవం, సహనం బంధాలను బలపరుస్తాయి. కుటుంబంతో గడిపే ప్రతి క్షణం, చిన్న సంభాషణ, కలిసి ఉండే సమయం మనకు మనోబలాన్ని అందిస్తాయి. అందుకే, మన కుటుంబాలను, బంధాలను మరింత బలపరచడానికి ప్రతి క్షణాన్ని గౌరవంగా ఉపయోగించుకోవాలి. ప్రేమ, గౌరవం, పరస్పర ఆత్మీయత మన సంబంధాలను బలపరిచే మూలస్తంభాలు.ఈ దినోత్సవం కేవలం ఒక రోజు ఉత్సవం కాదుబీ ఇది కుటుంబ జీవనాన్ని ప్రతిరోజూ మెరుగుపరచడానికి ఒక అవకాశంగా నిలుస్తుంది. మనం కుటుంబ సభ్యులను గౌరవించాలి. వారి అభిప్రాయాలను శ్రద్ధగా వినాలి. వృద్ధులకు తగిన స్థానం ఇవ్వాలి. కుటుంబం బలంగా ఉంటే సమాజం బలంగా ఉంటుంది. ప్రేమ, గౌరవం, సామరస్యంతో నిండిన కుటుంబాలు శక్తివంతమైన సమాజానికి పునాదిగా నిలుస్తాయి. ఈ అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం మన బంధాలను పటిష్టం చేసుకోవడానికి, శాంతియుత సమాజాన్ని, ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థను నిర్మించడానికి ఒక మంచి ప్రారంభంగా ఉండాలి. ప్రేమతో, గౌరవంతో కూడిన బంధాలు మనలను శక్తివంతంగా చేస్తాయి. అవి సమాజానికి, దేశానికి మార్గదర్శకంగా నిలుస్తాయి.

-అమీనా కౌసర్
ఎం. ఎ., హెచ్ పి టి,
స్కూల్ అసిస్టెంట్, జెడ్ పి హెచ్ ఎస్, ఇనుగుర్తి,
మహబూబాబాద్

# ఇంట్లో బంగారాన్ని ఇక్కడ అస్సలు పెట్టకండి

భక్తి



వాస్తు శాస్త్రం వల్ల ఇంట్లో సుఖ శాంతులు ఉండటమే కాదు.. చాలా సమస్యలకు పరిష్కారం కూడా దొరుకుతుంది. మనం ఎంత మాత్రము పట్టించుకోని .. దృష్టి పెట్టని విషయాల వల్లే మన ఇంట్లో సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. ముఖ్యంగా కొన్ని వస్తువుల్ని ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచాలి. అలా చేయటం వల్ల నెగిటివ్ ఎనర్జీ దూరం అవ్వటమే కాదు.. కొత్త కొత్త అవకాశాలకు తలుపులు తెరుచుకుంటాయి.

**బంగారాన్ని ఇక్కడ పెట్టకూడదు**
బంగారంతో పాటు ఇతర విలువైన వస్తువుల్ని నైరుతి వైపు అస్సలు పెట్టకూడదు. బీరువాలు లేదా.. కప్ బోర్డులు ఉత్తరం వైపుగానీ, తూర్పు వైపు గానీ పెట్టాలి. ఇలా చేయటం వల్ల సంపద పెరుగుతుందని వాస్తు శాస్త్రం చెబుతోంది. ఇంటి ఆవరణలో కచ్చితంగా తులసి మొక్క ఉండాలి. తులసిలో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. తులసి నెగిటివ్ ఎనర్జీని తీసేస్తుంది.

**పాత్రలన్నీ క్లీన్‌గా ఉండాలి..**
వాస్తు శాస్త్రం ప్రకారం శుభ్రం చేయకుండా ఉంచిన పాత్రల కారణంగా ఆర్థికంగా సమస్యలు తలెత్తుతాయి. నిద్రపోవడానికి ముందే పాత్రలన్నీ శుభ్రంగా కడుక్కోవాలి. అలా చేయటం వల్ల నెగిటివిటీ తొలగిపోతుంది. తిన్న వెంటనే మన ప్లేటు మనమే కడుక్కోవాలి. మిగిలన పాత్రలన్నీ కడిగేయాలి.

**బెడ్‌పై తినటం**
చాలా మంది పడుకునే బెడ్ మీదే తింటూ ఉంటారు. వాస్తు శాస్త్రం ప్రకారం ఇది మంచి అలవాటు కాదు. ఇలా చేయటం వల్ల సక్సెస్ విషయంలో మనకు ఇబ్బందులు ఎదురవుతాయి. బెడ్‌పై తిండి తినే వారు అప్పుల్లో కూరుకుపోతారు.

**షూ స్టాండ్**
షూ స్టాండ్‌ను కొంతమంది ఇంటికి ఎదురుగా అస్సలు పెట్టకూడదు. ఇలా చేయటం వల్ల నెగిటివ్ ఎనర్జీ ఎక్కువ అవుతుంది. ఇంట్లో సుఖశాంతులు కరువవుతాయి. షూ స్టాండ్‌ను దక్షిణం వైపు గానీ.. నైరుతి వైపు గానీ ఉంచాలి. షూ స్టాండ్‌ను ఉత్తరం వైపు గానీ, అగ్నేయం.. తూర్పు వైపు అస్సలు పెట్టకూడదు.

**గడియారం**
వాస్తు శాస్త్రం ప్రకారం గడియారం తూర్పు వైపు గానీ, పడమర వైపు గానీ, ఉత్తరం వైపు గానీ పెట్టాలి. గడియారాన్ని ఈ చోట్ల పెట్టడం వల్ల అవకాశాలు వెల్లువలా వస్తాయి. ఆకుపచ్చ రంగులో ఉండే గడియారాలను అస్సలు కొనకండి. అవి అవకాశాలను నాశనం చేసే అవకాశం ఉంది.



## మీకూ ఫ్రిడ్జ్ పైన వస్తువులు ఉంచే అలవాటు ఉందా?



రిఫ్రిజిరేటర్ ప్రస్తుతం అన్ని తరగతుల ఇళ్లలోనూ ఉంటోంది. కూరగాయలు, పాలు, పెరుగు నుండి చాక్లెట్లు, డ్రింక్స్, కూరలతో సహా చాలా రకాల ఆహార పదార్థాలు ఫ్రిజ్ లో ఉంటాయి. అయితే ఎప్పుడూ ఫ్రిజ్ లో ఏ ఆహారాలు ఉంచాలి? ఏవి ఉంచకూడదు అని తెలుసుకోవడమే కానీ ఫ్రిజ్ పైన ఉంచకూడదని వస్తువుల ఏంటి? అనే విషయం ఎవరూ పెద్దగా పట్టించుకోరు. చాలా వరకు ఇళ్లలో గమనిస్తే ఫ్రిజ్ మీద కొన్ని వస్తువులు కనిపిస్తూ ఉంటాయి. ఇలా ఫ్రిజ్ మీద వస్తువులు ఉంచడం మంచిదేనా? షాకింగ్ నిజాలు తెలుసుకుంటే..చాలామంది ఇంటి అలంకరణలో భాగంగా మొక్కలను ఇంట్లో టేబుళ్ల మీద, ఫ్రిజ్ మీద ఉంచుతుంటారు. అయితే వెదురు మొక్కను ఫ్రిజ్ మీద ఉంచకూడదట.

ట్రోఫీలు..ఏదైనా పోటీలో లేదా ప్రతిభకు గుర్తింపుగా ట్రోఫీ వస్తే దాన్ని ఇంటికి వచ్చిన వారికి కనిపించేలా పెట్టడం అందరికీ అలవాటు. అయితే ఇలాంటి ట్రోఫీలు ఫ్రిజ్ మీద అస్సలు పెట్టకూడదట.

చేపల అక్వేరియం..ఇల్లు అందంగా కనిపించేందుకు చాలా మంది చేపల అక్వేరియం ఇంట్లో పెట్టుకుంటారు. అయితే చేపల అక్వేరియంను ఫ్రిజ్ పైన పెట్టుకోవడం అస్సలు మంచిది కాదు. ఒక వేళ ఉంచితే అక్వేరియంలో చేపలు తొందరగా చనిపోతాయి.

మందులు..రెగ్యులర్ గా ఉపయోగించే మందులను ఫ్రిజ్ మీద ఉంచడం కొందరి అలవాటు. ఫ్రిజ్ లో నుంచి నీటిని తీసుకుని వాటిని మందులను అక్కడికక్కడే వేసుకుంటూ ఉంటారు. అయితే ఫ్రిజ్ మీద మందులు ఉంచితే ఫ్రిజ్ వేడి కారణంగా మందుల పవర్ తగ్గిపోతుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
గురువారం
15 । మే । 2025

# సంప్రదాయాన్ని ఇష్టపడేవారి కోసం సరికొత్త ఫ్రాక్స్

పండుగల సీజన్‌లో సంప్రదాయాన్ని గుర్తుకుతెస్తూనే ట్రెండీగా కనిపించే దుస్తులదే హవా. అలాంటివాటిని ఇష్టపడేవారి కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఫ్రాక్స్ ఇవి. పట్టు ఫ్యాబ్రిక్‌తో నిండుగా కనిపిస్తాయి. సౌకర్యవంతంగానూ అనిపిస్తాయి.

**ఇక్కత్ సొగసు..**

మల్టీషేడ్ పటోలా ఇక్కత్ పట్టు ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన ఫ్రాక్ ఇది. లావెండర్, పింక్, ఎల్లో, ఆరెంజ్ వంటి నిండైన రంగులతో తయారైన ఫ్యాబ్రిక్‌పై ఇక్కత్‌తో ప్లీట్స్, పెద్ద బార్డర్ జతచేశారు. బాటమ్‌కు కాంట్రాస్ట్‌గా.. చేతులకు పటోలా ఇక్కత్ కాంబినేషన్‌లో ఎల్బో హ్యాండ్స్ ఇచ్చారు. పింక్ కలర్ ప్లెయిన్ పట్టు ఫ్యాబ్రిక్‌తో బాడీపార్ట్ డిజైన్ చేసి రౌండ్ నెక్ ఇచ్చారు. పండుగలకు చక్కని ఎంపిక.

**'రాయల్' బ్లూ..**

రాయల్ బ్లూ ఆర్గంజా ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన ఫ్రాక్ ఇది. నిండైన నీలిరంగుపై బంగారు వన్నె గీతలతో నిండుదనం వచ్చింది. కంచిపట్టు బార్డర్ సంప్రదాయ సౌందర్యాన్ని ప్రసాదించింది. పైభాగంలో బ్లూ కలర్ ప్యూర్ రా సిల్క్ ఫ్యాబ్రిక్‌పై హ్యాండ్ ఎంబ్రాయిడరీ మగ్గం వర్క్ చేశారు. బాటమ్ పార్ట్‌కు కాంట్రాస్ట్‌గా.. హ్యాండ్స్‌కు కూడా



# అమ్మమ్మల కాలంనాటి నగలకు ప్రాణం పోస్తున్న హైదరాబాదీ







అమ్మమ్మల కాలంనాటి గుండ్లమాల, మకర కుండలాలు ఇక్కడ కొత్తగా ప్రాణం పోసుకుంటున్నాయి. నేటి యువతుల అభిరుచికి తగినట్టు ఆధునిక రూపాన్ని ధరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ప్రసిద్ధమైన ఆభరణాలకు హైదరాబాద్‌లో వేదిక కల్పించి.. అమెరికాకు కూడా ఎగుమతి చేస్తున్నారు 'హవ్యా జువెల్స్' వ్యవస్థాపకురాలు విశేషిణి రెడ్డి.

చిన్నప్పటి నుంచీ తనకు నగలంటే ఇష్టం. అమ్మ, అమ్మమ్మ పెట్టుకునే సొమ్ములు చూసి మురిసిపోయేది. పండుగ పబ్బాలకు తానూ అలంకరించుకుని సంబురపడేది. క్రమంగా స్వర్ణాభరణాలు, వజ్రాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. ఆ జిజ్ఞాస రత్నశాస్త్రం.. 'జెమాలజీ' వైపు అడుగులు వేయించింది. ఖరీదైన చదువుల కోసం అమ్మానాన్నలను ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక.. కష్టపడి చదివి ప్రతిష్టాత్మకమైన జీఐఏ స్కాలర్ షిప్ సాధించింది. వజ్రాలు, రత్నాల వంటి పదిహేను రకాల జాతిరాళ్లపై లోతైన అధ్యయనం చేసింది. ఆ పరిజ్ఞానంతో 'హవ్యా జువెల్స్ పేరుతో ఆభరణాల వ్యాపారంలోకి వచ్చింది.

**విశేషమైన నైపుణ్యం**

భూగర్భంలో వజ్రం రూపకల్పన ప్రక్రియను అనుకరిస్తూ.. దాదాపుగా అలాంటి రసాయన సమ్మేళనంతో కృత్రిమ వజ్రాలను తయారు చేయడం ఓ వినూత్న విధానం. ఈ తరహా డైమండ్స్‌ను హైదరాబాద్‌కు పరిచయం చేసిన ఘనత ఆమెదే. సానబట్టిన తర్వాత ఇవి సహజమైన వజ్రాల్లానే కనిపిస్తాయి. అంతర్జాతీయ నిర్ధారణ సంస్థలు మాత్రమే ఆ సున్నితమైన తేడాను గుర్తించగలవు. 'ల్యాబ్‌లో వజ్రాలు తయారు చేసుకోవడం వల్ల.. గనులపై ఒత్తిడి తగ్గుతుంది. నేలతల్లికి గునపపుపోట్లు తప్పుతాయి. అంతేకాదు, గనులు పర్యావరణ కాలుష్యానికి కారణం అవుతున్నాయి. ఈ ఉత్పాతాన్ని కూడా మనం తప్పించవచ్చు' అంటారు విశేషిణి. బంగారు గనులపై కూడా ఒత్తిడి తగ్గాలన్నది ఆమె నిశ్చితాభిప్రాయం. ఆ కారణంగానే, హవ్యా జువెలర్స్‌లో రీసైకిల్డ్ బంగారానికే ప్రాధాన్యం ఇస్తారు.

కొవిడ్ సమయంలో మొదలైన విశేషిణి నగల వ్యాపారం ఎలాంటి ప్రచార ఆర్భాటాలు లేకుండానే ఇన్వెస్టర్లను ఆకట్టుకుంది. చాలా వేగంగా లాభాల బాటలోకి వచ్చేసింది. దాదాపు పాతికమంది ప్రముఖ డిజైనర్లు రూపొందించిన నగలు ఇక్కడ కొలువు దీరాయి. తాతమ్మల కాలం నాటి గుండ్లమాల, మకర కుండలాల నుంచి.. నేటి ఫ్యాషన్ నగల వరకూ అన్నీ అందుబాటులో ఉన్నాయి. ట్రెండ్‌కు తగ్గట్లుగా వ్యాపారాన్ని విస్తరించాలనేది విశేషిణి ఆలోచన. ప్రపంచంలో ఏ మూల నుంచి అయినా.. వర్చువల్‌గా నచ్చిన నగలను ఎంచుకునేందుకు ఓ యాప్‌ను పరిచయం చేయబోతున్నారు. కెమెరా క్లిక్ చెయ్యగానే ఇంట్లో కూర్చునే ఒంటికి నప్పే నగలను ఎంచుకోవచ్చు. అక్కడికక్కడే ఆర్డర్ చేయవచ్చు. ఆభరణాలకు నప్పే వస్త్రాలను ధరించినప్పుడే మహిళ సౌందర్యం ఇనుమడిస్తుంది. అలాంటి దుస్తులనూ అందించాలన్నది ఆమె వ్యాపార ప్రణాళిక. ఈ దిశగానూ ఏర్పాట్లు జరుగుతున్నాయి. వజ్రాలు, రత్నాలు పొదిగిన ఫ్యాషన్ ఆభరణాల ధర రూ.500 నుంచే మొదలవుతుంది. కస్టమర్లు వారి బడ్జెట్‌లో మనసుదోచే నగలను తయారు చేయించుకోవచ్చు.

**లక్ష్యమే జీవితం**

'పోటీ ప్రపంచంలో ప్రతి యువతీ ఏదో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. దానిని సాధించే దిశగా స్థిరమైన అడుగులు వెయ్యాలి. నా దృష్టిలో లక్ష్యం లేని జీవితం వృథా. అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదు. మనకు ఏం కావాలన్నది మనమే గ్రహించాలి. తెలియని విషయాలు తెలుసుకోవాలి. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లో మా బ్రాండ్ పేరు వినిపిస్తున్నది. మరింత ప్రచారం కోసం ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నాం. నగల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాం. నాన్న రవికాంత్ రెడ్డి, అమ్మ హరిత. నిర్మాణ రంగంలో ఉన్నారు. ఇతర వ్యాపారాలూ ఉన్నాయి. నాన్న నన్ను మొదట్నుంచీ ప్రోత్సహిస్తూ పెట్టుబడి పెట్టారు. జాగ్రత్తగా ఖర్చు చేయడం నాన్న నుంచే నేర్చుకున్నాను. తీరిక సమయాల్లో కుటుంబ హోటల్ బిజినెస్‌లో సాయం చేస్తుంటాను. నా ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు' అంటారు విశేషిణి.

# చింత చిగురుతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో..



చింతచిగురును తలచుకోగానే నోట్లో నీళ్లు ఊరతాయి. పులుపు సంగతి ఎలా ఉన్నా చింతచిగురును తీసుకోవడం వల్ల మనకెన్నో ఆరోగ్యకర ప్రయోజనాలున్నాయి. ప్రధానంగా ఈ కాలంలో విరివిగా లభ్యమయ్యే చింత చిగురుతో ఎన్నో లాభాలు ఉన్నాయి. ఈ క్రమంలో చింత చిగురును నిత్యం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను గురించి తెలుసుకుందాం.

– చింత చిగురులో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీంతో ఇది సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేసి విరేచనం సులభంగా అయ్యేలా చేస్తుంది. మలబద్ధకం తొలగిపోతుంది. పైల్స్ ఉన్న వారికి కూడా చింత చిగురు బాగానే పనిచేస్తుంది.

– ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడం వల్ల చింతచిగురు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. చలి జ్వరం తగ్గాలంటే చింత చిగురును వాడాలి.

– చింత చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. వేడి వేడి మసాలా పదార్థాలు తినడం వల్ల నోటిలో వచ్చే పగుళ్లు, పూతలను చింత చిగురు తగ్గిస్తుంది. గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి



అవసరమైన పోషకాలను అందిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు చింత చిగురులో ఉన్నాయి.

– కడుపులో నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది. జీర్ణాశయ సంబంధ సమస్యలను తొలగించడంలో చింత చిగురు బాగా ఉపయోగపడుతుంది. చింత చిగురులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇందువల్ల ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. యాంటీ సెప్టిక్, యాంటీ వైరల్ గుణాలు దీంట్లో ఉన్నాయి.

– పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసే ఔషధ గుణాలు చింతచిగురులో ఉన్నాయి. తరచూ చింత చిగురును తింటే ఎముకలు దృఢత్వాన్ని సంతరించుకుంటాయి. థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారు తమ ఆహారంలో చింత చిగురును భాగం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. డయాబెటిస్ ఉన్న వారు కూడా చింత చిగురును వాడవచ్చు. ఇది వారి రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది.

చింత చిగురును పేస్టులా చేసి దాన్ని కీళ్లపై ఉంచితే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న వారికి ఇది మేలు చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపే గుణాలు చింత చిగురులో ఉన్నాయి. ఇది యాస్ట్రింజెంట్‌లా పనిచేస్తుంది. మూత్ర సంబంధ సమస్యలను కూడా చింత చిగురు దూరం చేస్తుంది. కళ్లు దురదగా ఉన్నప్పుడు కొంత చింత చిగురు తింటే ఉపశమనం కలుగుతుంది.

# అపరాధ భావం ఆ రోజంతా వెంటాడింది



సానియా మిర్జా... అయిదేళ్ల వయసులో రాకెట్ పట్టి... ముప్ఫై ఏళ్ల క్రీడా జీవితంలో ఆరు గ్రాండ్‌స్లామ్‌లు గెలిచారు. అమ్మాయిలు తలచుకుంటే ఏదైనా సాధించగలరని నిరూపించారు. రెండేళ్ల క్రితం తన కెరీర్‌కు వీడ్కోలు పలికిన ఆమె... అప్పటి నుంచి కొడుకు ఇజామ్ ఆలనా పాలనా చూసుకుంటూ మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో క్రీడా జీవితంలో ఎదుర్కొన్న ఒడుదొడుకులు, మాతృత్వపు తొలి రోజుల్లో ఎదురైన విపత్కర పరిస్థితుల గురించి ఇలా చెప్పుకొచ్చారు.

'చిన్నప్పుడు నేను స్కూల్‌కు వెళ్లే దారిలో ఓ టెన్నిస్ కోర్టు ఉండేది. ప్రతిరోజూ దాని ముందు నుంచి వెళుతూ అక్కడ ఆగి ఎలా ఆడుతున్నారో చూస్తూ ఉండేదాన్ని. అలా టెన్నిస్ మీద ఆసక్తి కలిగింది. అయిదో ఏట నుంచి ఆట మొదలుపెట్టాను. నాకు పన్నెండేళ్లు వచ్చేవరకూ ఒక హాబీగానే ఆడాను. తరవాత వింబుల్డన్ ఆడాలనే కోరిక పెరిగింది. ఉదయం అయిదున్నరకు లేచి ఫిట్‌నెస్ క్లాసులకు వెళ్లేదాన్ని. దీంతో స్కూల్‌కి వెళ్లడం ఆలస్యమయ్యేది. అప్పుడు నాన్న వచ్చి స్కూల్ యాజమాన్యానికి నా పరిస్థితి చెప్పడంతో అరగంట ఆలస్యమైనా స్కూల్లోకి అనుమతించేవారు. అమ్మ ఇంటి నుంచి బట్టలు, తినడానికి ఏదైనా చిరుతిండి తీసుకుని వచ్చేది. స్కూల్లోనే బట్టలు మార్చుకుని టెన్నిస్ క్లాసులకు వెళ్లేదాన్ని. నాకు పదహారేళ్లు వచ్చాక ప్రొఫెషనల్‌గా ఆడడం నేర్చుకున్నా. రోజుకు ఎనిమిది గంటలు కోర్టులో లేదంటే జిమ్‌లో ఉండేదాన్ని. చదువుకోవడానికి సమయం సరిపోయేది కాదు. కానీ పరీక్షలప్పుడు మాత్రం శ్రద్ధగా చదివి, డిగ్రీ పూర్తి చేశాను. నా ఈ క్రీడా ప్రయాణంలో టీచర్లు, లెక్చరర్లు, కుటుంబం అందించిన సహకారం మరువలేనిది. ఆ ప్రోత్సాహంతోనే విజయాలు సాధించాను.



**సమానత్వం ఎక్కడ?**

అప్పట్లో అమ్మాయిల మీద ఎన్నో ఆంక్షలు ఉండేవి. పెద్దగా నవ్వకు, సరిగా కూర్చో, ఇలా చేయకు, అలా మాట్లాడకు, బయట అబ్బాయిలతో ఆడకు... అంటూ ఎన్నో చెబుతుండేవారు. అదే అబ్బాయిల విషయంలో ఇలాంటివి ఏమీ ఉండేవికావు. క్రీడలనేవి పురుషులకే సొంతం అనే తీరులో సమాజం ఉండేది. క్రీడాకారిణిగా ఎదిగేటప్పుడు ఎదురైన ఎన్నో విమర్శలు, వ్యతిరేకతల నుంచి నన్ను అమ్మానాన్న కాపాడారు. నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఆ ధైర్యంతోనే 19 ఏళ్ల వయసులో నా వస్త్రధారణపై వచ్చిన విమర్శలను నిజాయితీగా తిప్పికొట్టాను. మగవారినైతే వాళ్ల ఫిట్‌నెస్, ఆటతీరును బట్టి అంచనా వేసేవారు. అదే క్రీడాకారిణుల విషయంలో మాత్రం ఎంత అందంగా కనిపిస్తుంది, సన్నగా ఉందా, లావుగా ఉందా, వస్త్రధారణ ఎలా ఉంది అనే విషయాలన్నీ ప్రస్తావనకు వచ్చేవి. ఏదైనా పార్టీకి వెళ్లినా... రెస్టారెంట్‌కు వెళ్లినా... ఎవరితో కలిసి వెళ్లింది, ఏ సమయంలో వెళ్లింది, ఏం తింటుంది అనేవి చర్చకు వచ్చేవి. ఇలాంటి విపరీత ధోరణి విసుగు తెప్పించేది. పురుషులనైనా, మహిళలనైనా వారి ప్రతిభ ఆధారంగానే గుర్తిస్తే బాగుంటుందని అనుకునేదాన్ని. ఓ ఈవెంట్‌లో నేను, నికత్ జరీన్, సైనా, జోష్నా చినప్పా కలుసుకున్నాం. అందరం క్రీడాకారిణులమే. వేర్వేరు మతాలు, ప్రాంతాలకు చెందిన మేము ఎదిగే క్రమంలో ఎదుర్కొన్న విమర్శలు, అవమానాలు ఒకేలా ఉన్నాయని తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యంగా అనిపించింది. ఇప్పటికీ మహిళలకు సమాన హక్కులు లభించడం లేదు. 30 ఏళ్ల కిందటితో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితి కాస్త మెరుగైందనే చెప్పాలి. కానీ మహిళలు ఇంకా ఎదగాలి. పరిణతి సాధించాలి.

**ఓ అద్భుతమైన జ్ఞాపకం...**

క్రీడా ప్రస్థానాన్ని కొనసాగించడం అంత సులువేమీ కాదు. ప్రతి ట్రోఫీ వెనక ఎన్నో సంవత్సరాల శ్రమ, త్యాగం ఉంటాయి. నేను కూడా చిన్నప్పటి నుంచి ఎన్నో త్యాగాలు చేయాల్సి వచ్చింది. జిమ్‌లో వర్కవుట్స్, కోర్టులో సాధన చేయడంలోనే గంటలు గడిచిపోయేవి. ఆడేటప్పుడు గాయాలయ్యేవి. రాత్రిపూట ఒళ్లంతా నొప్పిగా అనిపించినా అలాగే పడుకునేదాన్ని. ఉదయం లేవగానే మళ్లీ అదే దినచర్య. ఇవన్నీ నా లక్ష్యం ముందు చిన్నవిగా అనిపించేవి. నిన్నటి కంటే ఈ రోజు ఇంకా బాగా ఆడాలి అనుకునేదాన్ని. కష్టపడితేనే అదృష్టం కలసివస్తుందని నమ్మేదాన్ని. నా చిన్నప్పుడు హైదరాబాద్‌లో ఓ ప్రపంచ స్థాయి టోర్నమెంట్ జరిగింది. అందులో ఆడడానికి నాకు వైల్డ్ కార్డ్ ఎంట్రీ దొరికింది. ఆ టోర్నమెంట్ గెలిచాను. ఒక అవకాశం దొరికిన సందర్భం... దాన్ని వినియోగించుకున్న క్షణం... నిజంగా ఓ అద్భుతమైన జ్ఞాపకం. ఈ సంఘటన నా జీవితాన్నే మార్చేసింది.

**వీడ్కోలు వేళ...**

ఇజాన్ పుట్టిన తరవాత ఫిట్‌నెస్ సాధించడం కోసం చాలా కష్టపడ్డాను. రోజులు గడుస్తున్నకొద్దీ నాలో శక్తి తగ్గుతుందనిపించేది. మోకాళ్లకు, మోచేతికి శస్త్రచికిత్సలు జరిగాయి. మునుపటిలా కాకుండా గాయాలు మానడానికి చాలా రోజుల సమయం పట్టేది. మూడేళ్ల కొడుకుని నాతోపాటు విదేశాలకు తీసుకువెళ్లడం కూడా కష్టంగా ఉండేది. వీటన్నింటి మధ్య కెరీర్‌ను కొనసాగించడం ఇక సాధ్యం కాదనిపించింది. నా చివరి మ్యాచ్ దుబాయ్‌లో జరిగింది. ఆ రోజు పత్రికా సమావేశానికి నాతోపాటు ఇజాన్ కూడా వచ్చాడు. అక్కడ చిరునవ్వుతో హుందాగానే ఉన్నాను. మనసులో కూడా ఎటువంటి ఆందోళన లేదు. అక్కడ వాళ్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ క్రీడా జీవితం నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్లు ప్రకటించి ఇంటికి వచ్చేశాను. ఇల్లంతా స్నేహితులతో నిండి ఉంది. నేను నేరుగా బెడ్‌రూమ్‌లోకి వెళ్లి మూడు గంటలపాటు ఏడుస్తూనే ఉన్నా. ఉదయం లేవగానే అంతా శూన్యంగా అనిపించింది. కానీ మరుక్షణంలోనే... జిమ్‌కు, కోర్టుకు వెళ్లక్కర్లేదు... రోజంతా ఇజాన్‌తోనే ఉండవచ్చు అని గుర్తుకు వచ్చి మనసంతా సంతోషంతో నిండిపోయింది. నా కెరీర్లో ఎన్నో లక్ష్యాలు సాధించాను. ఇప్పుడు అమ్మగా నా లక్ష్యం మీద దృష్టి సారించాల్సిన సమయం వచ్చిందనిపించింది. నా కొడుకుతో పూర్తి సమయం గడపాలని నిశ్చయించుకున్నాను. అందుకే రిటైర్మెంట్ ప్రకటించాను. బిడ్డ ఎదుగుతున్నప్పుడు ఓ తల్లికి ఎదురయ్యే మధురానుభూతులను ఆస్వాదించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాను.

**బిడ్డ కోసం తల్లడిల్లిన క్షణాలు...**

కెరీర్ ధ్యాసలో పడి బిడ్డను నిర్లక్ష్యం చేస్తున్నానా? అనే ప్రశ్న... వృత్తి, ఉద్యోగాల్లో కొనసాగే ప్రతి తల్లికీ ఎదురవుతుంది. ఒక్కోసారి ఇది మనోవేదనను కలిగిస్తుంది. ఇజాన్ పుట్టిన ఆరు వారాలకే నేను అత్యవసర పనిమీద ఢిల్లీ వెళ్లాల్సి వచ్చింది. పాలు తాగే పసివాడిని వదిలి వెళ్లాలంటే కష్టంగా అనిపించింది. నేను బయలుదేరే చివరి నిమిషం వరకూ వాడికి పాలు పడుతూనే ఉన్నాను. అయినా... ప్రతి క్షణం బిడ్డ గురించే ఆలోచిస్తూ తల్లడిల్లి పోయాను. నా మనసంతా అపరాధ భావంతో నిండిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చి బిడ్డను చూడగానే నాకు ఏడుపు ఆగలేదు. ఆ సమయంలో అమ్మ నన్ను ఓదార్చింది. పాలిచ్చే తల్లులకు ఎన్నో మధురానుభూతులు ఉంటాయి. వాటితోపాటే శారీరక, మానసిక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. పిల్లల పెంపకం అనేది కేవలం తల్లి బాధ్యత మాత్రమే అన్న భావన సమాజంలో నాటుకుపోయింది. దీనివల్ల తల్లుల మీద అదనపు భారం పడుతోంది. పిల్లలు సంతోషంగా, ఆరోగ్యంగా, మానసిక పరిపక్వతతో పెరగాలంటే తల్లిదండ్రులు ఇద్దరూ సమానంగా బాధ్యతలు పంచుకోవాలి.

**రిటైర్ అయ్యాక...**

నాకు టెన్నిస్ చాలా ఇష్టం. క్రీడా జీవితానికి వీడ్కోలు పలికినప్పటికీ టెన్నిస్ నా జీవితంలో భాగంగానే ఉంది. అప్పుడప్పుడు కామెంటరీలు చెబుతుంటాను. ఓ టెన్నిస్ ఛానెల్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాను. దుబాయ్‌లో టెన్నిస్ అకాడమీని నిర్వహిస్తున్నాను. టీవీ ప్రోగ్రామ్‌లు చేస్తుంటాను. నాకు మోటివేషనల్ స్పీకింగ్ అంటే చాలా ఇష్టం. వీటికి సంబంధించిన ఎపిసోడ్స్ చేస్తుంటాను. ఈవెంట్లు, షూటింగ్ ప్రోగ్రామ్‌లు ఉన్నప్పుడు ప్రయాణ సమయాన్ని తగ్గించుకోవడానకి విమానం ఎక్కేస్తాను. పగలంతా పనుల నిమిత్తం ఎక్కడ తిరిగినా సాయంత్రం కాగానే ఇజాన్ కోసం ఇంటికి చేరుకుంటాను. వాడితో కలిసి టెన్నిస్, క్రికెట్, వాలీబాల్ ఆడుతుంటాను."

క్రీడల్లో రాణించాలనుకొనే అమ్మాయిలకు చెప్పేదేంటంటే... ఏ ఆటలోనైనా ఉన్నత స్థాయికి ఎదగాలంటే శ్రమ పడాలి. ఎన్నింటినో త్యాగం చేయాలి. క్రమశిక్షణ పాటించాలి. ఆరోగ్యాన్ని, శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవాలి. మానసిక ధైర్యం పెంచుకోవాలి. జయాలతోపాటు అపజయాలను కూడా స్వీకరించగలగాలి. అలాగని ఆటే జీవితం కాదు. ఏ ఆట అయినా జీవితంలో ఒక భాగం మాత్రమే.

# బిజినెస్

## స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలతో పాటు మెటల్, రియల్ ఎస్టేట్, టెక్నాలజీ స్టాక్స్ రాణించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,278.49 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 80,910.03 పాయింట్ల కనిష్టానికి పడిపోయిన సెన్సెక్స్ ఆ తర్వాత కోలుకుంది. ఈ క్రమంలో 81,691.87 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. చివరకు 182.34 పాయింట్ల లాభంతో 81,330.56 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 88.55 పాయింట్ల లాభంతో 24,666.90 వద్ద ముగిసింది. దాదాపు 2,749 షేర్లు లాభపడగా.. 1,085 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో టాటా స్టీల్, శ్రీరామ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో ఇండస్ట్రీస్, ఎటర్నల్ ప్రధానంగా లాభాలను ఆర్జించాయి. ఏషియన్ పెయింట్స్, సిప్లా, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్‌టీపీసీ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.6 శాతం పెరిగాయి. బ్యాంకు మినహా మిగతా రంగాల సూచీలన్నీ రియాల్టీ, చమురు, గ్యాస్, టెలికాం, మీడియా, ఐటీ, మెటల్ సూచీలు 1-2.5 శాతం పెరిగాయి.




## తెలుగు రాష్ట్రాలలో బంగారం ధరలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారానికి మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. గత కొంత కాలం నుంచి గోల్డ్ ధరలు పరుగులు పెడుతున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా వీటి ధరలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. ఒక్కోసారి మార్కెట్లో ధరలు పెరిగితే మరి కొన్నిసార్లు తగ్గుతూ కనిపిస్తాయి. గత మూడు నాలుగు రోజుల నుంచి గోల్డ్ ధరలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం తెలుగు రాష్ట్రాలలో బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.గోల్డ్ ధరలు ప్రపంచ బంగారం ధరలపై ఆధారపడి ఉంటాయి, ద్రవ్యోల్బణం, ప్రపంచ ధరలలో మార్పు, కేంద్ర బ్యాంకు బంగారు నిల్వ, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, ఆభరణాల మార్కెట్లు వంటి అనేక అంతర్జాతీయ అంశాల ద్వారా ఇవి ప్రభావితమవుతాయి. తాజాగా హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 88,819గా ఉంది. అలాగే 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 96,899గా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖలో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 88,827గా ఉంది. అలాగే 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 96,907గా ఉంది. ఇక విజయవాడలో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 88,825గా ఉంది. అలాగే 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 96,905గా ఉంది.

## విశాఖలో జిప్సమ్ ప్లాస్టర్ తయారీ ప్లాంట్

**హైదరాబాద్ - నవభూమి:**ఫాస్ఫో జిప్సమ్ ఆధారిత హరిత భవన సామగ్రి తయారీ, విక్రయం కోసం సకర్ణి ప్లాస్టర్‌తో జాయింట్ వెంచర్ (జేవీ) ఏర్పాటు చేసుకునేందుకు కోరమాండల్ కెమికల్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జేవీలో భాగంగా విశాఖపట్టణంలోని కోరమాండల్ ఫెర్టిలైజర్ ప్లాంట్‌కు సమీపంలోనే జిప్సమ్ ప్లాస్టర్ తయారీకి ఒక అత్యాధునిక ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు. ఎరువుల తయారీ ద్వారా అందుబాటులోకి వచ్చే అనుబంధ ఉత్పత్తి జిప్సమ్ ఈ ప్లాంట్‌కు ముడిసరకుగా ఉపయోగపడుతుంది. కేంద్రప్రభుత్వ సర్కులర్ ఎకానమీ లక్ష్యాలకు దీటుగా సుస్థిర హరిత భవన ఉత్పత్తుల తయారీ కోసం దేశంలో ఏర్పాటవుతున్న తొలి భారీ వెంచర్ ఇదే. కోరమాండల్ గ్రూప్ వ్యవసాయ ఉపకరణాల వ్యాపార విభాగం నుంచి తన పరిధిని విస్తరించుకుని ఇతర వ్యాపార విభాగాల్లోకి ప్రవేశించేందుకు, తద్వారా దీర్ఘకాలిక విలువ సృష్టించేందుకు ఈ ఒప్పందం సహాయకారి అవుతుంది. అలాగే సాకర్ణి గ్రూప్ తన ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను విస్తరించి సరికొత్త మార్కెట్లలోకి విస్తరించేందుకు, జిప్సమ్ ప్లాస్టర్ పరిశ్రమలో తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకునేందుకు కూడా ఈ ఒప్పందం దోహదపడుతుంది. వేగంగా విస్తరిస్తున్న జిప్సమ్ ప్లాస్టర్ పరిశ్రమలోని అవకాశాలను రెండు కంపెనీలు కైవసం చేసుకునేందుకు వీలు కల్పిస్తుంది.
కోరమాండల్ తయారీ సామర్థ్యాలు, సకర్ణి మార్కెట్ ఆధిపత్యం రెండింటినీ ఉపయోగించుకోవడం ద్వారా వేగంగా విస్తరిస్తున్న గృహనిర్మాణం, మౌలిక వసతుల రంగాలకు అత్యున్నత నాణ్యత గల, పర్యావరణ మిత్రమైన జిప్సమ్ సొల్యూషన్లు అందుబాటులోకి తేగలుగుతామని కోరమాండల్ ఇంటర్నేషనల్ సీఈఓ శంకర సుబ్రమణియన్ అన్నారు.

## టాప్‌గేర్‌లో హీరో మోటో లాభాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగో త్రైమాసికానికి రూ.1,169 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 24 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.9,794 కోట్ల నుంచి రూ.10,244 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు బాగుండంతో వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.65 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై ఇది 3,250 శాతానికి సమానం.

## మరిన్ని వడ్డీరేట్ల కోతలు.. ఆరేండ్ల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం

**న్యూఢిల్లీ-నవభూమి:**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను మరింతగా తగ్గించేందుకున్న అవకాశాలు మెరుగయ్యాయి. గత నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం దాదాపు ఆరేండ్ల కనిష్ఠానికి తగ్గింది. ఏప్రిల్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.16 శాతంగా నమోదైనట్టు మంగళవారం విడుదలైన జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) డాటా చెప్తున్నది. 2019 జూలైలో 3.15 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ దరిదాపుల్లోకి ధరల సూచీ ఇప్పుడే శాంతించింది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో రెపోరేటు ఇంకా దిగొస్తుందన్న అంచనాలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) చొప్పున మొత్తం అర శాతం (50 బేసిస్ పాయింట్లు) తగ్గించింది. ఫలితంగా 6 శాతానికి దిగొచ్చింది.
ఆర్బీఐ అనుకున్నట్టుగానే.. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఓవరాల్‌గా 4 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 3.6 శాతంగా, రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో 3.9 శాతంగా, మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో 3.8 శాతంగా, నాల్గో త్రైమాసికం (జనవరి-మార్చి)లో 4.4 శాతంగా నమోదు కావచ్చన్నది. ఈ ద్రవ్యోల్బణం ఆధారంగానే ఆర్బీఐ విధానాన్ని ప్రకటిస్తుందన్నది తెలిసిందే. ఈ నేపథ్యంలో నెలవారీ గణాంకాలు అంచనాలకు తగ్గట్టుగానే వస్తుండటంతో వడ్డీరేట్లు ఇంకా తగ్గుతాయన్న అభిప్రాయాలు క్రమేణా పెరుగుతున్నాయి.
**ఎన్ఎస్‌వో డాటా ప్రకారం..**ఏప్రిల్‌లో కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, ఇతర ప్రొటీన్ సమృద్ధి ఆహారోత్పత్తుల ధరలు శాంతించాయి. దీంతో ఆహార ద్రవ్యోల్బణం గత నెలలో 1.78 శాతంగానే ఉన్నది. 2021 అక్టోబర్ తర్వాత ఇదే తక్కువ. గతంతో పోల్చితే ఆలుగడ్డ, టమాట, చికెన్, జీరా వంటివాటి ధరలు తగ్గాయని ఎన్ఎస్‌వో చెప్పుకొచ్చింది.

## ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ.. నెలకు రూ. 10 వేలతో 18 నెలల్లో ఎంతొస్తుందో తెలుసా?




**న్యూఢిల్లీ-నవభూమి:**చాలా మందికి ఫిక్స్‌డ్ డిపాజిట్ల గురించి తెలిసినంతగా రికరింగ్ డిపాజిట్ల గురించి అవగాహన ఉండకపోవచ్చు. కానీ, క్రమం తప్పకుండా చిన్న మొత్తాలలో డబ్బు ఆదా చేయాలనుకునే వారికి రికరింగ్ డిపాజిట్లు ఒక అద్భుతమైన ఆర్థిక సాధనం. ఇక్కడ మీరు ఒక నిర్దిష్ట కాలపరిమితికి ప్రతి నెలా ఒక నిర్ణీత మొత్తాన్ని జమ చేస్తూ వెళ్లాలి. బ్యాంకు అందించే నిర్దిష్ట వడ్డీ రేట్ల ప్రకారం, మెచ్యూరిటీ పూర్తయిన తర్వాత మీ అసలు మొత్తం, వడ్డీ కలిపి తిరిగి వస్తాయి. ఇది ఒక క్రమశిక్షణతో కూడిన పొదుపు మార్గం ఇంకా ఇదే సమయంలో.. మీ డబ్బుకు మంచి రాబడిని కూడా అందిస్తుంది.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకారం, "రికరింగ్ డిపాజిట్ అకౌంట్ అనేది మీరు ప్రతి నెలా ఒక నిర్ణీత మొత్తాన్ని జమ చేసే డిపాజిట్ ఖాతా. ఖాతా తెరిచే సమయంలో మీరు నెలవారీగా నిర్దిష్ట మొత్తం, కాలవ్యవధిని నిర్ణయిస్తారు. మీరు ప్రతి నెలా జమ చేసే మొత్తానికి త్రైమాసిక ప్రాతిపదికన చక్రవడ్డీ లభిస్తుంది." ప్రస్తుతం ప్రముఖ బ్యాంకులు అందిస్తున్న రికరింగ్ డిపాజిట్ల వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.
**1. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లు..**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక సంవత్సరం నుంచి 10 సంవత్సరాల వరకు వివిధ కాలవ్యవధులకు 6.50 శాతం నుంచి 7 శాతం వరకు రికరింగ్ డిపాజిట్ వడ్డీ రేట్లను అందిస్తోంది. ఈ రేట్లు ఏప్రిల్ 15, 2025 నుంచి అమల్లో ఉన్నాయి. ఇక 18 నెలల డిపాజిట్‌కు 6.80 శాతం వడ్డీ రేటు అమల్లో ఉంది. ఇక్కడ ప్రతి నెలా రూ. 10 వేలు డిపాజిట్ చేసినట్లయితే మెచ్యూరిటీకి చేతికి రూ. 1,89,950.33 వస్తుంది. వడ్డీతో రూ. 9 వేలకుపైగా వస్తుందన్నమాట.
**2. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ RD వడ్డీ రేట్లు..**
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 6 నెలల నుంచి 10 సంవత్సరాల వరకు కాలవ్యవధులకు 4.50 శాతం నుంచి 7.05 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తోంది. గరిష్టంగా 7.05 శాతం వడ్డీ రేటు 15, 18 నెలల కాలవ్యవధికి వర్తిస్తుంది. ఈ రేట్లు ఏప్రిల్ 19, 2025 నుంచి అమల్లో ఉన్నాయి. ఇక ఇక్కడ ప్రతి నెలా రూ. 10 వేలు జమ చేస్తే అప్పుడు 7.05 శాతం వడ్డీ రేటు చొప్పున 18 నెలలకు వడ్డీ రూ. 190,356 వస్తుంది.
3. ఐసీఐసీఐ బ్యాంక్ వడ్డీ రేట్లు..
ఐసీఐసీఐ బ్యాంకు కనీసం 4.75 శాతం నుంచి 7.05 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తోంది. గరిష్టంగా 7.05 శాతం వడ్డీ రేటు.. 18, 21, 24 నెలల కాలవ్యవధులకు అందుబాటులో ఉంది. ఇక్కడ రూ. 10 వేల డిపాజిట్‌తో 18 నెలల్లో చేతికి రూ. 1,90,326 వస్తుంది. ఇక్కడ ఆయా బ్యాంక్ ఆర్డీ కాలిక్యులేటర్లను ఉపయోగించి లెక్కించడం జరిగింది. కాబట్టి అంచనా రాబడుల్లో కాస్త తేడా ఉండొచ్చు. గమనించగలరు.
**4. కోటక్ మహీంద్రా బ్యాంక్ RD వడ్డీ రేట్లు..**
కోటక్ మహీంద్రా బ్యాంక్ 6 నెలల నుంచి 10 సంవత్సరాల వరకు టెన్యూర్లకు 6 శాతం నుంచి 7.10 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తోంది. గరిష్టంగా 7.10 శాతం వడ్డీ రేటు 18, 21 నెలల కాలవ్యవధులకు వర్తిస్తుంది. ఈ రేట్లు మే 14, 2025 నుంచి అమల్లో ఉన్నాయి. ఇక్కడ నెలకు రూ. 10 వేల చొప్పున జమ చేస్తే.. 18 నెలలకు చూస్తే రూ. 1,90,401.5 వస్తుంది.చిన్న మొత్తాలతో క్రమం తప్పకుండా పొదుపు చేయాలనుకునే వారికి రికరింగ్ డిపాజిట్లు ఒక సురక్షితమైన, లాభదాయకమైన ఎంపిక. పైన పేర్కొన్న బ్యాంకులు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. మీ ఆర్థిక లక్ష్యాలు, కాలపరిమితిని బట్టి మీకు తగిన పథకాన్ని ఎంచుకోండి.

## సుకన్య సమృద్ధి సహా టాప్- 5 పోస్టాఫీస్ స్కీమ్స్



**హైదరాబాద్ - నవభూమి:**పెట్టుబడి పెట్టడానికి సురక్షితమైన మార్గం కోసం చూస్తున్నారా? తక్కువ రిస్క్‌తో మంచి రాబడి పొందాలనుకుంటున్నారా? అయితే పోస్టాఫీసు పథకాలు మీకోసం ప్రత్యేకంగా ఉన్నాయి. ఇవి విశ్వసనీయమైనవి మాత్రమే కాకుండా, ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను కూడా అందిస్తాయి. అలాంటి టాప్ 5 పోస్టాఫీసు డిపాజిట్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం, వీటి ద్వారా మీరు 8.20% వరకు రాబడి పొందొచ్చు.
**1. సుకన్య సమృద్ధి యోజన: ఆడపిల్లల భవిష్యత్తుకు భరోసా..**
మీ ఇంట్లో ఆడపిల్ల ఉందా? అయితే ఈ పథకం మీకోసమే. దీంట్లో ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ. 250తో పెట్టుబడి పెట్టొచ్చు. ఇక గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. ప్రస్తుతం ఈ పథకంపై 8.20 శాతం వడ్డీ లభిస్తోంది. ప్రతి ఆడపిల్లకు ఒక ఖాతా మాత్రమే తెరవడానికి వీలుంటుంది. అంతేకాదు, సెక్షన్ 80 కింద పన్ను మినహాయింపు ప్రయోజనం కూడా ఉంది. మీ చిన్నారి భవిష్యత్తును సురక్షితం చేసుకోవడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశం. పాప పదేళ్లలోపే ఇందులో చేరాలి. ఇక వరుసగా 15 ఏళ్లు డిపాజిట్ చేయాలి. మెచ్యూరిటీ 21 సంవత్సరాలు.
**2. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్: వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా..**
సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ పథకంలో కనీసం రూ. 1,000 నుంచి గరిష్టంగా రూ. 30 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు. దీనిపై కూడా 8.20 శాతం వడ్డీ లభిస్తుంది. ఈ పథకం కాలవ్యవధి 5 సంవత్సరాలు ఇంకా పెట్టుబడిదారుల కనీస వయస్సు 60 సంవత్సరాలు ఉండాలి. ఇది కూడా సెక్షన్ 80%జ% కింద పన్ను ప్రయోజనాలను అందిస్తుంది. పదవీ విరమణ తర్వాత స్థిరమైన ఆదాయం కోసం చూస్తున్న వారికి ఇది ఉత్తమ ఎంపిక. మీరు రూ. 30 లక్షలు పెట్టుబడి పెడితే, ప్రతి సంవత్సరం మంచి మొత్తంలో వడ్డీని పొందవచ్చు.
**3. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్: సురక్షితమైన దీర్ఘకాలిక పెట్టుబడి..**
అనేది దీర్ఘకాలిక పెట్టుబడి కోసం ఒక సురక్షితమైన ఎంపిక. ఇందులో కనీసం రూ. 500 నుంచి ఏడాదికి గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ప్రస్తుతం దీనిపై 7.10 శాతం వడ్డీ లభిస్తోంది. ఈ పథకం టెన్యూర్ 15 సంవత్సరాలు. ఇది పన్ను రహిత రాబడిని అందిస్తుంది. అంతేకాదు, సెక్షన్ 80C కింద పన్ను ప్రయోజనాలు కూడా ఉన్నాయి. దీర్ఘకాలిక లక్ష్యాల కోసం పొదుపు చేయాలనుకునే వారికి ఇది అనువైనది. మీరు ప్రతి సంవత్సరం రూ. 1.5 లక్షలు పెట్టుబడి పెడితే, 15 సంవత్సరాల తర్వాత మంచి మొత్తంలో పన్ను రహిత రాబడిని పొందవచ్చు.
**4. కిసాన్ వికాస్ పత్ర: మీ పెట్టుబడికి రెట్టింపు రాబడి అవకాశం..**
కిసాన్ వికాస్ పత్ర పథకంలో కనీసం రూ. 1,000 పెట్టుబడి పెట్టొచ్చు. గరిష్ట పెట్టుబడిపై పరిమితి లేదు. ప్రస్తుతం దీనిపై 7.50 శాతం వడ్డీ లభిస్తోంది. పెట్టుబడి పెట్టిన 2.5 సంవత్సరాల తర్వాత డబ్బును పాక్షికగా విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే, ఈ పథకానికి ఎలాంటి పన్ను ప్రయోజనాలు లేవు. మీ డబ్బును కొంత కాలంలో రెట్టింపు చేయాలనుకునే వారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. మీరు ఎంత ఎక్కువ పెట్టుబడి పెడితే, నిర్ణీత కాలంలో అంత ఎక్కువ రాబడి పొందుతారు.
5. **5- సంవత్సరాల NSC: పన్ను ఆదా మరియు స్థిరమైన రాబడి..**
ఈ పథకంలో కనీసం రూ. 1,000 పెట్టుబడి పెట్టొచ్చు. గరిష్ట పెట్టుబడిపై పరిమితి లేదు. దీనిపై 7.70 శాతం వడ్డీ లభిస్తుంది. ఇది సెక్షన్ 80%జ% కింద పన్ను ప్రయోజనాలను అందిస్తుంది. %ుణూ% తగ్గింపు కూడా ఉండదు. స్థిరమైన రాబడితో పాటు పన్ను ఆదా చేయాలనుకునే వారికి ఇది మంచి ఎంపిక. మీరు ఎంత ఎక్కువ పెట్టుబడి పెడితే, 5 సంవత్సరాల తర్వాత అంత ఎక్కువ రాబడిని పన్ను లేకుండా పొందవచ్చు.
ఈ ఐదు పోస్టాఫీసు పథకాలు వివిధ రకాల పెట్టుబడిదారుల అవసరాలను తీరుస్తాయి. మీ లక్ష్యాలు, రిస్క్ తీసుకునే సామర్థ్యం ఆధారంగా మీరు సరైన పథకాన్ని ఎంచుకోవచ్చు. ఆలస్యం చేయకుండా ఈ సురక్షితమైన, లాభదాయకమైన పథకాల్లో పెట్టుబడి పెట్టడం ప్రారంభించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## మారుతీ సుజుకీ అదిరిపోయే ఆఫర్.. ఈ కార్లపై ఏకంగా రూ. 1.15 లక్షల వరకు డిస్కౌంట్!



**న్యూఢిల్లీ-నవభూమి:**కొత్త కారు కొనాలనుకుంటున్నారా? అయితే మీకోసం ఒక శుభవార్త! ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తమ నెక్సా మోడళ్లపై భారీ డిస్కౌంట్‌ను ప్రకటించింది. బాలెనో, జిమ్నీ, ఫ్రాంక్స్‌తో సహా పలు మోడళ్లపై ఏకంగా రూ. 1.15 లక్షల వరకు తగ్గింపు అందుబాటులో ఉంది. అంతేకాదు, ఫోక్స్‌వ్యాగన్ కూడా తమ కార్లపై రూ. 2 లక్షల వరకు తగ్గింపును అందిస్తోంది. ఈ ప్రత్యేక ఆఫర్ల వివరాలు ఇప్పుడు చూద్దాం.
**మారుతీ సుజుకీ నెక్సా కార్లపై డిస్కౌంట్లు..**
బాలెనో: ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌పై రూ. 45,000 వరకు తగ్గింపు లభిస్తోంది. మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వెర్షన్‌పై రూ. 25,000, ఏజీఎస్ వెర్షన్‌పై రూ. 30,000 నగదు తగ్గింపుతో పాటు రూ. 15,000 ఎక్స్ఛేంజ్ బోనస్ కూడా పొందొచ్చు. అదనంగా, రీగల్ ఎడిషన్ యాక్సెసరీస్ కిట్‌పై కూడా తగ్గింపు ఉంది.
ఫ్రాంక్స్: పెట్రోల్-డీజిల్ ఇంజిన్ వేరియంట్లపై రూ. 10,000 వరకు తగ్గింపు ఉంది (సిగ్మా వేరియంట్‌కు వర్తించదు). ఏజీఎస్ వెర్షన్లపై రూ. 15,000 తగ్గింపుతో పాటు రూ. 15,000 ఎక్స్ఛేంజ్ బోనస్ అందుబాటులో ఉంది. టర్బో పెట్రోల్ వేరియంట్‌పై రూ. 30,000 తగ్గింపు, రూ. 43,000 విలువైన వెలాసిటీ యాక్సెసరీస్ కిట్ ఇంకా రూ. 15,000 ఎక్స్ఛేంజ్ బోనస్ పొందవచ్చు.
జిమ్నీ: ఈ SUV పై ఏకంగా రూ. 1 లక్ష వరకు తగ్గింపు ఉంది. అయితే, ఈ ఆఫర్ కేవలం ఆల్ఫా వేరియంట్‌కు మాత్రమే వర్తిస్తుంది.
ఎక్స్ఎల్ 6: నెక్సా ఔట్‌లెట్‌లలో విక్రయించే ఈ కారుపై రూ. 25,000 వరకు స్క్రాపేజ్ బోనస్ అందుబాటులో ఉంది. దీని ప్రారంభ ధర ప్రస్తుతం రూ. 11.84 లక్షలు (ఎక్స్-షోరూమ్).
ఇన్విక్టో: టయోటా ఇన్నోవా హైక్రాస్ ఆధారిత ఈ కారు ప్రారంభ ధర రూ. 25.51 లక్షలు (ఎక్స్-షోరూమ్). ప్రస్తుతం దీనిపై రూ. 25,000 తగ్గింపుతో పాటు రూ. 1 లక్ష ఎక్స్ఛేంజ్ బోనస్ లేదా రూ. 1.15 లక్షల వరకు స్క్రాపేజ్ ప్రయోజనాలు పొందవచ్చు.
విటారా: మారుతీ హైబ్రిడ్ ఎస్‌యూవీ అయిన గ్రాండ్ విటారాపై రూ. 25,000 వరకు డిస్కౌంట్, రూ. 50,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ లభిస్తోంది. 6 ఎయిర్‌బ్యాగ్స్ వెర్షన్‌పై రూ. 15,000 నగదు తగ్గింపు, రూ. 30,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ పొందవచ్చు.
**ఫోక్స్‌వ్యాగన్ కార్లపై కూడా ఆఫర్లు..**
మారుతీతో పాటు ఫోక్స్‌వ్యాగన్ కూడా తమ టైగన్, వర్టస్ మోడళ్లపై ఆకర్షణీయమైన తగ్గింపులను అందిస్తోంది.
టైగన్: ఈ కారుపై ఏకంగా రూ. 2 లక్షల వరకు తగ్గింపు ఉంది. 1.5 బీఎస్‌జీ జీటీ లైన్ ట్రిమ్‌పై ఈ రాయితీ పొందవచ్చు. 1.0 జీటీ లైన్ ట్రిమ్‌పై రూ. 1.45 లక్షల తగ్గింపు లభిస్తోంది.
వర్టస్: ఈ సెడాన్ కంఫర్ట్‌లైన్ వేరియంట్‌పై రూ. 1.12 లక్షల తగ్గింపు అందుబాటులో ఉంది. అంటే, రూ. 11.56 లక్షలు (ఎక్స్-షోరూమ్) ఉన్న కారును రూ. 10.99 లక్షలకు కొనుగోలు చేయొచ్చు. ఇతర వేరియంట్లపై కూడా భారీ తగ్గింపులు ఉన్నాయి.

### అమెరికాపై.. భారత్ ప్రతీకార చర్యలు..
## వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలవుతుందా?



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచ వాణిజ్య రంగంలో మళ్లీ అలజడి మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొంతకాలం కిందట ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దీనిని నిరసిస్తూ.. భారత్ ప్రతీకార చర్యలకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రపంచ వాణిజ్య సంస్థకు (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) ప్రతిపాదనలు పంపింది. ఈ చర్యలు అమల్లోకి వస్తే, అమెరికా నుంచి దిగుమతి చేసుకునే అనేక వస్తువులపై భారత్ భారీగా సుంకాలు విధించే అవకాశం ఉంది. భారత్ పంపిన ప్రతిపాదన 2025, మే 9 నాటిది. దీని ప్రకారం, అమెరికా నుంచి భారత్‌కు వచ్చే దాదాపు 7.6 బిలియన్ డాలర్స్ విలువైన ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలు విధించే అవకాశం ఉంది.ఈ నిర్ణయం ద్వారా భారత్.. దాదాపు 1.91 బిలియన్ డాలర్ల మేర ఆదాయం పొందగలదని అంచనా. అయితే, ఈ చర్య అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఇతర ఉత్పత్తుల ధరలను కూడా పెంచే అవకాశం ఉంది. డబ్ల్యూటీఓకు సమర్పించిన తన ప్రతిపాదనలో, అమెరికా తీసుకున్న చర్యలు 1994 నాటి (ట్రేడ్, టారిఫ్స్‌పై సాధారణ ఒప్పందం), (సేఫ్‌గార్డ్స్ ఒప్పందం) నిబంధనలకు అనుగుణంగా లేవని భారత్ స్పష్టం చేసింది. అంతేకాకుండా, ఈ చర్యల వల్ల భారత వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని.. అందుకే దీనికి సమాన స్థాయిలో అమెరికా ఉత్పత్తులపై సుంకాలు విధించే హక్కు భారత్‌కు ఉందని పేర్కొంది.
భారత్ త్వరలో ట్రేడ్ ఇన్ గూడ్స్ కౌన్సిల్ , సేఫ్‌గార్డ్స్ కమిటీకి తన తదుపరి చర్యల గురించి తెలియజేయనుంది. ఈ సమస్యను ద్వైపాక్షికంగా కూడా పరిష్కరించుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.
**ట్రంప్ సుంకాలు..**
2018 మార్చిలో అప్పుడు అమెరికా అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్ కొన్ని అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తులపై వరుసగా 10 శాతం, 25 శాతం సుంకాలను విధించారు. వీటిని 2020 జనవరిలో పొడిగించగా, 2025 ఫిబ్రవరిలో కాలపరిమితి లేకుండా మరోసారి సవరించారు. ఫిబ్రవరి, ఏప్రిల్‌లో ట్రంప్ తన సుంకాలను మరింత పెంచి 25 శాతానికి చేర్చారు. ఈ చర్యలను భారత్ మొదటి నుండి వ్యతిరేకిస్తోంది. దీనికి ప్రతిగా, భారత్ 2019 జూన్‌లో బాదంస వాల్‌నట్‌లతో సహా 28 అమెరికా ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాలను విధించింది. ఇంకా ఇదే సమయంలో తాజాగా WTOలో ఫిర్యాదు కూడా చేసింది.ఈ తాజా ప్రతిపాదన ప్రాధాన్యత సంతరించుకుంది. ఎందుకంటే, ఇరు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నాయి. భారత బృందం ఈ వారం వాణిజ్య చర్చల కోసం అమెరికా కూడా వెళ్లనుంది. ఇలాంటి సమయంలో భారత్ ప్రతీకార చర్యలకు సిద్ధం కావడం చర్చలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి. ఒకవైపు చర్చలు కొనసాగుతుండగా, మరోవైపు సుంకాలను పెంచే ప్రతిపాదనలు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత క్లిష్టతరం చేసే అవకాశం ఉంది. కొంతకాలంగా.. ఇప్పటికే అమెరికా- చైనా మధ్య వాణిజ్య యుద్ధ భయాలు తీవ్ర ఆందోళనలు రేకెత్తించగా.. కిందటి రోజు రెండు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చాయి. టారిఫ్స్ పెంపును 90 రోజుల పాటు వాయిదా వేయడమే కాకుండా.. గతంలో విధించుకున్న భారీ సుంకాల్ని తగ్గించుకున్నాయి.

## ఉద్యోగులకు షాకిచ్చిన మైక్రోసాఫ్ట్.. వేలాది మందిపై వేటు




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. వేలాది మందిని తొలగించేందుకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో మూడు శాతం మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. సంస్థ నిర్ణయంతో దాదాపు 6 వేల మందిపై లేఆఫ్స్ ప్రభావం పడనున్నట్లు తెలుస్తోంది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కానుంది.
గతేడాది జూన్ నాటికి ఆ సంస్థలో 2.28 లక్షల మంది సిబ్బంది ఉన్నారు. మైక్రోసాఫ్ట్ తాజా నిర్ణయంతో మధ్యస్థ స్థాయి మేనేజ్‌మెంట్ ఉద్యోగులపై అధిక ప్రభావం పడనుందని అంచనా. ఈ ఏడాది ప్రారంభంలో కూడా పనితీరు ఆధారంగా పలువురు ఉద్యోగులను సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. తాజా లేఆఫ్‌లకు ఉద్యోగుల పనితీరుకు సంబంధం లేదని సంస్థ స్పష్టం చేసింది.

## పెరిగిన సువెన్ లైఫ్ నష్టాలు

**హైదరాబాద్-నవభూమి:** సువెన్ లైఫ్ సైన్సెస్ నష్టాలు మార్చి త్రైమాసికంలో మరింత పెరిగాయి. గత ఏడాది నాలుగో త్రైమాసికంతో పోల్చితే కన్సాలిడేటెడ్ నష్టం రూ.26.54 కోట్ల నుంచి రూ.43.95 కోట్లకు పెరిగింది. ఖర్చులు రూ.34.21 కోట్ల నుంచి రూ.46.63 కోట్లకు చేరడంతో కంపెనీ ఆదాయం సైతం రూ.2.39 కోట్ల నుంచి రూ.1.47 కోట్లకు పడిపోయింది.

## టాటా మోటార్స్ లాభం 51 క్షీణత

**న్యూఢిల్లీ-నవభూమి:**టాటా మోటార్స్ లాభాలకు నాలుగో త్రైమాసికంలో లాభాలకు భారీగా గండి పడింది. ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.8,556 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 51 శాతం తక్కువ. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం రూ.1,19,033 కోట్ల నుంచి స్వల్పంగా పెరిగి రూ.1,19,503 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నా వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.6 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

హైదరాబాద్
గురువారం
15 ၊ మే ၊ 2025

## నవ విశ్వం

## మరాఠీ మాట్లాడలేదని.. డెలివరీ ఏజెంట్‌ను వేధించిన ముంబై జంట

**ముంబై-నవభూమి:** మరాఠీ మాట్లాడలేదనే కారణంతో ఫుడ్ డెలివరీ ఏజెంట్‌ను ఓ జంట వేధించింది. స్థానిక భాష మాట్లాడితేనే డబ్బులు ఇస్తామంటూ జబర్దీ చేసిన ఘటన ముంబైలోని భండూప్ ప్రాంతంలో చోటుచేసుకున్నది. ఈ నెల 12న భండూప్ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌కు పిజ్జా డెలివరీ చేయడానికి రోహిత్ లెవ్రే అనే డెలివరీ ఏజెంట్ వచ్చాడు. అతని నుంచి ఆర్డర్ తీసుకున్న దంపతులు.. డబ్బులు ఇవ్వడానికి నిరాకరించారు.మరాఠీలో మాట్లాడితేనే డబ్బులు చెల్లిస్తామంటూ ఆర్డర్ చేసిన కపుల్స్ షరతు పెట్టారు. ఇంటి డోర్‌కు ఉన్న గ్రిల్‌కు తాళం వేసిన దంపతులు.. లోపల నుంచి అతనితో వాదనకు దిగారు.



దీనినంతటినీ అతడు తన సెల్‌ఫోన్‌లో బంధించాడు. 'ఆర్డర్ తీసుకుంటాం. కానీ మీరు మరాఠీలో మాట్లాడితేనే డబ్బులు చెల్లిస్తాం' అంటూ ఆ మహిళ అనడం వీడియోలో వినవచ్చు. దీనికి, 'మరాఠీ మాట్లాడాలని రూల్ ఏమీ లేదుగా, అలా అని ఎవరు చెప్పారంటూ' రోహిత్ వారిని ప్రశ్నించాడు. ఇక్కడ ఇలాగే ఉంటుందంటూ ఆమె బదులిచ్చింది. ప్రతిగా మీ డిమాండ్ వెనుక ఉన్న లాజిక్ ఏంటని అతడు ప్రశ్నించాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. డెలివరీ ఏజెంట్‌ను వేధించిన ఆ దంపతులపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మాజీ ఆర్మీ జవాన్‌ను చంపి.. మృతదేహాన్ని ముక్కలుగా నరికిన భార్య, ఆమె ప్రియుడు



**లక్నో-నవభూమి:** మాజీ ఆర్మీ జవాన్‌ను అతడి భార్య, ఆమె ప్రియుడు మరో ఇద్దరితో కలిసి నరికి చంపారు. మృతదేహాన్ని ఆరు ముక్కలుగా నరికారు. ఆ భాగాలను పలు చోట్ల పడేశారు. మృతదేహం భాగాలను గుర్తించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చివరకు నిందితులను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బహదూర్‌పూర్ ప్రాంతంలో నివసించే 62 ఏళ్ల మాజీ సైనికుడు దేవేంద్ర కుమార్‌ను భార్య, ఆమె ప్రియుడు మరో ఇద్దరు వ్యక్తులతో కలసి ఇంట్లో హత్య చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని ఆరు ముక్కలుగా నరికారు. వాటిని పాలిథిన్ కవర్లలో చుట్టి పలు చోట్ల పడేశారు. మే 10న తన భర్త కనిపించడం లేదని 44 ఏళ్ల మాయా దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది.కాగా, అదే రోజు ఉదయం ఖరీద్ గ్రామం సమీపంలోని పొలంలో పడేసిన తెగిన చేతులు, కాళ్లను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. మృతుడ్ని మాజీ సైనికుడు దేవేంద్ర కుమార్‌గా గుర్తించారు. తొలుత పోలీసులను తప్పుదారి పట్టించేందుకు భార్య మాయా దేవి ప్రయత్నించింది. అయితే తండ్రి దేవేంద్ర కుమార్‌ను తల్లే చంపిందని కుమార్తె అంబ్లి పోలీసులకు చెప్పింది.మరోవైపు మాయా దేవిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. లారీ డ్రైవర్ అయిన ప్రియుడు అనిల్ యాదవ్, మరో ఇద్దరు వ్యక్తులైన మిథిలేష్ పటేల్, సతీష్ యాదవ్ సహాయంతో భర్తను హత్య చేసినట్లు ఆమె ఒప్పుకున్నదని పోలీస్ అధికారి తెలిపారు. ఆమె చెప్పిన ఆధారాల మేరకు ఖరీద్ దరౌలి గ్రామంలోని బావిలో పడేసిన మొండెంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మాయా దేవితోపాటు మిథిలేష్ పటేల్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.కాగా, మంగళవారం పరిఖారాలో వాహనాల తనిఖీ సమయంలో అనిల్ యాదవ్, సతీష్ యాదవ్‌లను పోలీసులు గుర్తించారు. అనిల్ యాదవ్ కాల్పులు జరుపడంతో అతడి కాలుపై కాల్పులు జరిపి అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. కంట్రీ మేడ్ పిస్టల్, స్పెండ్ కార్ట్రిడ్జ్, లైవ్ రౌండ్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సతీష్ యాదవ్ నుంచి హత్యాయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అనిల్ యాదవ్‌తో వివాహేతర సంబంధం ఉన్నందున మాజీ ఆర్మీ జవాన్ అయిన తన భర్తను మాయా దేవి హత్య చేసిందని ఎస్పీ వెల్లడించారు.

## యుద్ధ నౌకలతో కరాచీ పోర్టును దిగ్బంధించాం : నేవీ అధికారులు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా తాము ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధ నౌక సహా 36 షిప్‌లతో పాకిస్థాన్ లోని కరాచీ పోర్టు ను దిగ్బంధించామని భారత నేవీ అధికారులు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఇటీవల భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. దాదాపు 100 మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఉగ్రవాదులకు మద్దతుగా పాకిస్థాన్ సైన్యం భారత్‌పై దాడులకు దిగింది. ఈ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. పాకిస్థాన్ ప్రతిస్పందిస్తుందని ముందే పసిగట్టిన నావికాదళం నాడు సముద్ర సంసిద్ధతను గణనీయంగా పెంచింది. కరాచీ పోర్టు లక్ష్యంగా బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధ నౌకతోపాటు మొత్తం 36 షిప్‌లను, జలాంతర్గాములను మోహరించింది. ఈ విషయాన్ని తాజాగా నేవీ అధికారులు వెల్లడించారు. నౌకల మోహరింపుతోనే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని చెప్పారు.ఆపరేషన్ సింధూర్ వేళ పాకిస్థాన్‌పై తాము త్రిముఖ ఒత్తిడి వ్యూహాన్ని ప్రయోగించామని నావికాదళ అధికారులు తెలిపారు. కరాచీ పోర్ట్ లక్ష్యంగా 36 ఫ్రంట్‌లైన్ నావికాదళాలను మోహరించామన్నారు. వాటిలో బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన ఏడు డిస్ట్రాయర్లు, మీడియం-రేంజ్ సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణులు , వరుణాస్త్ర హెవీవెయిట్ టార్పెడో ఉన్నాయని చెప్పారు. వీటిలో కొత్తగా ప్రవేశపెట్టిన తుషిల్‌తో సహా ఏడు స్టెల్త్ గైడెడ్-క్షిపణి యుద్ధనౌకలు సైతం ఉన్నట్లు తెలిపారు.ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కరాచీ పోర్టును దిగ్బంధించడం వల్ల పాకిస్థాన్ నావికాదళం సమర్థవంతంగా ప్రతిస్పందించలేకపోయిందని అధికారులు చెప్పారు. కేవలం నౌకాశ్రయానికే పరిమితం కావాల్సి వచ్చిందన్నారు. ఈ ఉద్రిక్త పరిస్థితుల వేళ అంతర్జాతీయ వాణిజ్య నౌకలు తమ దారిని మళ్లించుకున్నాయని తెలిపారు. కాగా భారత సన్నద్ధతను చూసి పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చింది. పాకిస్థాన్ డీజీఎంవో హాట్‌లైన్‌లో భారత డీజీఎంవోతో మాట్లాడి కాల్పుల విరమణ ప్రతిపాదన చేశారు. అందుకు భారత్ అంగీకరించింది.

## భారత ఓడరేవులో 21 మంది పాకిస్థానీలు..

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాకిస్థాన్ మధ్య చెలరేగిన ఉద్రిక్తతలు ఇప్పుడిప్పుడే సద్దుమణుగుతున్నప్పటికీ దేశంలోని అన్ని ఓడరేవుల వద్ద కట్టుదిట్టమైన భద్రతను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాలోని పారదీప్ పోర్టు కు వచ్చిన ఓ ఓడ కలకలం రేపింది. ఆ ఓడలో 21 మంది పాకిస్థానీ సిబ్బంది ఉన్నట్లు అధికారులు గుర్తించడంతో కలకలం రేగింది. దాంతో ఆ పోర్టు భద్రతను మరింత పెంచారు. ఆ ప్రాంతంలో వెంటనే హై అలర్ట్ ((ప్రకటించారు.బుధవారం ఉదయం దక్షిణ కొరియా నుంచి సింగపూర్ మీదుగా ఓ నౌక పారదీప్ పోర్టుకు చేరింది. 'ఎమ్‌టీ సైరెన్ %××%' పేరుతో ఉన్న ఈ షిప్‌లో మొత్తం 25 మంది సిబ్బంది ఉన్నారు. ఈ షిప్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ కోసం ముడి చమురును తీసుకొచ్చింది. ఈ సందర్భంగా తనిఖీలు చేపట్టగా ఆ నౌకలోని సిబ్బందిలో 21 మందిని పాకిస్థానీలుగా గుర్తించారు. ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి దీని గురించి సమాచారం అందడంతో వెంటనే ఒడిశా మెరైన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు.పోర్టులో భద్రతను మరింత పెంచినట్లు మెరైన్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బబితా దుహేరి తెలిపారు. ఓడరేవు ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈ నౌక పోర్టుకు 20 కిలోమీటర్ల దూరంలోని 'పీఎం బెర్త్' వద్ద లంగర్ వేసి ఉంది. ఇందులో 11,350 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముడి చమురు అన్‌లోడింగ్ పూర్తయ్యేవరకు 25 మంది సిబ్బంది నౌక నుంచి బయటికి రాకుండా భద్రతాఏర్పాట్లు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## కల్నల్ సోఫియా ఖురేషిపై బీజేపీ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు.. తీవ్ర దుమారం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ ఆర్మీ అధికారిణి కల్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్‌కు చెందిన మంత్రి చేసిన వ్యాఖ్యలతో తీవ్ర దుమారం రేగుతోంది. ఈ వ్యాఖ్యలపై విపక్షాలు, మాజీ సైనికాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల "ఆపరేషన్ సిందూర్" సమయంలో విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రితో కలిసి పలుసార్లు మీడియా సమావేశాల్లో కనిపించిన కల్నల్ ఖురేషీ గురించి దేశం మొత్తం చర్చించుకుంది. ఈ క్రమంలో బీజేపీ నేత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా.. ఓ బహిరంగ ప్రసంగంలో ఆర్మీ అధికారిణిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇండోర్ సమీపంలో జరిగిన ఓ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు, సామాజిక, మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి.

ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ పార్టీ.. ఆయనను తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. వివాదం తీవ్రం కావడంతో మంత్రి విజయ్ షా దిగొచ్చారు. తన వ్యాఖ్యలపై క్షమాపణలు కోరుతూ ప్రకటనలు చేశారు. "మన దేశానికి కుల, మతాలకతీతంగా సేవ చేసిన సోదరి కల్నల్ సోఫియా ఖురేషి అంటే నాకు అపార గౌరవం... ఆమె మా స్వంత సోదరి కన్నా ఎక్కువ. నేను ఆమె సేవలకు సెల్యూట్ చేస్తున్నాను. నా మాటల వల్ల సమాజం లేదా మతాన్ని గాయపరిచినట్లైతే నేను పది సార్లు క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను' అని ఆయన అన్నారు.అయితే, తన ప్రసంగంలో పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ ఆయన చెసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. మతపరమైన కోణంలో మాట్లాడుతూ.. "ఉగ్రవాదులపై ప్రతీకార చర్యగా "వారి మతానికి చెందిన మన సోదరిని పంపి బుద్ధి చెప్పాం" అన్నట్లుగా ఆయన వ్యాఖ్యానించారు. కల్నల్ ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రితో కలిసి ఆపరేషన్ సిందూర్‌పై మీడియా సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

'పహల్గామ్ దాడిలో మన సోదరిల సిందూరాన్ని తుడిచివేసిన ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాం. ముష్కరుల స్థావరాలను వారి మతానికి చెందిన సోదరి ద్వారా నాశనం చేశాం. వారు మన హిందూ సోదరులపై దాడులు చేసి, కాల్పులు జరిపారు.. మోదీజీ వారి మతానికి చెందిన సోదరిని ఆర్మీ విమానంలో పంపించి వారి ఇళ్లలోనే వారిపై దాడి చేయించారు. వారు మన సోదరిలను విధవుల్ని చేస్తే.. మోదీజీ వారి మతానికి చెందిన సోదరిని పంపించి వారికి గుణపాఠం చెప్పారు' అంటూ మంత్రి వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి మన ధీరవనిత సోదరి కల్నల్ సోఫియా ఖురేషీ గురించి అత్యంత దారుణమైన, దిగజారిన వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రవాదులు దేశాన్ని చీల్చాలనుకున్నారు. కానీ ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశమంతా ఏకతాటిపై నిలబడి వారికి సమాధానం చెప్పింది. మోదీజీ, ఆ మంత్రిని వెంటనే తొలగించాలి" అని ఖర్గే డిమాడ్ చేశారు.మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతూ పట్వారీ ఈ వీడియోను షేర్ చేస్తూ. "ఇది బీజేపీ దురాశపూరిత ఆలోచనలకు, ద్వేషపూరిత రాజకీయ ధోరణికి నిదర్శనం"' అని వ్యాఖ్యానించారు. ఇది జాతీయ ఐక్యత, సైనిక గౌరవం, భారత మహిళల గౌరవంపై దాడిగా కాంగ్రెస్ అభివర్ణించింది.

## బీఎస్‌ఎఫ్ జవాన్‌ను విడుదల చేసిన పాక్



**న్యూఢిల్లీ-నవభూమి:** పొరపాటున సరిహద్దులు దాటిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) జవాన్ పూర్ణం కుమార్ సాహును పాకిస్థాన్ విడుదల చేసింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం 20 రోజుల కిందట సరిహద్దుల్లో పాక్ భూబాగంలోకి ప్రవేశించిన సాహును పాక్ రేంజర్లు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అటారీ సరిహద్దు వద్ద భారత సైనికాధికారులకు పూర్ణం కుమార్ సాహును పాక్ అదికారులు బుధవారం (మే 14న ) అప్పగించారు. కొన్నిసార్లు పొరపాటున సరిహద్దులు దాటి.. భారత జవాన్లు పాక్ భూభాగంలోకి వెళ్లడం.. పాక్ రేంజర్లు భారత భూభాగంలోకి రావడం సర్వసాధారణమే. అలాంటి సందర్భాల్లో ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారులు చర్చలు జరిపి.. ఎవరి సైనికులను వారి భూభాగంలోకి పంపిస్తూ ఉంటారు. కానీ, జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరడంతో పూర్ణం కుమార్ సాహును పాక్ వదిలిపెట్టకుండా తాత్సారం చేసింది.

పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ ప్రాంతంలో విధుల్లో ఉన్న పశ్చిమ్ బెంగాల్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ సాహు.. స్థానికంగా ఉండే రైతుల పంటలకు గస్తీ నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే, ఏప్రిల్ 23న బుధవారం రోజు కూడా కొంత మంది రైతులకు గస్తీ కాస్తున్న ఆయన.. ఎండ వేడికి తట్టుకోలేక అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో సమీపంలో ఓ చెట్టు కనిపించడంతో అక్కడకు వెళ్లి కాస్త విశ్రాంతి తీసుకోవాలనుకున్నారు. వెంటనే నడుచుకుంటూ వెళ్లి పడుకున్నారు. అయితే అది పాక్ భూభాగం కావడం.. పాక్ రేంజర్లు ఆ విషయాన్ని గుర్తించడంతో బీఎస్ఎఫ్ జవాన్ పీకే సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

వెంటనే సాహును వదిలిపెట్టాలని అట్టారి-వాఘా సరిహద్దు వద్ద బీఎస్ఎఫ్. పాక్ రేంజర్స్ మధ్య జరిగిన ఫ్లాగ్ మీటింగ్‌లో కోరారు. పొరపాటున భారత భూభాగం నుంచి పాక్ భూభాగంలోకి అడుగు పెట్టాడని.. అతడ్ని వదిలేయాలని బీఎస్ఎఫ్ అధికారులు..సూచించారు. కానీ, పాక్ రేంజర్లు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకే భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ ప్రారంభించడంతో సాహు విడుదల మరింత జాప్యమైంది.

గర్భవతి అయిన జవాన్ భార్య రజని షాహు.. సహా కుటుంబం మొత్తం అతడి యోగక్షేమాలపై ఆందోళన చెందింది. మా బిడ్డ ఎప్పుడు తిరిగొస్తాడని.. అతడు క్షేమంగా ఉన్నాడా? అని అనుమానం వ్యక్తం చేశారు. తన భర్త క్షేమంగా తిరిగి రావాలని అతడి భార్య రజని ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఆమె కోల్‌కతా నుంచి పఠాన్‌కోట్‌కు వెళ్లి అధికారులను కలిసి తన భర్త గురించి మాట్లాడారు. కుమార్ సాహు త్వరగా విడుదల అవుతారని అధికారులు హామీ ఇవ్వడంతో రజని తిరిగి కోల్‌కతాకు

## కాల్పుల విరమణకు అంగీకారం.. మోదీ నిర్ణయం వెనక కారణాలు వివరించిన జయప్రకాష్ నారాయణ



**హైదరాబాద్-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టగా.. పాకిస్థాన్ ప్రతిదాడులు చేయడంతో.. ఇరు దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు తలెత్తాయి. ఒకానొక పరిస్థితిలో ఇరు దేశాలు పూర్తి స్థాయిలో యుద్ధ రంగంలోకి దిగడమే తరువాయి అనే పరిస్థితి వచ్చింది. పీఓకేని తిరిగి సొంతం చేసుకోవడానికి ఇదే మంచి ఛాన్స్ అని చాలా మంది భారతీయులు అనుకున్నారు. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. కాల్పుల విరమణకు రెండు దేశాలు అంగీకరించాయి. దీంతో ప్రస్తుతం సరిహద్దుల్లో పరిస్థితులు సద్దుమణుగుతున్నాయి.పాక్‌పై భారత్ పైచేయి సాధించిన పరిస్థితుల్లో.. మోదీ సర్కారు హఠాత్తుగా కాల్పుల విరమణకు అంగీకరిం చడాన్ని చాలా మంది జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ మాత్రం దానికి యుద్ధం ఎందుకు ప్రారంభించారనే ప్రశ్న తలెత్తుతోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలు ఇందిరా గాంధీ గతంలో అమెరికాను ఎదిరించి మరీ పాకిస్థా న్‌తో యుద్ధం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. మోదీ పిరికివాడని విమర్శిస్తున్నారు. అయితే మోదీ ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారనేది చాలా మందికి ఇప్పటికీ అంతుపట్టడం లేదు. ఈ నేపథ్యంలో లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. మోదీ తీసుకున్న నిర్ణయం వెనక కారణాలను విశ్లేషించారు. 21వ శతాబ్దంలో దేశాలు.. యుద్ధం చేసే పరిస్థితులు ఉన్నాయా అనే అంశాలను కూడా ఆయన ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో క్షుణ్ణంగా వివరించారు. ఆ వివరాలు.."యుద్ధం అనేది పరిణితి లేని ఆలోచన. ఏ దేశం మరో దేశాన్ని నాశనం చేయలేదు. అమెరికా లాంటి అగ్రరాజ్యం సైతం అఫ్ఘనిస్తాన్, వియత్నాం వంటి చిన్న దేశాలను ఎందుకు నాశనం చేయలేకపోయింది.. సామర్థ్యం లేక కాదు. యుద్ధం పరిష్కారం కాదు కనుకే. మన దేశ ప్రజలను కాపాడుకోవడానికి ఎంతో ఒడుపు కావాలి.. దీర్ఘకాలిక ప్రయోజనాలు ముఖ్యం. మన దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చుకోవడం.. మనవైపు వేరే ఎవరు కన్నెత్తి చూడలేని విధంగా ఎదగడం ముఖ్యం.. దేశ భవిష్యత్తు మన ఆర్థిక వ్యవస్థ మీద మీద ఆధారపడి ఉంటుంది. అలా కాదని యుద్ధానికి కాలు దువ్వడమంటే దుస్సాహసానికి ఒడిగట్టడమే అవుతుంది. పాకిస్థాన్‌తో యుద్ధం అవసరం లేదు.. అది మనకు సమఉజ్జి కానే కాదు" అని జయప్రకాశ్ నారాయణ తన వైఖరిని స్పష్టం చేశారు."ఒకప్పుడు చాలా మంది మనం, పాకిస్థాన్ సమఉజ్జీలం అని భావించేవారు. కానీ ఇప్పుడు కాదు. పాకిస్థాన్‌కు, మనకు పోలికే లేదు. మనం ఇప్పుడు అమెరికా, చైనాకు ధీటుగా నిలవాలి. మన ప్రయోజనాల గురించి ఆలోచించాలి. ఆపరేషన్ సిందూర్ తర్వాత దేశంలోని రాజకీయ పార్టీలన్నీ చాలా హుందాగా ప్రవర్తించాయి. దేశం లోపల ఎన్ని అనుకున్నా ఏం కాదు.. కానీ బయట చాలా సంయమనంగా వ్యవహరించాలి. మోదీ నిర్ణయంపై ఎలా స్పందించాలి అనే దానిపై ప్రజలు నిర్ణయించుకుంటారు. అది వారి విజ్ఞతకే వదిలేయాలి" అని జేపీ అన్నారు."అలానే ఈ విషయంలో ప్రభుత్వం, సైనిక దళాలు, ప్రధాన మంత్రి, రాజకీయ వ్యవస్థ, భారతీయ సమాజం అందరూ చాలా చక్కగా స్పందించారు. కేవలం మీడియా, సోషల్ మీడియా మాత్రమే అనుచితంగా స్పందించింది. దుడుకుతనం, రెచ్చగొట్టే విధంగా వ్యవహరించింది. ఈ డిజిటల్ యుగంలో ఇలా దుడుకుతనంగా వ్యవహరించడం సరైంది కాదు. కానీ ఇది మీడియా నుంచే వచ్చింది. సోషల్ మీడియా వీరులు దూకుడు తగ్గించుకోవాలి. ఒక దేశాన్ని పూర్తిగా నాశనం చేస్తామనేది నేటి కాలంలో సాధ్యం అయ్యే పరిస్థితి కాదు" అని జేపీ తెలిపారు."అందుకే ప్రధానమంత్రి రష్యాకు బహిరంగంగా చెప్పారు. ఇది యుద్ధాల కాలం కాదు. అలా అని సైన్యం వద్దా అంటే కాదు. యుద్ధాన్ని ఆపాలన్నా సైనిక బలం కావాలి. సైన్యం లేకుండా యుద్ధం వద్దు అనడం పిరికిపంద చర్య అవుతుంది. అది బలహీనులు మాట్లాడే మాట. యుద్ధం చేసే బలం ఉండీ.. సంయమాన్ని పాటిస్తేనే అప్పుడు మన మాటకు విలువ ఉంటుంది.. మన ప్రయోజనాలు కాపాడుకోగలుగుతాం" అని జేపీ స్పష్టం చేశారు."ప్రస్తుతం సోషల్ మీడియాను చూస్తే.. అసహ్యం వేస్తుంది. ఒకప్పుడు ఫిల్టర్స్ ఉండేవి.. ఒక వ్యక్తి మాట్లాడితే.. దానికి ఒక విలువ ఉండేది కానీ ఇప్పుడు ఎవరు పడితే వారు.. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారు. వారికి అంతర్జాతీయ రాజకీయాలు, దౌత్య పరిస్థితులు తెలియవు. వారన్నట్లు పాలకులు స్పందించలేరు. వారికి దేశం, దేశ ప్రయోజనాలు ముఖ్యం" అని వివరించారు జయప్రకాశ్ నారాయణ.

## గూగుల్ క్రోమ్ యూజర్లకు కేంద్రం వార్నింగ్..

**న్యూఢిల్లీ-నవభూమి:** గూగుల్ క్రోమ్ బ్రౌజర్ వాడుతున్న విండోస్, మాక్ యూజర్లను కేంద్రం హెచ్చరించింది. గూగుల్ క్రోమ్‌లో పలు లోపాలు ఉన్నాయని.. వాటిని హ్యాకర్స్‌కు అవకాశంగా మారే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వంలో నడిచే కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ పేర్కొంది. విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్, మ్యాక్ యూజర్స్‌తో పాటు మ్యాక్ యూజర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గూగుల్ క్రోమ్‌లోని లోపాలతో ఆయా కంప్యూటర్స్ హ్యాకర్ల బారినపడే ప్రమాదం ఉంటుందని చెప్పింది. సమాచారాన్ని తస్కరించే అవకాశాలుంటాయని పేర్కొంది. హ్యాకర్స్ నుంచి తప్పించుకునేందుకు యూజర్లు తప్పనిసరిగా క్రోమ్‌ని అప్‌డేట్ చేయాలని సూచించింది. క్రోమ్ సెక్యూరిటీ ప్యాచ్‌లు వస్తే.. వెంటనే అప్‌డేట్ చేయాలని చెప్పింది. ముఖ్యంగా.. 136.0.7103.48/49కి ముందు వెర్షన్ గూగుల్ క్రోమ్‌ని వాడుతున్నట్లయితే తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని చెప్పింది.

విండోస్, మ్యాక్ ఓఎస్‌లోయూజర్లు తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని తెలిపింది. హెచ్‌టీఎంఎల్‌లో హీప్ బఫర్ ఓవర్‌ఫ్లో, అవుట్ ఆఫ్ బౌండ్స్ మెమరీ యాక్సెస్, DevToolsలో లోపాల కారణంగా హ్యాకర్లు వాటిని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొంది. దాంతో సున్నితమైన డేటాను యాక్సెస్ చేయడంతో పాటు సిస్టమ్‌ని వారి నియంత్రణలోకు తీసుకునే అందుకు అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే, లినక్స్ ఓఎస్‌లో గూగుల్ క్రోమ్ 136.0.7103.59 వర్షెన్లకు ముందు వాడే వారం తా లేటెస్ట్ బ్రౌజర్‌కు మారాలని లేకపోతే.. అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. ఈ విషయంలో గూగుల్‌కు సమాచారం అందడంతో సెక్యూరిటీ ప్యాచ్‌లు విడుదల చేసిందని తెలిపింది. ని అప్‌డేట్ చేసేందుకు.. ఎగువ కుడి వైపున ఉన్న మూడు చుక్కలపై క్లిక్ చేయాలి. అందులో ఎడమవైపు కింద ఎబౌట్ అనే ఆప్షన్ కనిపిస్తుంది.

## బిట్‌శాట్ - 2025 ఎగ్జామ్ స్లాట్‌ను ఇలా బుక్ చేసుకోండి..!



**న్యూఢిల్లీ-నవభూమి:** బిట్‌శాట్ 2025 సెషన్ 1 పరీక్ష కోసం అభ్యర్థుల స్లాట్ బుకింగ్‌లు మొదలయ్యాయి. అందుకోసం బిట్‌శాట్ అధికారిక వెబ్‌సైట్‌లో లింకును యాక్టివేట్ చేశారు. అయితే బిట్‌శాట్ 2025 స్లాట్ బుకింగ్ పోర్టల్‌ను యాక్సెస్ చేయడానికి అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌ను వినియోగించాలి. ఈ పోర్టల్ ద్వారా అభ్యర్థులు తమకు నచ్చిన పరీక్ష తేదీ, టైమ్ స్లాట్, టెస్ట్ సెంటర్‌ను ఎంపికచేసుకోవచ్చు. బీఈ, ఎమ్మెస్సీ, బీఫార్మా తదితర కోర్సులలో ప్రవేశాల కోసం ఏటా బిటిశాట్ పరీక్ష నిర్వహిస్తారు.

బిటశాట్ 2025 పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. తొలి సెషన్ పరీక్షలు మే 26 నుంచి మే 30 వరకు, రెండో సెషన్ పరీక్షలు జూన్ 22 నుంచి జూన్ 26 వరకు జరుగుతాయి. సెషన్ 1 పరీక్షల కోసం స్లాట్ బుకింగ్స్ మే 13న ప్రారంభమయ్యాయి. మే 16 చివరి తేదీ. మే 23న హాల్‌టికెట్‌లు విడుదల చేయనున్నారు.

**స్లాట్ బుకింగ్ ఎలా..?**

ముందుగా బిట్‌శాట్ అధికారిక వెబ్‌సైట్ కు వెళ్లాలి. స్లాట్ బుకింగ్ లింక్‌పై క్లిక్ చేయాలి. అక్కడ అభ్యర్థులు తమ దరఖాస్తు నెంబర్, పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేయాలి. అనంతరం 'లాగిన్' బటన్ నొక్కాలి. ఆ తర్వాత ప్రాధాన్యత, లభ్యత ప్రకారం పరీక్ష తేదీలను, స్లాట్లను, పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసుకోవాలి.

**గైడ్‌లైన్స్..**

బిట్‌శాట్ 2025 పరీక్షను ఒక అభ్యర్థి గరిష్ఠంగా రెండుసార్లు రాయవచ్చు. రెండు సెషన్‌లలో పరీక్షలు రాసేందుకు అభ్యర్థులు అర్హులు. అయితే అభ్యర్థి ముందుగా ఒక సెషన్‌ను మాత్రమే ఎంచుకోవాలి. రెండో సెషన్ కోసం మే 26 నుంచి జూన్ 10వ తేదీ వరకు స్లాట్ బుకింగ్స్ జరుగుతాయి. రెండు సెషన్‌లలో అభ్యర్థికి ఏ సెషన్‌లో ఎక్కువ మార్కులు వస్తే ఆ సెషన్ మార్కులను పరిగణలోకి తీసుకుంటారు.

**ఫీజు వివరాలు**

కేవలం ఒక సెషన్‌లో మాత్రమే పరీక్ష రాసేందుకు పురుష అభ్యర్థులైతే రూ.3500, మహిళా అభ్యర్థులైతే రూ.3000 ఫీజు చెల్లించాలి. రెండు సెషన్‌ల కోసం పురుష అభ్యర్థులు రూ.5500, మహిళ అభ్యర్థులు రూ.4500 చెల్లించాల్సి ఉంటుంది.

## పెళ్లైన కొన్ని రోజులకే.. సవతి కొడుకును కోల్పోయిన బీజేపీ నేత



**కోల్‌కతా-నవభూమి:** లేటు వయసులో పెళ్లి చేసుకున్న పశ్చిమ బెంగాల్ బీజేపీ నేత దిలీప్ ఘోష్ తన సవతి కొడుకును కోల్పోయారు. భార్య రింకూ మజుందర్ కుమారుడు శ్రీంజయ్ దాస్‌గుప్తా మంగళవారం రాత్రి తన ఫ్లాట్‌లో మరణించాడు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న అతడు తల్లి తనను వీడి ఘోష్ ఇంట్లో ఉండటంపై తీవ్ర మనస్థాపం చెందినట్లు తెలుస్తున్నది. బీజేపీ మాజీ ఎంపీ, మాజీ బెంగాల్ పార్టీ చీఫ్ దిలీప్ ఘోష్ 60 ఏళ్ల వయస్సులో బీజేపీ మహిళా విభాగం నాయకురాలైన రింకూ మజుందర్‌ను ఏప్రిల్ 18న పెళ్లి చేసుకున్నారు. ఆమె తొలి భర్త సంతానమైన 26 ఏళ్ల శ్రీంజయ్ దాస్‌గుప్తా ఐటీ సంస్థతో పని చేస్తున్నాడు.

మంగళవారం రాత్రి న్యూ టౌన్ ఫ్లాట్‌లో అతడు మరణించాడు.కాగా, తీవ్రమైన రక్తస్రావంతో కూడిన ప్యాంక్రియాటైటిస్ సమస్య వల్ల శ్రీంజయ్ మరణించినట్లు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో తేలింది. అయితే పెళ్లి తర్వాత తాను దిలీప్ ఘోష్ ఇంటికి మారడంపై కుమారుడు అసంతృప్తితో ఉన్నట్లుగా తెలిసిందని రింకూ మజుందర్ తెలిపారు. 'అతడు సరిగ్గా తినడం లేదని, మందులు వేసుకోవడం లేదని నాకు తెలుసు. తన అంసంతృప్తిని ఎప్పుడూ నాకు చెప్పలేదు. కానీ ఒక తల్లిగా కుమారుడి బాధను అర్థం చేసుకున్నా. ఘోష్ ఇంటికి తీసుకెళ్లాలని అనుకున్నా. ఆదివారం 'మదర్స్ డే' రోజున వచ్చి కలిసి గిఫ్ట్ ఇచ్చాడు' అని మీడియాతో అన్నారు. అతడి స్నేహితురాలితో త్వరలో కుమారుడి పెళ్లి జరుగాల్సి ఉందని చెప్పారు.మరోవైపు సవతి కుమారుడ్ని కోల్పోవడంపై దిలీప్ ఘోష్ ఆవేదన చెందారు. 'ఇది నా దురదృష్టం. నేను చాలా దురదృష్టవంతుడ్ని. కొడుకు పుట్టడం వల్ల కలిగే ఆనందాన్ని నేను ఎప్పుడూ అనుభవించలేదు. కానీ ఒక కొడుకును కోల్పోయినందుకు నేను దుఃఖిస్తున్నా. శ్రీంజయ్ నాకు చాలా దగ్గరయ్యాడు' అని వాపోయారు.

## డూప్లికేట్ ఓటర్ కార్డ్ సమస్య పరిష్కారం.. ఎన్నికల సంఘం వెల్లడి

**న్యూఢిల్లీ-నవభూమి:** ఓటరు ఐడీ నెంబర్లకు చెందిన 20 ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. డూప్లికేట్ ఓటర్ ఐడెంటిటీ కార్డు నెంబర్ల సమస్యకు చెక్ పెట్టినట్టు తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ రోజు కీలక ప్రకటన చేసింది. 2005 నుంచి ఎన్నికల సంఘం వివిధ రాష్ట్రాల్లో ఓటర్ కార్డుల కోసం ఓవర్‌లాపింగ్ ఆల్ఫాన్యూమరిక్ సిరీస్‌ను వాడుతోంది. దీంతో డూప్లికేట్ ఓటర్ ఐడీ నెంబర్ల సమస్య మొదలైంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ గురువారం 15 । మే । 2025

## విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' రిలీజ్ వాయిదా..!



విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ డ్రామా మూవీ కింగ్‌డమ్. ఈ మూవీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో సినిమాకు సంబంధించి మేకర్స్ కీలక అప్‌డేట్‌ని మేకర్స్ అందించారు. ఈ మూవీ రిలీజ్‌ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం ఈ మూవీ మే 30న విడుదల కావాల్సింది. ఈ మూవీని జులై 4న విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. కింగ్‌డమ్ మూవీని మే 30న విడుదల చేయాలని ఎంతో ప్రయత్నించామని.. కానీ, ఇటీవల దేశంలో ఊహించని ఘటనలు జరిగాయని పేర్కొంది.దేశంలోని వాతావరణం కారణంగా, ప్రమోషన్‌లు కష్టంగా మారాయని.. ఈవెంట్స్ నిర్వహించడం సరికాదని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. జులై 4న మూవీని విడుదల చేస్తామని సితార ఎంటర్‌టైన్‌మెంట్ ప్రకటించింది. మూవీ ఆలస్యంగా వచ్చినా అభిమానుల ప్రేక్షకుల అంచనాలకు తగ్గకుండా ఉంటుందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఇప్పటికే విడుదలైన మూవీకి స్పందించిన స్పెషల్ వీడియోకు మంచి స్పందన వచ్చింది. దాంతో మూవీనిపై భారీ అంచనాలున్నాయి. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నది. సత్యదేవ్ కీలకపాత్రలో నటిస్తున్నాడు.

నవచిత్ర



# నిర్మాత నాని నెక్స్ట్ గురి ఎవరు..?



సక్సెస్ హీరోగానే కాదు సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా కూడా నాని తన మార్క్ ఏంటన్నది చూపిస్తున్నాడు. నాని సినిమా అంటే అది తను నటించిన సినిమానే అయినా లేదా నిర్మాతగా చేసిన సినిమా అయినా పక్కా కంటెంట్ ఉంటుందని ఫిక్స్ అయ్యారు. అందుకే అతని సినిమాలకు మంచి ఫలితాలు వస్తున్నాయి. అ! సినిమాతో మొదలైన నాని ప్రొడక్షన్ హిట్ 3 తో కూడా హిట్ మేనియా కొనసాగించారు. ఐతే ఈమధ్యనే నాని నుంచి కోర్ట్ సినిమా వచ్చింది. రామ్ జగదీష్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న కోర్ట్ సినిమా సూపర్ సక్సెస్ అందుకుంది. ఈ సినిమా విషయంలో నాని మొదటి నుంచి పర్ఫెక్ట్ ప్లానింగ్ తో వచ్చాడు. కోర్ట్ సినిమా తర్వాత నాని నెక్స్ట్ సినిమా ఏమవుతుందా అన్న చర్చ మొదలైంది. అంతేకాదు నాని నిర్మాణంలో సినిమా చేయాలని దర్శకులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. నాని చేతిలో పడితే డైరెక్టర్ గా ఫేట్ మారినట్టే అని ఫిక్స్ అయ్యారు. నాని నిర్మాతగా వాల్ పోస్టర్ ప్రొడక్షన్ బ్యానర్ లో నెక్స్ట్ సినిమా ఏం అవుతుంది అన్నది తెలియాల్సి ఉంది. ఐతే నాని ఏ సినిమాతో వచ్చినా సరే తప్పకుండా ఆడియన్స్ ని ఎంగేజ్ చేసే సినిమాతోనే వస్తారని ఫిక్స్ అయ్యారు. ఐతే నాని తన వాల్ పోస్టర్ సినిమాస్ మాత్రమే కాకుండా యునానిమస్ అంటూ మరో బ్యానర్ మొదలు పెట్టాడు. నాని తో పాటు స్టార్స్ తో చేసే సినిమాలకు యునానిమస్ బ్యానర్లో సినిమాలు చేయాలని ఫిక్స్ అవ్వగా.. వాల్ పోస్టర్ బ్యానర్ లో మాత్రం కంటెంట్ బేస్డ్ సినిమాలు చేయాలని చూస్తున్నాడు. ఏ ముహూర్తంలో నాని నిర్మాతగా మారాలని అనిపించిందో కానీ కంటెంట్ ఉన్న సినిమాలతో నాని నిర్మాతగా తన బ్రాండ్ వాల్యూని కొనసాగిస్తున్నాడు. తప్పకుండా నాని బ్యానర్ నుంచి గొప్ప సినిమాలు వస్తాయని చెప్పొచ్చు. కోర్ట్ తరహా రియల్ కంటెంట్ సినిమాలను నాని ఎంకరేజ్ చేయాలని చూస్తున్నాడు. మరి నాని ప్రొడక్షన్ లో నెక్స్ట్ సినిమా ఏం వస్తుందో చూడాలి. నాని యునానిమస్ ప్రొడక్షన్ లో మొదటిగా మెగాస్టార్ చిరంజీవి శ్రీకాంత్ ఓదెల కాంబో సినిమా లాక్ చేసిన విషయం తెలిసిందే. ప్యారడైజ్ సినిమా తర్వాత శ్రీకాంత్ ఓదెల చిరంజీవి సినిమా చేయనున్నాడు. ఆ సినిమాకు సంబంధించిన అప్డేట్స్ త్వర లో బయటకు రానున్నాయి.

## సీఎంతో డిన్నర్‌కి హాజరైన నాగార్జున, అల్లు అరవింద్.. ఇప్పుడిదే హాట్ డిస్కషన్



హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ 2025 పోటీలు ఇటీవల అట్టహాసంగా ప్రారం భమైన విషయం తెలిసిందే. తాజాగా నగరంలోని చారిత్రాత్మక చౌమహల్లా ప్యాలెస్‌లో అందాల భామల కోసం ప్రత్యేక విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. ఇక ఈ విందు కార్యక్ర మానికి తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తమ సతీమణితో కలిసి హాజరయ్యారు. పలువురు ప్రతినిధులు, కంటెస్టెంట్లు కూడా సందడి చేశారు. చారిత్రాత్మక చౌమహల్లా ప్యాలెస్ కి 109 దేశాల నుంచి కంటెస్టెంట్లు రాగా, వారి రాకతో చౌమొహల్లా ప్యాలెస్ మెరిసిపోయింది. మరోవైపు ఈ కార్యక్రమానికి అక్కినేని నాగార్జున , అల్లు అరవింద్ హాజరయ్యారు. వారు రేవంత్ రెడ్డి పక్కన కూర్చొని సరదాగా మాట్లాడుతూ కనిపించారు. ఇప్పుడు ఇది హాట్ టాపిక్ అయింది.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు అందుకున్న తర్వాత నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్ ని కూల్చి వేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నాగార్జున సీరియస్ అవుతూ, దానిపై కోర్టులో పోరాటం చేస్తానని కూడా అన్నాడు.. ఇక అల్లు అరవింద్ ఫ్యామిలీ విషయానికి వస్తే.. సంధ్య థియేటర్ తొక్కిసలాట సంఘటనలో అల్లు అర్జున్‌ని పోలీసులు అరెస్ట్ చేయడం, తెలంగాణ అసెంబ్లీలో అల్లు అర్జున్ విషయంలో రేవంత్ రెడ్డి కాస్త ఘాటుగా స్పందించడం మనం చూశాం. ఆ సమయంలో అల్లు అర్జున్.. రేవంత్ రెడ్డి పేరు మరిచిపోయిన కారణంగా ఆయనపై కక్ష్య కట్టారని కొందరు కామెంట్లు చేశారు.కట్ చేస్తే ఇప్పుడు రేవంత్ రెడ్డి .. నాగార్జున, అల్లు అరవింద్‌లతో కలిసి డిన్నర్‌లో పాల్గొనడం చర్చనీయాంశం అయింది. వారు సరదాగా మాట్లాడుకుంటూ కనిపించడంతో వివాదాలు సమసిపోయి ఉంటేయేమో అని నెటిజన్స్ ముచ్చటించుకుంటున్నారు. అల్లు అర్జున్‌కి కూడా ఇన్విటేషన్ పంపారని, కాని అందుబాటులో లేకపోవడం వలన డిన్నర్ కి హాజరు కాలేదని కొందరు చెబుతున్నారు. ప్రముఖ నిర్మాత సురేష్ బాబు కూడా ఈ ఈవెంట్ కి హాజరయ్యారు. మొత్తంగా రేవంత్ రెడ్డి సెలబ్రిటీస్‌తో కలిసి సరదాగా మాట్లాడుతుండడంతో అంతా ఆల్ హ్యాపీస్ అని, వివాదాలకు ముగింపు పలికినట్లే అని జనాలు ముచ్చటించుకుంటున్నారు.

# నయన్ కెరీర్లోనే మొదటిసారి ఇలా!



సౌత్ ఇండియన్ సినిమాలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది నయనతార. లేడీ సూపర్ స్టార్ గా ప్రశంసలు అందుకుంటున్న నయనతార చాలా కాలంగా ఎంతో డిమాండ్ ఉన్న హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు సొంతం చేసుకుంది. పలు సక్సెస్‌ఫుల్ సినిమాలు, మంచి ట్రాక్ రికార్డుతో నయనతార కమర్షియల్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలుగుతోంది. పెళ్లి అయినప్పటికీ నయన్ క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. మునుపటి లానే సినిమాలు చేస్తూ కెరీర్ లో ముందుకు దూసుకెళ్తుంది. స్టార్ హీరోయిన్ గా సత్తా చాటుతూ అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకునే హీరోయిన్ గా కొనసాగుతున్న నయన్ ఇప్పుడు తీసుకున్న ఓ నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అనిల్ రావిపూడి డైరెక్టర్ గా మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న తెలుగు సినిమా కోసం నయనతార తన రెమ్యూనరేషన్ ను ఎవరూ ఊహించని విధంగా తగ్గించిందని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మలయాళ సినిమాతో ఇండస్ట్రీకి అడుగుపెట్టి హీరోయిన్ గా కెరీర్ ను స్టార్ట్ చేసింది నయనతార. అప్పట్నుంచి తమిళ, తెలుగు సినిమాలతో పాటూ మొన్నామధ్య జవాన్ సినిమాలో షారుఖ్ తో కలిసి బాలీవుడ్ లో ఎంటరై అక్కడ కూడా భారీ అభిమానులను సొంతం చేసుకుంది నయన్. తెలుగులో నయనతార చివరిగా గాడ్‌ఫాదర్ సినిమాలో నటించింది. ఆ తర్వాత నయన్ నుంచి మరో తెలుగు సినిమా వచ్చింది లేదు. ఇప్పుడు మళ్లీ మెగాస్టార్ తో కలిసి నయన్ స్క్రీన్ షేర్ చేసుకోబోతుంది. అయితే ముందుగా ఈ సినిమా కోసం నయనతార రెమ్యూనరేషన్ రూ.18 కోట్లు అని వార్తలొచ్చాయి కానీ ఇప్పుడు ఆఖరిగా ఆమె పారితోషికాన్ని నిర్మాతలు రూ.6 కోట్లకు ఫిక్స్ చేసినట్టు సమాచారం. అయితే సడెన్ గా నయన్ రెమ్యూనరేషన్ తగ్గించడం ఆమె బ్రాండ్ వాల్యూకి దెబ్బ అని కొందరంటుంటే చిరంజీవి సినిమా రీజనల్ మూవీ కాబట్టే నయన్ తక్కువ ఛార్జ్ చేస్తుందని, టాక్సిక్ లాంటి భారీ ప్రాజెక్టులకు ఆమె భారీగానే ఛార్జ్ చేస్తుందని, పలు క్రేజీ ప్రాజెక్టులతో నయన్ మార్కెట్ చాలా స్ట్రాంగ్ గా ఉందని మరికొందరంటున్నారు. ఇదిలా ఉంటే కెరీర్ స్టార్టింగ్ నుంచి రెమ్యూనరేషన్ ను పెంచుకుంటూనే వెళ్తున్న నయన్ తన కెరీర్లో మొదటిసారి రెమ్యూనరేషన్ ను తగ్గించింది.

## బాలీవుడ్‌లో కళావతికి మరో బంపర్ ఆఫర్!



కీర్తి సురేష్ అలియాస్ కళావతి బేబీజాన్ తో బాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో వరుణ్ ధావన్ కి జోడీగా నటించింది. భారీ యాక్షన్ థ్రిల్లర్ గా రిలీజ్ అయిన చిత్రం మాత్రం ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో కళావతికి ఆరంభంలో చేదు అనుభవం తప్పలేదు. అయినా కీర్తికి కొత్త ఛాన్సులకేమి కొదవలేదన్నట్లు బ్యాక్ టూ బ్యాక్ ఛాన్సులందుకుంటుందనే ప్రచారం బాలీవుడ్ మీడియాలో పీక్స్ లో జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ప్రాజెక్ట్ లకు సంబంధించి అగ్రిమెంట్ జరిగినట్లు వార్తలొస్తున్నాయి. ఆ సినిమాలేంటి? అన్నది బయటకు రాలేదు కానీ తాజాగా రాజ్ కుమార్ రావుకి జోడీగా మరో చిత్రంలో ఎంపికైనట్లు తెలుస్తోంది. విద్యా వ్యవస్థ నేపత్యంలో రాజ్ కుమార్ రావు హీరోగా ఓ సినిమాకు సన్నాహాలు జరుగు తున్నాయి. ఈ చిత్రాన్ని ఆయనే సొంత బ్యానర్లో నిర్మిస్తున్నారు. సెక్టార్ 36 ఫేం ఆదిత్యా నింబాల్కర్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో హీరోయిన్ గా కీర్తి సురేష్ ఎంపికైంది. విద్యావ్యవస్థలో కుంభకోణాన్ని బయట పెట్టే పాత్రలో కీర్తి కనిపించనుంది. జూన్ లోనే చిత్రీకరణకు రంగం సిద్ధమవుతోంది. ఇదే నెలలో కీర్తి సీక్రెట్ గా ఉంచిన మరో ప్రాజెక్ట్ కూడా లాంచ్ అవుతుందని సమాచారం. మొత్తానికి అమ్మడికి తొలి సినిమాతో వైఫల్యం ఎదురైనా అవకాశాల పరంగా జోరందుకుంటుంది. ఇదే తరహాలో శ్రీలీల కూడా వరుస ఛాన్సులందుకుంటుంది. తొలి సినిమా రిలీజ్ కు ముందే రెండు..మూడు ప్రాజెక్ట్ లు రెడీగా చేతిలో పెట్టుకుంది. బాలీవుడ్ మేకర్స్ కూడా ఈ మధ్య కాలంలో సౌత్ భామలకు పెద్ద పీట వేస్తున్నారు. ట్యాలెంటెడ్ బ్యూటీలకు అవకాశాలు కల్పించడానికి ముందుకొస్తున్నారు. మునుపటి పరిస్థితికి పూర్తి భిన్నమైన సన్నివేశం బాలీవుడ్ మార్కెట్ లో కనిపిస్తోందిప్పుడు

## పవన్ పూర్తిచేసే వరకూ చెప్పరా?



పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు చిత్రీకరణ పూర్తి చేయడం తో ఈ సినిమా సరైన రిలీజ్ తేదీ కోసం మేకర్స్ సెర్చ్ చేస్తున్నారు. ఆ తేదీ లాక్ అవ్వగానే అధికారికంగా ప్రకటిం చనున్నారు. ఈ సినిమాకు సంబంధించి పవన్ డబ్బింగ్ పనులు పూర్తి చేయాలి. అందుకు పెద్దగా సమయం కేటాయించాల్సిన పనిలేదు కాబట్టి యూనిట్ రిలాక్స్ గా పోస్ట్ ప్రొడక్షన్ పనులు చేసుకుంటుంది. దీంతో ఓజీకి కూడా లైన్ క్లియర్ అయింది. ఈ సినిమా పెండింగ్ షూటింగ్ కూడా పవన్ పూర్తి చేసేస్తారని ఎదురు చూస్తోన్న తరుణంలో ఆయన షూట్ కు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. పవన్ పోర్షన్ కి సంబంధించి ఇంకా ఎన్ని రోజులు షూట్ ఉంటుంది? అన్నది మేకర్స్ రివీల్ చేయలేదు. కానీ పవన్ కారణంగా ఆలస్యమవుతుందన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో రిలీజ్ తేదీపై ఓజీ టీమ్ సైలెంట్ గా ఉంది. పవన్ పోర్షన్ పూర్తయ్యేంతవరకూ రిలీజ్ తేదీని ప్రకటించ కూడదని మేకర్స్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఎందుకంటే పవన్ ఎప్పుడు షూటింగ్ కి వస్తారో? ఎప్పుడు బ్రేక్ వేస్తారో? తెలియదు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ లో రిలీజ్ అనుకుంటున్నా తేదిని మాత్రం రివీల్ చేయకుండా హోల్డ్ లో పెట్టారు. ఒకవేళ షూటింగ్ అనుకున్న సమయంలో పూర్తయితే పర్వాలేదు. సెప్టెంబర్ లో మంచి ముహూర్తం చూసి రిలీజ్ చేస్తారు. ఒకవేళ చిత్రీకరణ పూర్తి కాకపోతే మళ్లీ భంగ పాటు తప్పదు. ఇప్పటికే పలుమార్లు రిలీజ్ తేదీలు ప్రకటించి వాయిదా వేసుకున్న సంగతి తెలిసిందే. మళ్లీ అలాంటి పరిస్థితి ఎదురవ్వకూడదని పీకే సెట్స్ కి వెళ్లినా? అంతా కామ్ గా ఉన్నారు. పవన్ రీజాయిన్ అయినా మేకర్స్ ఎలాంటి హడావుడి లేకుండా సైలెంట్ గా ఉన్నారు. పీకే జాయిన్ అయ్యారు కాబట్టి సెట్స్ నుంచి లీకులు ఎలాగూ వస్తాయి. అప్పటివరకూ వెయిట్ అండ్ సీ.

## రోహిత్ శర్మను అభినందించిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్



**న్యూఢిల్లీ-నవభూమి:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముంబయిలోని తన అధికారిక నివాసం 'వర్ష'లో రోహిత్ శర్మను అభినందించారు. ఇటీవల రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఫడ్నవీస్ అభినందనలు తెలుపుతూ.. భారత క్రికెట్‌కు చేసిన సేవలను ప్రశంసించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఫడ్నవీస్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. రోహిత్ ఇటీవల టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. గత సంవత్సరం టీ20 ప్రపంచ కప్‌లో టైటిల్ గెలిచిన తర్వాత రోహిత్ టీ20 ఇంటర్నేషనల్ నుంచి కూడా రిటైర్ అయ్యాడు. ఇకపై కేవలం వన్డేల్లో మాత్రం కొనసాగనున్నాడు. మే 7న టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు రోహిత్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా రోహిత్ వెల్లడించారు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో ప్రారంభమయ్యే ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు ముందు రోహిత్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. రోహిత్‌ను కలిసిన ఫొటోలను షేర్ చేస్తూ ఫడ్నవీస్.. 'భారత క్రికెటర్ రోహిత్ శర్మకు స్వాగతం. రోహిత్‌ను కలిసి మాట్లాడడం చాలా బాగుంది. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడం.. భవిష్యత్‌లో విజయం సాధించేందుకు శుభాకాంక్షలు తెలిపాను' అంటూ పేర్కొన్నారు. రోహిత్ శర్మ 67 టెస్టుల్లో 40.57 సగటుతో 4,301 పరుగులు చేశాడు. ఇందులో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2024-25 సీజన్‌లో రోహిత్ ఫామ్ లేమితో ఇబ్బందులుపడ్డాడు. ఈ సీజన్‌లో 15 మ్యాచ్‌ల్లో 10.83 సగటుతో 164 పరుగులు మాత్రమే చేయగలిగాడు. బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌తో జరిగిన స్వదేశీ సిరీస్‌లో రోహిత్ పేలవమైన ఫామ్‌లో తడబడ్డాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా వేదికగా జరిగిన మూడు టెస్టుల్లోనూ విఫలమైన విషయం తెలిసిందే.

## సఫారీ ఆటగాళ్లకు డెడ్‌లైన్.. ఐపీఎల్ మధ్యలోనే స్వదేశానికి..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐపీఎల్ 18 సీజన్ తదుపరి మ్యాచ్‌లు మరో మూడు రోజుల్లో మొదలు కానున్నాయి. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న జట్లు విదేశీ ఆటగాళ్ల కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా క్రికెట్ తమ ప్లేయర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దక్షిణాఫ్రికా బోర్డు సైతం ఐపీఎల్ తదుపరి మ్యాచ్‌లు ఆడేందుకు తమ క్రికెటర్లకు అనుమతి ఇవ్వనుంది. అయితే.. ప్లే ఆఫ్స్ మ్యాచ్‌ల కంటే ముందే స్వదేశం రావాలనే షరుతు పెట్టింది సఫారీ బోర్డు. జూన్‌లో ఆస్ట్రేలియాతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఉండడమే అందుకు కారణం.'మొదట అనుకున్న షెడ్యూల్ ప్రకారం మే 25న ఐపీఎల్ ఫైనల్ జరగాల్సి ఉంది. కానీ, భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా వారం పాటు టోర్నీ వాయిదా పడడంతో ఫైనల్ తేదీ జూన్ 3కి మారింది. అయితే, ముందస్తు ఒప్పందం ప్రకారం మే 25 వరకే మా ఆటగాళ్లు ఐపీఎల్ ఆడుతారు. మే 26న స్వదేశం బయల్దేరుతారు. ఆ తర్వాత 30వ తేదీన లండన్ చేరుకుంటారు. ఇందులో ఏ మార్పు లేదు' అని దక్షిణాఫ్రికా క్రికెట్, హెడ్‌కోచ్ శుక్రి కొన్రాడ్ స్పష్టం చేశారు.

నవక్రీడ

## నాలుగు నెలల్లోనే గుడ్‌న్యూస్.. తండ్రి కాబోతున్న చెస్ దిగ్గజం..!



**న్యూఢిల్లీ-నవభూమి:** చెస్ దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ తండ్రి కాబోతున్నాడు. కార్ల్‌సన్ భార్య ఎల్లా విక్టోరియా మలోనే త్వరలోనే మొదటి బిడ్డకు జన్మనివ్వనుంది. ఈ విషయాన్ని కార్ల్‌సన్ బుధవారం అభిమానులతో పంచుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అతడు బేబీ బంప్‌తో ఉన్న తన భార్య ఫొటోలను పోస్ట్ చేశాడు. 'గర్భవతి అయిన నా అందమైన భార్య' అంటూ ఆ ఫొటోలకు క్యాప్షన్ రాశాడు కార్ల్‌సన్. ఈ పోస్ట్ చూసిన చెస్ క్రీడాకారులు, అభిమానులు కార్ల్‌సన్ దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్నారు. పుట్టబోయే బిడ్డ గురించి ఎన్నో కలలు కంటున్నామని కార్ల్‌సన్ భార్య ఎల్లా చెబుతోంది.'మా ఆయన చెస్ షెడ్యూల్‌తో బిజీగా ఉండవచ్చు. మేము ఇటు పిల్లలను, అటు వృత్తిని ఎలా సమన్వయం చేసుకుంటామో నాకు తెలియడం లేదు. అయితే.. సంతానం కలగాలని మేమిద్దరం కోరుకుంటున్నాం. కార్ల్‌సన్ చదరంగం ఆటతో తీరిక లేకుండా ఉండచవ్చు. కానీ, అతడు గొప్ప తండ్రి అవుతాడనే నమ్మకం నాకుంది' అని ఎల్లా వెల్లడించింది. కొన్నాళ్లుగా ప్రేమించుకున్న కార్ల్‌సన్, ఎల్లా ఈ ఏడాది జనవరి 4వ తేదీన పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**